తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

ఆదివారం 01.03.2026 | సంపుటి : 12 సంచిక : 221 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్

# భీకర దాడులు

### టెహ్రాన్ అంతటా పేలుళ్ల మోత

### పలువురు కీలక నేతల కార్యాలయాలపై దాడులు

### దాడుల్లో కీలక సైనిక, ప్రభుత్వాధికారుల మృతి.. బాలికల పాఠశాలపై దాడిలో 40 మంది మృతి

టెహ్రాన్(జనంసాక్షి): ఇరాన్‌పై ఇజ్రాయిల్,అమెరికాలు సంయుక్తంగా క్షిపణ దాడులకు దిగాయి అణు ఒప్పందంపై అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడులకు పాల్పడింది. టెహ్రాన్ అంతటా పేలుళ్లు వినిపించాయి. దీంతో ఆ ప్రాంతంలో భారీగా పొగ వ్యాపించింది. అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిని తామే చేశామని టెల్‌అవీవ్ ప్రకటించింది. శత్రు దేశం నుంచి పొంచివున్న ముప్పును తప్పించేందుకు ఈ దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఈ క్రమంలో టెల్‌అవీవ్ సైన్యం తమ దేశ ప్రజలను అప్రమత్తం చేసింది. వైమానిక దాడులు జరిగే అవకాశం ఉన్నందున దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది. టెల్‌అవీవ్‌తో సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి. స్కూళ్లు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది.


మిగతా 2లో..



### ఇరాన్ ప్రతీకారదాడులు

#### రెడ్ కలర్‌లోకి ఇజ్రాయెల్ యాప్..

టెహ్రాన్(జనంసాక్షి): ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకెళ్లాయి ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఆ సమయంలో ఇజ్రాయెల్‌లోని హోమ్ ఫ్రంట్ కమాండ్ యాప్ ఎర్రగా మారిపోయింది. అది ఎప్పటికప్పుడు రియల్ టైమ్ హెచ్చరికలు, అత్యవసర మార్గదర్శకాలు చూపిస్తుంటుంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను అది గుర్తించడం మిగతా 2లో..




### మా మాట వినకుంటే ఇరాన్‌ను నాశనం చేస్తాం: ట్రంప్

### ఇరాన్‌తో అస్తిత్వ ముప్పు.. అందుకే దాడులు:నెతన్యాహు

### సంయమనం పాటించాలి.. దౌత్యమార్గాలను అనుసరించాలి

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ ఆందోళన

వివరాలు 2వపేజీల్లో..



## ఈ ప్రభుత్వం మీది.. అండగా ఉంటాం

- మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా
- బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల అందజేత

హైదరాబాద్(జనంసాక్షి): ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మదీనాలో ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనా పంపించామన్నారు. అక్కడి భారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నతుల్ బఖీలో చేయించామన్నారు. సహజంగా దేశం బయట జరిగే ప్రమాదాల్లో మృతిచెందిన వారికి ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని.. కానీ తాము మాత్రం మానవతా దృక్పథంతో సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల మిగతా 2లో..

### జల మండలికి శారదా పీఠం భూముల కేటాయింపు రద్దు

ఆదేశాలు జారీ చేసిన సీఎం రేవంత్

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

2లో..

### నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం రేవంత్

## దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

### వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది శనివారం రాజస్థాన్‌లో అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలిక లకు 'గార్డాసిల్' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. గర్భాశయ క్యాన్సర్ నివారణకు ప్రపంచస్థాయి వ్యూహంలో భాగంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సు మేరకు కేంద్రం దీనిని ప్రారంభించింది. ప్రతి ఏటా 1.15 కోట్ల వ్యాక్సిన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ వ్యాక్సిన్ 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 కోట్ల డోసులు పంపిణీ చేశారు. దీంతో పలు దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్లు అంచనా. 160 దేశాల్లో ఇప్పటికే ఈ టీకా పంపిణీ కార్యక్రమం అమల్లో ఉండగా.. వీటిలో 90 దేశాలు సింగిల్ డోసులు అందిస్తున్నాయి. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్యాపరంగా మిగతా 2లో..


### కక్షలతో ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు

#### హరీశ్ రావు

హైదరాబాద్(జనంసాక్షి): మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వరుసగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా ఎదుర్కోలేక.. పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు మిగతా 2లో..







## బతుకులు బుగ్గి

### బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు

### ఘటనలో 21మంది మృతి...పలువురికి గాయాలు



- కాకినాడ జిల్లా సామర్లకోట సమీపంలోని వేట్లపాలెం వద్ద ఘటన
- పేలుడు ధాటికి దట్టంగా అలముకున్న పొగ
- 5 కి.మీ వరకు పేలుడు శబ్దాలు వ్యాప్తి
- పేలుడు ఘటన తరవాత యజమాని పరార్
- పొలాల మధ్య షెడ్డులో తయారీ కేంద్రం
- బురదవల్ల ఫైరింజన్ల రాక కష్టం
- పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి
- సహాయక చర్యలపై అధికారులకు ఆదేశం
- ఘటనపై ప్రధాని మోదీ సంతాపం
- మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటన

కాకినాడ,ఫిబ్రవరి28(జనంసాక్షి): కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉన్న సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు

మిగతా 2లో..

### అమెరికాను కొల్లగొడుతున్న దేశాలకు

## డబ్బులివ్వాలా?

- ఇది అర్ధరహితం.. న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు
- ప్రపంచం ఇంతకుముందు ఎన్నడూ ఇలాంటి తీర్పును చూడలేదు
- అమెరికా సుప్రీం కోర్టుపై మరోసారి ట్రంప్ అసహనం



న్యూయార్క్(జనంసాక్షి): ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై తాజాగా ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీం తీర్పుతో విదేశాలకు, కంపెనీలకు పెద్ద మొత్తంలో డబ్బులు తిరిగి చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు.'ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పు.. ఎన్నో సంవత్సరాలుగా యూఎస్‌ను కొల్లగొడుతోన్న దేశాలు, కంపెనీలకు వందల బిలియన్ డాలర్లు తిరిగి చెల్లించేందుకు దారితీస్తుంది. ఇది అర్ధరహితం. న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకోలేదని నేను బలంగా విశ్వసిస్తున్నా. ప్రపంచం ఇంతకుముందు ఎన్నడూ ఇలాంటి తీర్పును చూడలేదు. ఇది నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ కేసును తిరిగి విచారించడం సాధ్యమేనా?' అని ట్రంప్ రాసుకొచ్చారు. ట్రంప్ విధించిన సుంకాలను రద్దు చేస్తూ.. సుప్రీంకోర్టు ధర్మాసనం 6:3 మెజారిటీతో ఇటీవల తీర్పు వెలువరించింది. మిగతా 2లో..


లండన్ అగ్ని ప్రమాద ఘటన..

### నిజామాబాద్ విద్యార్థి మృతి

నిజామాబాద్ (జనంసాక్షి): లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీకి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోగా.. తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధరించారు. ఒకే రూమ్‌లో ఉంటున్న వీరు ఎంబీఏ

మిగతా 2లో..






### బెంగాల్‌లో 63 లక్షలకు పైగా

## ఓట్ల తొలగింపు..!

కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' తర్వాత ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించింది. గతేడాది ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన సమయంలో 58 లక్షల ఓట్లు తొలగించగా.. తాజాగా ఈ సంఖ్య దాదాపు 63.66 లక్షలకు చేరింది. అదేవిధంగా మరో 60 లక్షలకుపైగా ఓటర్లను 'పరిశీలన' కేటగిరీలో చేర్చింది. ఈ ఓటర్ల వివరాలను జ్యుడిషియల్ అధికారులు తనిఖీ చేయనున్నారు.మొత్తం 7.66 కోట్ల మంది ఓటర్ల




జాబితాతో గతేడాది నవంబరు 4న బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలైంది. డిసెంబరు 16న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మరణాలు, వలసలు, నకిలీల వంటి కారణాలతో 58 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య దాదాపు 7.08 కోట్లకు చేరింది. విచారణలు, పరిశీలనలు, అభ్యంతరాల పరిష్కారం అనంతరం.. ఫారం-7 ద్వారా మిగతా 2లో..

### పాక్‌పై ట్రంప్ ప్రశంసలు.. తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్

#### మోదీపై విమర్శలు



న్యూఢిల్లీ(జనంసాక్షి): పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రశంసలు కురిపించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. గతేడాది పహల్గామ్‌లో ఉగ్ర దాడులకు కారణమైన వారిని ట్రంప్ కొనియాడటమేంటని ప్రశ్నించింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది.అఫ్గానిస్థాన్‌తో యుద్ధంలో మిగతా 9లో..




### పోచంపాడ్ బాలికల గురుకులంలో దారుణం

- బాత్రూం వెళ్లిన బాలికపై లైంగిక వేధింపులు
- గత కొంతకాలంగా అసభ్యంగా వ్యవహరిస్తున్న ఎలక్ట్రిషియన్
- టీచర్లకు తెలియజేసిన చర్యలు తీసుకోని వైనం
- 'జనంసాక్షి' వెలుగులోకి తేవడంతో నిందితుడి అరెస్టు

9లో..



# ఈ ప్రభుత్వం మీది.. అండగా ఉంటాం

నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించామని సీఎం తెలిపారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చని.. కానీ మీ అందరితో కలవాలని... మీకు అండగా ఉంటామనే భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. అనంతరం ప్రమాదంలో మృతిచెందిన 44 కుటుంబాల వారికి రూ.5 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.× ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009 సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకు పంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మత పెద్దలకే అప్పుజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బెంగాల్‌లో 63 లక్షలకు పైగా ఓట్ల తొలగింపు..!

దాదాపు మరో5.46 లక్షల ఓట్లు తొలగించారు. ఫారం-6, ఫారం-6ం ద్వారా 1.82 లక్షలకు పైగా ఓటర్లను చేర్చారు. దీంతో ప్రస్తుతం మొత్తం ఓటర్ల సంఖ్య 7.04 కోట్లకు చేరింది. ఇప్పటివరకు దాదాపు 6.4 కోట్ల మందిని ఆమోదిత జాబితాలో చేర్చారు. తుది జాబితా విడుదలైన తర్వాతే గణాంకాలపై నిర్ధరణకు రావొచ్చని అధికారులు తెలిపారు. అప్‌డేట్ చేసిన ఓటర్ల జాబితాల ప్రతులను జిల్లాల్లోని ఎస్‌డీవో, బీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. సీఎం మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం భవానీపుర్‌లో ఇప్పటివరకు 47 వేల ఓట్లను తొలగించినట్లు తెలుస్తోంది. మరో 14 వేలమందిని 'పరిశీలన' జాబితాలో చేర్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు ఇక్కడి ఓటరు జాబితాలో 2.06 లక్షల మంది ఉన్నారు. మరి కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ స్థానికంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియ ప్రాధాన్యం సంతరించుకుంది.

# దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్..

చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని అంచనా. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. వీరిలో 15 లక్షల మంది భారతీయులే ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి.

**లండన్ అగ్ని ప్రమాద ఘటన..**

# నిజామాబాద్ విద్యార్థి మృతి

పూర్తిచేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.లండన్ డుప్పాస్ హిల్స్‌లోని రెండు అంతస్తుల నివాసంలో ఇటీవల గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలు దానం చేసేందుకు అంగీకరించినట్లు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

# ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు

ఈ దాడుల్లో అమెరికా హస్తం కూడా ఉన్నట్లు అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో కథనాలు వస్తున్నాయి. తాజా దాడుల నేపథ్యంలో పౌర విమానాలకు ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. స్కూళ్లకు సెలవులు ప్రకటించింది. అటు ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు నిలిచిపోయాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ కూడా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకెళ్లాయి. ఈ మేరకు ఆ దేశ మిలిటరీ వెల్లడించింది. ఇజ్రాయెల్-అమెరికా కలిపి కొన్నిగంటల క్రితం ఇరాన్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌వైపు నుంచి స్పందన వచ్చింది.

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు దాడులతో విరుచుకుపడ్డాయి. హార్మోజ్‌గాన్ ప్రావిన్స్ మినాబ్ నగరంలోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45 మంది గాయపడినట్లు తెలిపింది. దాడి సమయంలో స్కూల్‌లో 170 మంది విద్యార్థినులు ఉన్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్'కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి తమపై చేస్తున్న యుద్ధం చట్టవిరుద్ధమైనదని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని ట్రంప్.. 'ఇజ్రాయెల్ ఫస్ట్'గా మార్చారని విమర్శించారు.

దురాక్రమణదారులకు తమ సాయుధ బలగాలు తగిన గుణపాఠం చెబుతాయన్నారు. ఇరాన్‌పై దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్, అమెరికాలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించాయని ఆరోపించింది. ఇది ముందస్తు ప్రణాళికతో కూడిన దురాక్రమణ చర్యగా పేర్కొంది. సమస్యల పరిష్కారానికి దౌత్య చర్చలు జరపాలని సూచించింది. సంబంధిత దేశాలు వెంటనే దాడులు ఆపాలని ఖతర్, సౌదీ అరేబియాలు డిమాండ్ చేశాయి.పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. దుబాయ్ నుంచి విమాన సర్వీసులు నిలిచిపోయాయి. తదుపరి నోటీసులు జారీ చేసేవరకు దుబాయ్, అల్ మక్తుమ్ అంతర్జాతీయ విమానాశ్రయాల కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

## ఇరాన్ ప్రతీకారదాడులు..

వల్లే రెడ్ కలర్‌లోకి మారిపోయిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్-అమెరికా కలిపి కొన్నిగంటల క్రితం ఇరాన్‌పై దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కి యాన్ నివాసం, నిఘా ప్రధాన కార్యాలయం సహా మొత్తం 30 ప్రాంతాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగి న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌వైపు నుంచి స్పందన వచ్చింది. ఆ సమయంలో ఉత్తర ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత వినిపించింది. గగనతల రక్షణ వ్యవస్థ ఎప్పటికప్పుడు వాటిని అడ్డుకుంటోందని ఆ దేశ సైన్యం వెల్లడించింది. డ్రోన్లు, క్షిపణులతో తాము తొలుత ప్రతీకార దాడిని ప్రారంభించామని, ఇవి కొనసాగు తాయని ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్ తెలిపింది.



## మా మాట వినకుంటే ఇరాన్‌ను నాశనం చేస్తాం:ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌పై యూఎస్-ఇజ్రాయెల్ చేపట్టిన సంయుక్త దాడులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధ్రువీకరించారు. తాము ఎన్ని హెచ్చరికలు చేసినా ఇరాన్ తన అణుకేంద్రాలను పునర్నిర్మించడానికి.. క్షిపణులను అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. అందువల్లే ఆ దేశానికి వ్యతిరేకంగా భారీ సైనిక చర్య చేపట్టామని వెల్లడించారు. ఇక ఎప్పటికీ ఇరాన్ అణ్వాయుధాలను కలిగిఉండకుండా వాటిని పూర్తిగా నాశనం చేస్తున్నామన్నారు.

## ఇరాన్‌తో అస్తిత్వ ముప్పు.. అందుకే దాడులు: నెతన్యాహు

టెల్అవీవ్(జనంసాక్షి):ఇరాన్‌పై దాడులను ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమర్థించుకున్నారు. టెహ్రాన్ నుంచి తమకు అస్తిత్వ ముప్పు ఉందని, వీటిని తొలగించేందుకే అమెరికాతో కలిసి ఆపరేషన్ చేపట్టామని అన్నారు. ఇరాన్‌లోని క్షిపణి స్థావరాలు, పారామిలటరీ రెవల్యూషనరీ గార్డు, బాసిజ్ దళానికి చెందిన వాలంటీర్లపైనా దాడులు చేస్తున్నామన్నారు.

## సంయమనం పాటించాలి.. దౌత్యమార్గాలను అనుసరించాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇజ్రాయెల్, అమెరికాలు కలిసి ఇరాన్‌పై దాడులు.. ఆ దేశం ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌తో పాటు గల్ఫ్ ప్రాంతంలోని పరిస్థితులపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది."ప్రస్తుత పరిస్థితుల్లో అన్ని పక్షాలు సంయమనం పాటించాలి. ఉద్రిక్తతలను నివారించాలి. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఉద్రిక్తతలను తగ్గించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు చర్చలు, దౌత్యమార్గాలను అనుసరించాలి. అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలి" అని భారత్ సూచించింది. పశ్చిమాసియాలోని భారత దౌత్య కార్యాలయాలు.. దేశ పౌరులతో టచ్‌లో ఉన్నాయని విదేశాంగశాఖ తెలిపింది. భారత పౌరులు అప్రమత్తంగా వ్యవహరించాలని, దౌత్య అధికారులతో కాంటాక్ట్‌లో ఉండాలని, స్థానిక భద్రతా మార్గదర్శకాలను పాటించాలని కోరుతూ ఎంబసీలు అడ్వైజరీలు జారీ చేశాయని వెల్లడించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త సైనిక ఆపరేషన్‌తో పశ్చిమాసియా మరోసారి అట్టుడుకుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియాలోని భారత రాయబార కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి.

# జల మండలికి శారదా పీఠం భూముల కేటాయింపు రద్దు

**హైదరాబాద్(జనంసాక్షి):** కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూములను పీఠానికే కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జలమండలికి శారదా పీఠం భూముల కేటాయింపు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఠం భూముల్లో జలమండలి చేపట్టిన నిర్మాణ పనులను శారదాపీఠం ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండలికి కేటాయింపులను రద్దు చేసి.. పీఠానికే ఆ భూములను కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని శారదాపీఠం ప్రతినిధులకు సూచించారు.

## నాంపల్లి కోర్టుకు హాజరైన సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా, అప్పటి ఎంపీలైన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి తరపున భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ర్యాలీలో సుమారు 40 కార్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రచారం నిర్వహించారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక 2021లో కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనలను పాటించకుండా ఓ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారని కూడా రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజా సమావేశాలపై పరిమితులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, కోవిడ్ మార్గదర్శకాలు పాటించకపోవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగా నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు విచారణలో తదుపరి విచారణ తేదీని నిర్ణయించే అవకాశం ఉంది. కేసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో జరిగిన ప్రచారం, కోవిడ్ సమయంలో జరిగిన సమావేశాలకు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# అమెరికాను కొల్లగొడుతోన్న దేశాలకు డబ్బులివ్వాలా..?

ఈ తీర్పుపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. గతంలో కన్నా ఎక్కువ టారిఫ్‌లు వసూలుచేస్తానంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రపంచ దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. సుంకాలు చెల్లవని సుప్రీం తేల్చిచెప్పింది కానీ.. తిరిగి చెల్లింపుల గురించి ఆ తీర్పులో ప్రస్తావించలేదు.

# కక్షలతో ప్రభుత్వం కుట్రపూరిత చర్యలు

ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయం నుంచి మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు కక్షకట్టారని, ఇప్పటికే ఆయనపై నాలుగు తప్పుడు కేసులు పెట్టారని ఆ కేసుల్లో ఆయనకు హైకోర్టు స్టే ఇచ్చినా ఎలాగైనా జైలుకు పంపాలన్న దురుద్దేశంతో వెంటనే మరో కొత్త అక్రమ కేసు పెట్టి పోలీసులు అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు మారాలని మల్లికార్జున్ గౌడ్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు.

# బతుకులు బుగ్గి



సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

పేలుడు ఘటనపై చంద్రబాబు దిగ్భ్రాంతి

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ఆరా తసిన సిఎం అధికారులతో మాట్లాడారు. విజయనగరం పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రికి ప్రమాద ఘటన గురించి అధికారులు తెలియజేశారు. దీంతో విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో సీఎం మాట్లాడారు. ప్రమాదానికి కారణాలు... ప్రస్తుతం అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సూర్య ఫైర్ వర్క్స్‌లో 20 మంది వరకు పని చేస్తున్నారని అధికారులు తెలియజేశారు. బాణసంచా తయారీదారులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనాస్థలానికి వెళ్లాల్సిందిగా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రమాదంపై సామాజిక మాధ్యమం ఎక్స్‌లోనూ స్పందించారు సీఎం. బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని ఆదేశించామని చెప్పారు. సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని.. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఘటనాస్థలంలో అధికారులు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చంద్రబాబు తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో సీఎం పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న ఆమె.. హుటాహుటీన సంఘటన స్థలికి బయల్దేరి వెళ్లారు.

పేలుడు ఘటన తరవాత యజమాని పరార్

పొలాల మధ్య షెడ్డులో తయారీ కేంద్రం

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై ఆర్‌డీవో మల్లిబాబు స్పందించారు. పేలుడు ఘటన తర్వాత యజమాని పరారీలో ఉన్నాడని మీడియాకు వివరించారు. ఈ ఘటనలో 15 మందికి గాయాలయ్యాయని అందులో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ఈ పరిశ్రమకు ఈ ఏడాది మార్చి 31 వరకు లైసెన్స్ ఉందని, మరోవైపు కాకినాడ జీజీహెచ్‌లో ఆరుగురు బాధితులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో వేట్లపాలెం వాసి కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. పొలాల్లో 6 షెడ్లు వేసి బాణసంచా తయారుచేస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పేలుడుకు ముందు కొందరు కార్మికులు భోజనం కోసం బయటకు వెళ్లారు. దీంతో వారు ప్రాణాలు దక్కించుకున్నారు. పేలుడు శబ్దానికి వేట్లపాలెం గ్రామంలో ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో పేలుడు ఘటన ప్రతి ఒక్కరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాద తీవ్రత పెరగడానికి అక్కడి పరిస్థితులే కారణమని స్థానికులు చెబుతున్నారు. అతి తీవ్రస్థాయిలో విస్ఫోటనం జరగడం, రెండు గంటలపాటు పేలుళ్లు కొనసాగడంతో స్థానికులు కూడా అక్కడికి చేరుకోలేని పరిస్థితి ఏర్పడింది. చివరికి ధైర్యం చేసి కొందరు స్థానికులు పేలుడు సంభవించే ప్రాంతానికి చేరుకునే సరికే చాలా మంది అగ్నికి ఆహుతయ్యారు.

## మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించిన ప్రధాని

కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

**FORM IV**
**(See Rule 8)**

Statement about ownership and other particulars of newspaper (To be published in the first issue every year after the last day of February)

| | |
|---|---|
| Title of the Newspaper | : JANAM SAKSHI |
| RNI Registration Number | : TELTEL/2013/50370 |
| Place of Publication | : Hyderabad, Telangana |
| Periodicity of its Publication | : Daily |
| Printer's Name | : M. M. Rahman |
| Whether citizen of India? | : Yes |
| Whether citizen of India? | : Yes |
| Address: | : Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, India |
| Publisher's Name | : M. M. Rahman |
| Whether citizen of India? | :Yes |
| Address: | : Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, India |
| Editor's Name | : M. M. Rahman |
| Whether citizen of India? | :Yes |
| Address: | : Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, India |

Name and address of the individual who owns the newspaper and holds more than one percent of the total capital

**M. Rahman – Sole Proprietor (100% Owner)**

I, M. M. Rahman, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 1st March 2026
Place: Hyderabad

Signature:
(M. M. Rahman)
Publisher

# చౌరస్తా రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి కొవ్వొత్తులతో ఘన నివాళి



- సంచలనంగా మారిన జనంసాక్షి కథనాలు


చౌరస్తా నా! 'చావు' రాస్తా

**షాద్‌నగర్ (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని చౌరస్తా రోడ్డు ప్రమాదంలో మరణించిన వారికి ప్రజా సంఘాలు బీసీ సేన ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు ఇప్పటి వరకూ 63మంది మరణించారు 103 మంది క్షతగాత్రులుగా మారారని ఆ కుటుంబాల్లో ప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయని మరో ప్రమాదం జరగకుండా మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం వెంటనే చౌరస్తా విస్తరణ ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో ఆర్ఎన్.రాము జాతీయ బీసీ జనసేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప,మేకల వెంకటేష్ స్రవంతి రాజు,నర్సింలు రాములు రవికుమార్ గౌడ్ ప్రజా సంఘాల నాయకులు టీజీ.శ్రీనివాస్,అర్జునప్ప రవీంద్ర నాథ్ ,తిరుమలయ్య,మందారం నర్సింలు, గొర్లరాము తదితరులు పాల్గొన్నారు...



## జర్నలిస్ట్ అధ్యయన వేదిక డైరీ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర సచివాలయంలోని సీఎం రేవంత్ రెడ్డి తన ఛాంబర్ లో తెలంగాణ జర్నలిస్ట్ అధ్యయన వేదిక డైరీ –2026ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యయన వేదిక అనేక సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించిందని గుర్తుచేశారు.కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి, తెలంగాణ జర్నలిస్ట్ అధ్యయన వేదిక అధ్యక్షులు బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాధిక్, వైస్ ప్రెసిడెంట్ కోడూరు శ్రీనివాస రావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కంచ రాజులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాల ద్వారా పోస్టుల భర్తీ

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** జిల్లాలో కారుణ్య నియామకల ద్వారా పోస్టులు భర్తీ చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న 29 కారుణ్య నియామకాల సంబంధించి 20 నియామకాలను పూర్తి చేసినట్లు వివరించారు. 20 పోస్టులలో13 జూనియర్ అసిస్టెంట్ 6 ఆఫీస్ సబార్డినేట్, 1కామాటి పోస్టును భర్తీ చేశామని అన్నారు.వీరిని వివిధ శాఖలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మిగతా 9 పోస్టులు రోస్టర్ అంశాలతో ముడిపడి ఉన్నందున ఆ పోస్టులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.కారుణ్య నియామకాలు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించి పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్ ఆ ప్రకటన ద్వారా తెలిపారు.

## కొంగర మల్లన్న జాతర వివాదంపై సమగ్ర విచారణ జరపండి

- వాస్తవాలను ప్రజల ముందు ఉంచండి
- దోషులను చట్టపరంగా శిక్షించండి
- డిజిపి కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ మల్లు రవి బృందం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ నియోజక వర్గం కొంగర మల్లన్న జాతర సందర్భంగా జరిగిన వివాదాలు, చిన్న పాప మృతికి సంబంధించిన అంశంలో సమగ్రమైన లోతైన విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఎంపీ మల్లు రవి బృందం డీజీపీని కోరారు. డిజిపి కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు అచ్చంపేట శాసన సభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీ కృష్ణ గారు షాద్ నగర్ శాసన సభ్యులు రాష్ట్ర ఓబీసీ సెల్ అధ్యక్షులు వీర్లపల్లి శంకర్ తెలంగాణ డీజీపీని కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వివరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని వినతి పత్రం సమర్పించారు.

## మేడికుంట ఆక్రమణలకు హైడ్రా చెక్

- ఎఫ్‌టీఎల్ పరిధిలో దుకాణాల తొలగింపు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం, బాచుపల్లి గ్రామంలోని మేడికుంట ఆక్రమణలకు హైడ్రా చెక్ పెట్టింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించి ప్రధాన రహదారివైపు వేసిన దుకాణాలను శనివారం హైడ్రా తొలగించింది. మొత్తం 21 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ఆక్రమణలకు గురై 18 ఎకరాలకు పరిమితమవ్వగా.. ఉన్న చెరువును కూడా పక్కనే దుకాణాలు పెట్టి కలుషితం చేస్తున్నారని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. మాంసం, చికెన్ , చేపల దుకాణాలతో వ్యర్థాలను చెరువులోకి వదిలి కలుషితం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఎఫ్‌టీఎల్ ఆక్రమణలను నిర్ధారించుకుంది. ఈమేరకు అక్కడ 10 దుకాణాల వరకూ ఖాళీ చేయించింది. పెద్ద మొత్తంలో చెరువు ఒడ్డున పడేసిన మాంసం వ్యర్థాలను హైడ్రా తొలగించింది. చెత్తను వేయడానికి వీలు లేకుండా.. 10 మీటర్ల ఎత్తులో హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అక్కడ చెత్తను టిప్పర్లతో హైడ్రా తొలగించగా.. అదే ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు మున్సిపల్ అధికారులు సన్నాహం చేస్తున్నారు. చెరువు ఆక్రమణలు తొలగి ప్రజావినియోగంలోకి రావడం పట్ల స్థానికలు హర్షం వ్యక్తం చేశారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగాలివ్వాలి

- కొలువుల కోసం కొట్లాట.. మహా ధర్నాలో మాజీ మంత్రి హరీష్ రావు..
- స్థానిక యువతకు అవకాశం ఇవ్వకపోతే ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటాం...



**హనుమకొండ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** హనుమకొండ నగరంలోనికాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో స్థానిక యువతకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. శనివారం కొలువుల కోసం కొట్లాట పేరిట హన్మకొండ జిల్లా కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా ఉద్యోగాలు మాకే కావాలి అనే బలమైన నినాదంతోనే నాడు కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని, కేవలం రాష్ట్రాన్ని సాధించడమే కాక, తెలంగాణ యువతకు 95 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే 95 శాతం స్థానికత దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ దేనని,తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే కాజీపేటకు ఈ కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని, ఇక్కడ పరిశ్రమలు రావాలని ముఖ్యంగా మన స్థానికులకు ఉపాధి ఉద్యోగాలు దొరకాలని మనం కోరుకున్నామన్నారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎంపీ స్థానికుల ఉద్యోగాల గురించి ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు వచ్చి ఇక్కడ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని అంటున్నారని, భూములు ఇచ్చిన నిర్వాసితులకు, స్థానికులకు లాతూర్ తరహాలో 70 శాతం రిజర్వేషన్ కల్పించకుండా ప్రారంభోత్సవానికి వస్తే.. ఎక్కడికక్కడ అడ్డుకుంటామని, బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా నిలదీస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారు. ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు 200 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, నాడు కేసీఆర్ ఆటో డ్రైవర్లకు క్వార్టర్లీ టాక్స్ రద్దు చేశారని,5 లక్షల బీమా సౌకర్యం కల్పించారని, రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఆటో డ్రైవర్ల డిమాండ్లను నెరవేర్చాలని, వారికి ఆర్థిక సహాయం చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి,ఆరూరి రమేష్,శంకర్ నాయక్ నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, సదానందం,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్ తరాలకు అందాలి

- జాతీయ సైన్స్ ఫెయిర్ 'విజ్ఞాన్ వైభవ్'
- కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఉద్ఘాటన



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ప్రస్తుతం భారతదేశ శాస్త్ర సాంకేతిక పరంగా ఎంతో ముందుందని, అంతరిక్ష ఖగోళ విజ్ఞానంతోపాటు ఇతర సాంకేతిక రంగాలలో సాధిస్తున్న అద్భుత పురోగతిని భవిష్యత్ తరాలకు అందించాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు భారత దిగ్గజ శాస్త్రవేత్త సర్ సివి రామన్ జయంతిని పురస్కరించుకొని శనివారం శేరిలింగంపల్లి పరిధి గచ్చిబౌలి స్టేడియం ఆవరణలో 'విజ్ఞాన్ వైభవ్' పేరుతో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఇస్రో అంతరిక్ష కేంద్రం కెప్టెన్ సుభాష్ శుక్ల తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగరం పరిధిలోని దాదాపు 5వేల మంది విద్యార్థులు తమ అత్యుత్తమ వైజ్ఞానిక ప్రదర్శనలను విజ్ఞాన్ వైభవ్ కార్యక్రమంలో ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గత భారతదేశానికి, దేశ ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రస్తుత భారతదేశానికి ఎంతో తేడా ఉందని, ప్రపంచస్థాయి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అదుపుచ్చుకోవడం తోపాటు ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడుతూ భారతదేశం తనకంటూ ఒక గొప్ప స్థానాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ప్రపంచాన్ని కుదిపేస్తున్న కృత్రిమ మేధా(ఎ.ఐ), డిజిటల్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ, యుద్ధ సాంకేతిక రంగం తదితర అంశాలలో భారతదేశము సాధిస్తున్న పురోగతి అనన్య సామాన్యమన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి ప్రస్తుత విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వారసత్వ ఫలాలు అందాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా దేశం ఇప్పటికే ఒక ప్రత్యక్ష కార్యాచరణను రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలు భారత శాస్త్ర సాంకేతికతపై ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ భారతదేశంతో అంతర్జాతీయ ట్రేడ్ డీల్స్ కుదుర్చుకోవడానికి నిరభ్యంతరంగా ముందుకు వస్తుండడమే ఎందుకు నిదర్శనం అన్నారు. ఇటీవలనే హైదరాబాదులో ఏఐ వరల్డ్ సమ్మిట్ ని ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగిందని, దీనికి 23 దేశాల అధినేతలు, 60 దేశాల ఐటీ రంగ నిపుణులు హాజరుకావడమే దేశం సాధించిన అద్భుత ప్రగతికి కొలమానమని కేంద్ర మంత్రి అభివర్ణించారు. సాంకేతిక పరిజ్ఞానం దేశంలో ఇనుమడించడంతో ప్రస్తుతం లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించే అవకాశం ఉందని, దేశం సాధిస్తున్న అద్భుత ప్రగతికి మన జీడిపి ఎదుగుదలనే నిదర్శనమని మంత్రి పునరుద్ఘాటించారు. దేశ యువత సైన్స్ పట్ల మక్కువను పెంచుకొని మునుముందు మరిన్ని అద్భుతాలను సృష్టించడం ద్వారా దేశ ప్రగతికి బాటలు వేయాలని, ప్రపంచంలోనే భారతదేశానికి ఒక సమున్నత గౌరవాన్ని ఆపాదించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్, ఇతర విభాగాల అధికారులు, వివిధ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గాంధీ ఆసుపత్రిలో బాలింత మృతి

- ఇంజక్షన్ వికటించి చనిపోయిందని కుటుంబసభ్యుల ఆందోళన



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** గాంధీ ఆసుపత్రిలో కాన్పుకోసం జాయిన్ అయిన బాలింత మృతి చెందింది. ఇంజక్షన్ కారణంగానే మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బన్సీలాల్ పేట మేకల మండికి చెందిన జొన్నల సంజన (26) డెలివరీ కోసం నాలుగు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరింది. శనివారం ఉదయం ఆమె మగ శిశువు జన్మఇచ్చింది. ఉదయం 6 గంటల ప్రాంతంలో నడుంనొప్పి ఉందని సంజన వైద్యులకు చెప్పగా, ఇంజక్షన్ ఇచ్చారని చెప్పారు. ఆ ఇంజక్షన్ వికటించడంతో సంజన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాలింత మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ఆసుపత్రి ఎంసిహెచ్ (మాతా–శిశు ఆరోగ్య) భవనం వద్ద ఆందోళనకు దిగారు. ఘటన స్థలంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో భద్రతా సిబ్బంది మోహరించారు. వైద్యుల నిర్లక్ష్యమే సంజన మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆసుపత్రి అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు.

## విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి

**పాలకుర్తి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** విధుల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన శనివారం మండలంలోని మల్లంపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని మల్లం పల్లి గ్రామంలో పంచాయతీ కార్యద´ర్శిగా విధులు నిర్వహించే బానోతు కిశోర్ రోజు మాదిరిగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులకు హాజరయ్యాడు. ఆ సమయంలో పంచాయతీ కార్యాలయానికి ఓ వ్యక్తి డెత్ సర్టిఫికెట్ విషయంలో అదే గ్రామానికి చెందిన వంగాల సోమయ్య పంచాయతీ కార్యదర్శితో వాగ్వాదానికి దిగాడు. నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్ ఇవ్వలే నని పంచాయతీ కార్యదర్శి తేల్చడంతో అగ్ర హానికి గురైన వ్యక్తి కార్యదర్శిపై గ్రామ సర్పం చ పోశాల వెంకన్న ఎదుటనే దాడికి పాల్పడాడు. ఈ ఘటనపై పంచాయతీ కార్య దర్శి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎస్సై పవన్ కుమార్‌ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శిపై దాడికి సంబంధించిన ఫిర్యాదు అందిందని తెలిపారు.

## గాదె ఇన్నయ్యకు పితృవియోగం

- ఆనారోగ్యంతో స్వగ్రామం సాగరంలో కన్ను మూసిన సాల్మన్ రెడ్డి
- నెల రోజుల్లోనే తల్లి, తండ్రి మృతి
- ఇన్నయ్య కుటుంబీకుల్లో విషాదం
- ఇన్నయ్య కుటుంబీలకు మాజీ మంత్రులు హరీష్ రావు, దయాకర్ రావు, ఎమ్మెల్యేల పరామర్శ



**జఫర్గఢ్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** జనగాం జిల్లా జఫరగఢ్ మండలంలోని మా ఇల్లు ప్రజాదరణ ఆశ్రమ నిర్వాహకులు, సామాజిక ఉద్యమ నాయకుడు గాదె ఇన్నయ్యకు పితృ వియోగం కలిగింది. ఆయన స్వగ్రామం సాగరంలో ఇన్నయ్య తండ్రి గాదె సాల్మాన్‌రెడ్డి (97) శనివారం ఉదయం కన్నుమూశారు. కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిశారని కుటుంబ సభ్యులు తెలిపారు. సాల్మాన్‌రెడ్డి బార్య థెరీసమ్మ జనవరి 25న వయోభారంతో కన్నుమూసిన విషయం విదితమే. కాగా గత ఏడాది డిసెంబర్ 21న ఉపా చట్టం కింద అరెస్టు కాబడిన ఇన్నయ్య ప్రస్తుతం హైదరాబాద్ జైల్లో ఉన్న విషయం తెలిసిందే. నెల రోజుల్లోనే తల్లి తండ్రి మృతి చెందడంతో ఇన్నయ్య కుటంబంలో విషాదం నెలకొంది. సాల్మాన్రెడ్డి అంత్యక్రియలు సోమవారం నిర్వహించనున్నట్లు కుటంబ సభ్యులు తెలిపారు.


సాల్మాన్‌రెడ్డి మృతదేహం వద్ద హరీశ్‌రావు నివాళి

మండలంలోని సాగరంలో మృతి చెందిన గాదె ఇన్నయ్య తండ్రి సాల్మాన్‌రెడ్డి మృతదేహం వద్ద శనివారం మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళ్లర్పించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, డాక్టర్ టి. రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ నివాళు లర్పించారు.

# గుర్రపు డెక్క.. దోమల వ్యాప్తిపై హైడ్రాకు ఫిర్యాదులు

- చెరువుల అభివృద్ధికి విన్నపాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నగరంలోని చెరువుల్లోకి మురుగు నీరు భారీగా వచ్చి చేరుతోంది. చెరువులు దుర్గంధభరితంగా మారాయి. గుర్రపు డెక్క వ్యాపించి దోమలకు కేంద్రాలుగా నగరంలోని చెరువులు మారాయి. హైడ్రా అభివృద్ధి చేస్తున్న చెరువుల జాబితాలో మా ప్రాంత చెరువును కూడా చేర్చాలని హైడ్రా శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో నగరం నలుమూలల నుంచి విన్నాపాలు వచ్చాయి. చెరువులు, నాలాలు ఆక్రమణకు గురికాకుండా చూసి వరదలు నివారించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. 28 మందితో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా మాట్లాడి.. సమస్యలు తెలుసుకున్నారు. మురుగు నీరు కలవకుండా ఎస్‌టీపీలు ఏర్పాటు చేయాలని సూచించారు. రామంతాపూర్ చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని వెంటనే వీటిని ఆపి చెరువును కాపాడాలని స్థానికంగా ఉన్న ఓ మహిళ ఫోను చేసి కోరారు. బాచుపల్లి సర్వే నంబరు 54 లో 3 ఎకరాల వరకూ భూమి ప్రొహిబిటెడ్ జాబితాలో ఉంది. దీనిని ప్రజావసరాలకు ఉపయోగపడేలా చూడాలని మరో వ్యక్తి కోరారు. ఓల్డ్ అల్వాల్, జొన్నబండలోని వజ్ర ఎన్‌క్లేవ్‌లో పార్కుల ఆక్రమణతో పాటు రహదారి ఆటంకాలను తొలగించాలని అక్కడి కాలనీ ప్రతినిధులు కోరారు, ఎల్‌బీనగర్‌లోని వాంబే ఇళ్లు పొందిన కింది పోర్షన్ వారు వాహనాలకు పార్కింగ్ కోసం ఉంచిన స్థలాలను కలిపి అదనపు గదులు నిర్మిస్తున్నారని.. వెంటనే వాటిని తొలగించి నివాసితుల అందరి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. హెచ్ఏఎల్ కాలనీలోని ఖర్మన్‌కుంటలో మురుగు నీరు చేరి గుర్రపు డెక్క పెరుగుతుంది అభివృద్ధి చేయాలని కోరారు. నిజాంపేటలోని హిల్‌కౌంటీలో పత్తికుంటకు నాలుగు వైపులా రహదారులున్నాయి. దుర్గంధంతో నిండిన ఈ చెరువును అభివృద్ధి చేస్తే అందరికీ వినియోగంలోకి వస్తుందన్నారు. నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థకు ఉద్దేశించిన భూమిలో అక్రమ పార్కింగ్ దందా కొనసాగుతోందని ఫిర్యాదు అందింది. ఇలా శనివారం హైడ్రా ఫోన్ ఇన్ కార్యక్రమానికి మొత్తం 28 ఫిర్యాదులందాయి. వీటిని త్వరలోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ సూచించారు.

# ‘న్యాయవ్యవస్థలో అవినీతి’ లేదంటే లేదు!



అబ్బ, హఠాత్తుగా మన న్యాయవ్యవస్థలో అవినీతి లేకుండా పోయిందా అని ఎవరికైనా తబ్బిబ్బుతో, సంతోషంతో గుండె ఆగిపోతుందేమోనని అనుమానంగా ఉంది. శీర్షిక చూసి కంగారు పడకండి. ‘న్యాయవ్యవస్థలో అవినీతి’ అనే పాఠాన్ని లేకుండా చేశారు. ఆ పుస్తకాన్ని నిషేధించారు. ఇప్పటికే విడుదలై, అమ్మకాలు జరుగుతున్న పుస్తకం ప్రతులన్నిటినీ వెనక్కి తీసుకోవాలని ఆదేశించారు. అంతే. మరి పాఠం తీసేయగానే అసలు విషయం లేకుండా పోతుందా?

మంగళవారం నాడు ఇండియన్ ఎక్స్ ప్రెస్ దినపత్రిక ఢిల్లీ ఎడిషన్ లో ఒక వార్తా కథనం వచ్చింది. అది నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసర్చ్ అండ్ ట్రేనింగ్ (ఎన్ సిఇఆర్‌టి) తాజాగా ప్రచురించిన ఎనిమిదో తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో ‘ది రోల్ ఆఫ్ ది జుడీషియరీ’ అనే పాఠంలో “న్యాయవ్యవస్థలో వేరు వేరు స్థాయిలలో అవినీతి” గురించీ, న్యాయస్థానాలలో విపరీతంగా పేరుకు పోతున్న కేసుల గురించీ ఉందని ఆ వార్తా కథనం రాసింది.

ఆ రోజు సుప్రీం కోర్టు ప్రారంభం కాగానే సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ మను సింఘ్వి ఈ విషయాన్ని ప్రధాన న్యాయ మూర్తి దృష్టికి తీసుకు వచ్చారు. చిన్నారి లేత మెదళ్లకు ఉద్దేశించిన పాఠ్యపుస్తకంలో ఈ పాఠం పెట్టడం ఆందోళన కరమనీ, ఉద్దేశపూర్వకమైన దాడి అనీ, ఈ పాఠంతో న్యాయవాదులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారనీ కపిల్ సిబాల్ అన్నారు. దేశంలో ఎన్నో వ్యవస్థలలో, రాజకీయ నాయకులలో, మంత్రులలో, అధికార యంత్రాంగంలో అవినీతి ఉండగా, వాటి ప్రస్తావనే లేకుండా ప్రత్యేకించి ఒక వ్యవస్థ మీద ఎక్కుపెట్టడం ఏమిటని అభిషేక్ మను సింఘ్వి ప్రశ్నించారు.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కు కూడా చాలా కోపం వచ్చింది. న్యాయ వ్యవస్థను ఎవరైనా కించపరిస్తే, నిజాయితీని ప్రశ్నిస్తే తాను చూస్తూ కూచోబోనని అన్నారు. ఈ విషయాన్ని సు మోటో (ఎవరూ ఫిర్యాదు చేయకుండానే) తన విచారణా పరిధిలోకి తీసుకుంటానన్నారు. “దీనితో ఎలా వ్యవహరించాలో నాకు తెలుసు. ఇది ఉద్దేశపూర్వకంగా, లోతైన ప్రణాళికతో జరిగిన ప్రయత్నంలా కనబడుతున్నది” అన్నారు. ఇది కేవలం న్యాయవాదులకు మాత్రమే కాదనీ, న్యాయమూర్తులకు కూడా ఆందోళనాకరమైనదనీ, ఇప్పటికే ఎందరో హైకోర్టు న్యాయమూర్తులు తనకు ఫోన్లు చేస్తున్నారనీ అన్నారు. గురువారం నాడు విచారణ జరుపుతామన్నారు. బెంచి మీద కూచున్న మరొక న్యాయమూర్తి జస్టిస్ జయమాలా బాగ్చి ఈ పాఠం రాజ్యాంగ సమగ్రతను, రాజ్యాంగ మౌలిక స్వరూప భావన అయిన అధికారాల విభజనను సవాలు చేస్తున్నదని అన్నారు.

సుప్రీంకోర్టు స్పందన వెలువడిన కొద్ది గంటల్లోనే ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణ ప్రకటించింది. పుస్తకాన్ని ఉపసంహరించుకుంటున్నామని, బుధవారం నుంచి ఆ పుస్తకం అమ్మకాలు ఉండవని ప్రకటించింది. ఎన్ సి ఇ ఆర్ టి మాతృ సంస్థ అయిన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కూడా తప్పు జరిగిందని ప్రకటించింది. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో పాటు, ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఆ పాఠం గురించి ఆగ్రహం వ్యక్తం చేశారని వార్తలు వచ్చాయి.

గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాలా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. “తెలియకుండా జరిగిన పొరపాటు” అని ఎన్‌సిఇఆర్‌టి చేసిన వాదనను న్యాయమూర్తులు తిరస్కరించారు. ఎన్‌సిఇఆర్‌టి మీద ఆగ్రహం వ్యక్తం చేసి, పుస్తకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు ప్రకటించారు. పుస్తకం అచ్చుప్రతులు, డిజిటల్ ప్రతులు ఎక్కడ ఉన్నా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడా ఏ పాఠశాలలోనూ ఉపాధ్యాయులెవరూ ఈ పాఠం చెప్పకుండా ఆదేశించాలన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖలో పాఠశాల విద్యా కార్యదర్శికీ, ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌కూ వారి మీద ఎందుకు చర్య తీసుకోగూడదో చెప్పాలని సంజాయిషీ నోటీసు ఇచ్చారు.

మంగళవారం ఈ విషయం తన దృష్టికి రాగానే వాస్తవాలు తెలుసుకొమ్మని సుప్రీం కోర్టు రిజిస్ట్రార్‌ను ఆదేశించానని, రిజిస్ట్రార్ పంపిన ఉత్తరానికి జవాబుగా ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఆ పాఠంలో ఆ వాక్యాలు ఉండడాన్ని “రాతపూర్వకంగా సమర్థించుకున్నారు” అని ప్రధాన న్యాయమూర్తి కోప్పడ్డారు. సమర్థించుకున్నారంటేనే అది ఉద్దేశపూర్వకంగా, తెలిసి తెలిసీ రాసిందేనని రుజువయిందన్నారు. అందువల్ల జాతీయ పాఠ్యప్రణాళికా మండలి ఈ అధ్యాయాన్ని ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంలో పాల్గొన్న సభ్యులు ఎవరెవరు ఏమి మాట్లాడారో మినిట్స్ తమకు అప్పగించాలని ఆదేశించారు. “లోతైన విచారణ జరగాలని ఆదేశిస్తున్నాం. బాధ్యులు ఎవరో తెలుసు కోదలచు కున్నాం... తలలు రాలవలసిందే. మేం ఈ కేసును మూసివేసేది లేదు” అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇప్పుడు ఆ పుస్తకం లేదు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఆ పుస్తకం చదవబోవడం లేదు. పుస్తకం మీద నిషేధం కూడా ఉంది. ఇప్పటికి 38 పుస్తకాలు అమ్మామని, అందులో 31 వెనక్కి తెప్పించామని ఎన్‌సిఇఆర్‌టి అంటున్నది. అయినా ఇంత తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది గనుక అసలు ఆ అధ్యాయంలో ఏముందో కూడా తెలుసుకోవాలి.

ఆ పాఠ్యపుస్తకం పేరు ‘ఎక్స్ ప్లోరింగ్ సొసైటీ: ఇండియా అండ్ బియాండ్’ రెండో సంపుటం. ఆ పుస్తకంలో నాలుగో అధ్యాయం ‘మన సమాజంలో న్యాయవ్యవస్థ పాత్ర’. అందులో న్యాయమూర్తులు ఉండవలసినంత మంది లేరనీ, అలాగే న్యాయ విచారణా ప్రక్రియలో ఉన్న సంక్లిష్టత వల్ల, తగినన్ని మౌలిక వసతులు లేకపోవడం వల్ల కేసులు అపరిష్కృతంగా విపరీతంగా పేరుకుపోతున్నాయని, అందువల్ల న్యాయం సరిగ్గా అందడం లేదని ప్రజల్లో అభిప్రాయం ఏర్పడుతున్నదని రాశారు.

న్యాయస్థానాలలో పేరుకుపోతున్న కేసుల గురించి ఒక పట్టిక వేసి, సుప్రీం కోర్టులో 81,000 కేసులు, హైకోర్టులలో 60 లక్షల కేసులు, జిల్లా కోర్టులలో, కింది కోర్టులలో నాలుగు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాశారు. న్యాయమూర్తులకు న్యాయ స్థానంలోనూ, బైటా ప్రవర్తనా నియమావళి, విధినిషేధాలు ఉన్నాయని రాశారు. న్యాయవ్యవస్థలోపల జవాబుదారీ యంత్రాంగాలు, ఫిర్యాదు పద్ధతులు ఉన్నాయని, అవి మెరుగుపడవలసి ఉందని రాశారు. ‘న్యాయవ్యవస్థలో అవినీతి’ అనే ఉపశీర్షిక కింద, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయి 2025 జూలైలో చేసిన ఒక ఉపన్యాసాన్ని ఉటంకించారు. అందులో ఆయన న్యాయమూర్తుల అవినీతి ఉదంతాలు, తప్పుడు ప్రవర్తన ఉదంతాలు ప్రజలలో న్యాయవ్యవస్థ మీద విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని, ఆ విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి తక్షణ చర్యలు, పారదర్శక చర్యలు తీసుకోవాలని అన్నారు. జస్టిస్ గవాయి మాట కూడా అవసరం లేదు, న్యాయవ్యవస్థలో అవినీతి ఉన్నదని దేశ ప్రజలందరికీ తెలుసు. ఆ అవినీతికి అనేక ఉదాహరణలు ఇటీవలి కాలంలో వార్తలకెక్కాయి. న్యాయమూర్తి ఇంట్లో తగులబడిపోయిన కరెన్సీ నోట్ల బస్తాల ఉదాహరణ ఇంకా ప్రజల జ్ఞాపకంలో పచ్చిగానే ఉంది. కేసు ఏ న్యాయమూర్తి దగ్గరికి వస్తే, ఏ బెంచీ మీదికి వస్తే అనుకూలమైన తీర్పు వస్తుంది అని కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. రాజకీయనాయకులకు భజన చేసిన న్యాయమూర్తులు కూడా ఉన్నారు. పదవిలో ఉన్నప్పుడు, చట్టాన్ని కూడా పక్కనపెట్టి ప్రభుత్వానుకూల తీర్పులు ఇచ్చి, పదవీ విరమణ కాగానే అధికార పార్టీ నుంచి పదవులూ, లాభాలూ, ఆదాయమార్గాలూ పొందిన న్యాయమూర్తులు కూడా ఉన్నారు.

ప్రభుత్వానికీ అధికారపార్టీకీ అనుకూలమైన అక్రమ తీర్పులు ఎన్నో ఇచ్చిన ఒక మాజీ ప్రధాన న్యాయమూర్తి, పదవి దిగిన వెంటనే అధికారపార్టీ రాజ్యసభ సభ్యుడు అయి న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ దిగజార్చారు.


న్యాయవ్యవస్థ తన ప్రతిష్ఠ తానే దిగజార్చుకుంటున్న ఇటువంటి నేపథ్యంలో, అదే విషయం ఒక పాఠ్యపుస్తకంలో ఉండడం తప్పు అవుతుందా? ఎనిమిదో తరగతిలోనే ఆ విషయం చెప్పవచ్చునా, ఇంకా పై తరగతుల్లో చెప్పాలా అనేది చర్చనీయాంశం కావచ్చు. కాని ఆ విషయం రాయడమే తప్పు, నిషేధించాలి అనడం అప్రజాస్వామికం, నిరంకుశం.

అయితే న్యాయవ్యవస్థలో అవినీతిని అతి ఎక్కువగా వాడుకున్న, వాడుకుంటున్న సంఘ్ పరివార్ నాయకత్వంలో ఈ పాఠం ఎలా రాశారనేది కూడా ఆలోచించవలసిన విషయమే. అన్ని రాజ్యాంగ వ్యవస్థలనూ ధ్వంసం చేసిన, అప్రతిష్ఠపాలు చేసిన సంఘ్ పరివార్ ఇంకా న్యాయవ్యవస్థకు ఎంతో కొంత ప్రతిష్ఠ మిగిలి ఉన్నది గనుక దాన్ని ధ్వంసం చేసే ప్రయత్నం లోనే ఈ పని చేసిందని ఒక అభిప్రాయం ఉంది.

దానితో పాటే ఆలోచించవలసిన మరొక విషయం ప్రతిపక్ష కాంగ్రెస్ కు చెందిన ఇద్దరు సీనియర్ న్యాయవాదులు ఈ పాఠం గురించి ఎత్తి చూపడం, సుప్రీంకోర్టు, ప్రభుత్వం కూడా వెంటనే అంత తీవ్రంగా స్పందించడం, వ్యవస్థను, యథాతథ స్థితిని కాపాడడంలో అందరికందరూ ఒకే తానులో ముక్కలే అని మరొకసారి చూపుతున్నాయి. అలాగే ఎన్‌సిఇఆర్‌టి విషయానికే వస్తే, గత పన్నెండు సంవత్సరాలలో అది ప్రచురించిన ఎన్నో పుస్తకాలలో ఇంకా తీవ్రమైన, సమాజ వ్యతిరేకమైన, చరిత్ర వ్యతిరేకమైన అబద్ధాలు చెప్పడం, నిజాలు దాటవేయడం వంటి ఎన్నో మార్పులు సంఘ్ పరివార్ నాయకత్వంలో జరిగాయి. గాంధీ హత్య గురించిన పాఠంలో నాథూరాం గాడ్సే పేరు, ఆర్ఎస్ఎస్ పేరు తొలగించారు. మొఘల్ చక్రవర్తుల పాలనా కాలాన్ని మొత్తం తీసేశారు. పీరియాడిక్ టేబుల్ తీసేశారు. డార్విన్ పరిణామవాదం తీసేశారు. ప్రజాస్వామ్యం గురించి, కులం గురించి పాఠాలు తీసేశారు. 2002 గుజరాత్ మారణకాండ పాఠం తీసేశారు. స్వతంత్ర భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు అబుల్ కలాం ఆజాద్ పేరు తీసేశారు. పాఠ్యపుస్తకం తొలిపేజీల్లో ప్రచురించే రాజ్యాంగ ప్రవేశిక తీసేశారు. ఇటువంటి ఎన్నో మౌలికమైన మార్పులు జరిగిపోతుంటే స్పందించాలని న్యాయస్థానాలు ఎప్పుడూ అనుకోలేదు. ఇక మొత్తంగా సమాజంలోకి వస్తే, దేశంలో జరిగే అనేక అన్యాయాలు, హింసాకాండలు, ఒక మతాన్ని ఎక్కుపెట్టి సాగిన హత్యాకాండలు, ఆహారం మీదా, ఆహార్యం మీదా ఆంక్షలు, భయంకరమైన ద్వేష ప్రసంగాలు, హద్దులు మీరిన అవినీతి, రాజ్యాంగ ఉల్లంఘనలు, అక్రమ నిర్బంధాలు, విచారణ కూడా జరపకుండా ఐదేళ్లు పదేళ్లు జైళ్లలో ఉంచడం వంటి అక్రమాలేవీ కూడా సు మోటో విచారణ జరపవలసినవనీ, తీవ్రంగా స్పందించ వలసినవనీ, చర్యలు తీసుకోవలసినవనీ న్యాయవ్యవస్థకు ఎప్పుడూ అనిపించలేదు. ఆ కేసులు తమ ముందుకు వచ్చినప్పుడు కూడా చట్టబద్ధంగానైనా ప్రవర్తించ లేదు. ఇప్పుడు హఠాత్తుగా తమకు సంబంధించిన విషయం వచ్చేసరికి, అది ఎంత బహిరంగ రహస్య మైనా, దాన్ని తొక్కిపట్టాలనీ, బాధ్యుల “తల లు రాలాల”నీ, చర్యలు తీసుకోవాలనీ మహాఘనత వహించిన భారత సర్వోన్నత న్యాయస్థానం అనుకుంటున్నది. అంతకు ముందు ఎట్లా ఉన్నప్పటికీ, ఈ స్పందన ద్వారానే సుప్రీం కోర్టు ఆ పాఠం వాస్తవమేనని చెప్పకనే చెప్పింది. విప్లవ కవి ఎన్ కె యాభై ఐదు ఏళ్ల కింద రాసినట్టు, ‘సత్యాన్ని చాటే పుస్తకాల్ని నిషేధించగలరు గాని సాక్ష్యంగా బతికే ప్రపంచాన్ని ఏం చేస్తారు?’



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.




## మనం-వాళ్లు

మనం ఎక్కడున్నాం?
కుల మతాల దగ్గర!
తిట్లతో తన్నుకుంటూ
విద్వేషాలతో
తక్కువఎక్కువలతో!
ఉమ్మడికుటుంబాల్లేవు
ఏక కుటుంబాలు!
సుఖసంతోషాల్లేవు
ఉద్యోగాలకోసం
దేశాలమ్మటపడి
వాళ్ళునడిపిస్తారు
మనం నడుస్తాం!
వాళ్లు ఏ పనిచేసితే
ఆపనికి ఎగపడతాం!
వాళ్లు కోట్లుకోసం
మనం భుక్తి కోసం!
మనచేతులతో
మనకళ్ళేపొడిచి
ఒంటరివాళ్ళను
చేశారు!
అన్నం వ్యాపారం
నీళ్లు వ్యాపారం
పాలువ్యాపారం
పైగా అన్నీ కల్తీలు
కానిదేదీ కల్తీకనర్హం!
మనిషిని నాశనంచేసే
‘కోట్ల’ వ్యాపారాలు!
భూమి గాలి నీరు..
సర్వం కాలుష్య
కోరల్లో
సర్వనాశనం చేసి
వికటాట్టహాసాలతో
కులుకుతున్నారు!
గ్రహాంతరాలకు
పోయి
అక్కడ దుకాణాలు
తెరవాలని
చూస్తున్నారు!
మనం కీలుబొమ్మలం
తోలు బొమ్మలం!
ఎలాఆడిస్తే అలా
ఆడతాం
దేవుడు ఆడిస్తున్నాడని
నమ్మి బ్రతికేస్తాం!
వాళ్లకు మనలాగా
కులాల్లేవు!మతాల్లేవు!
ఈ జాడ్యం మనకే!
వాళ్ళుఅంటగట్టిందే
మనబతుకులింతే!
మోసగాళ్ళ మాయలో
మళ్ళీ వాళ్ళకే ఓట్లేస్తూ
దిక్కులేక బతికేస్తాం!
‘వాళ్లు’ పాలకులు
‘మనం’ పాలితులం!
వేల సంవత్సరాలుగా
అబద్ధాలు చెప్పి చెప్పి
మోసాలు చేసి చేసి
వాళ్లు గ్రహాంతరాలకు
మనం
నరకయాతనకు!
మనం నమ్మినదేవుడు
ఎప్పటికీ రాడు!
నమ్మించింది వాళ్లు!
గుళ్ళుమసీదులు చర్చి
కట్టించింది వాళ్లు
నరకము స్వర్గము
ఆత్మ పరమాత్మ
పూర్వజన్మలు
పునర్జన్మలు
పూజలు
అభిషేకాలు
వాళ్ల
సృష్టించిన‘వల’లో!
వాళ్లు గ్రహాంతరాలకు
మనం నిత్య
దరిద్రానికి!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# సమగ్ర విద్యతో సమానత్వ సమాజ నిర్మాణం..!!



విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు,మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవన పద్ధతి.

విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది,నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది, నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈ మూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు, సమాజం అభివృద్ధి చెందుతుంది, దేశం ముందుకు సాగుతుంది.

విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం. నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి, నవ చైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. నైపుణ్యం ఆధునిక ప్రపంచానికి పునాది, ప్రపంచం మారుతోంది. జ్ఞానం కంటే నైపుణ్యాలే నేటి ఉద్యోగ విపణిలో ముఖ్యం అవుతున్నాయి. కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, టీమ్ వర్క్, సమస్య పరిష్కరణ, నాయకత్వ లక్షణాలు వంటి అనేక నైపుణ్యాలు వ్యక్తిని విజయ వంతుడిగా నిలబెట్టే మెట్లు. సాంప్రదాయ విద్యలో నైపుణ్యాల మీద పెద్దగా దృష్టి ఉండలేదు. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యా వ్యవస్థ నైపుణ్యాల పెంపు వైపు మల్లాలి. పాఠశాల స్థాయి నుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బల పరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు.

నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలినుంచి మార్చుతుంది. నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు.

ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాల పట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు.

నవ చైతన్యం అభివృద్ధికి కొత్త దారి, భవిష్యత్తు నవ చైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలకఅంశం. కేవలం పాఠాలు నేర్పించడం సరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకు సాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవ చైతన్యాన్ని పెంపొందించే మార్గాలు.

నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది.

సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్య లక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగినవాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది.

దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం. పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి అవసరం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలల నుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్ని కోణాల్లో అభివృద్ధి చేసే సమగ్ర ప్రక్రియ కావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు, సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు వైపు తీర్చిదిద్దుతున్నాయి. విద్యా నిపుణులు చెబుతున్నదేమిటంటే, నేటి తరం ఉద్యోగాలకే కాదు, జీవితానికి సిద్ధము అవ్వాలి. అందుకోసం నైపుణ్యం, నీతి, సృజనాత్మకత కలిసి నడిచే విద్య అవసరం అని. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను పెంపొందించే ఆవిష్కరణ క్లబ్‌లు, ల్యాబ్‌లు, సైన్స్ ఫెయిర్లు కూడా విద్యాసంస్థల్లో ప్రాధాన్యం పొందుతు న్నాయి. డిజిటల్ విద్యాభ్యాసం గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్దఎత్తున విస్తరిస్తుండటం మరో ముఖ్య పరిణామంగా భావిస్తున్నారు. ఆన్ లైన్ క్లాసులు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ లైబ్రరీలు విద్యను మరింత చేరువ చేస్తున్నాయి. మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలుచేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు, జీవిత నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.



**సొప్పరి నరేందర్**
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
9553958648

# ఏ దేశ ప్రత్యేకత ఆ దేశానిదే



ఏ దేశ ప్రత్యేకత ఆ దేశానిదే అని మావో ఆనాటి పరిస్తిస్థులలో కలిగిన అనుభవాలు, సూచించి ఆచరించిన కార్యక్రమాలు మార్క్సిజంకు చేసిన చేర్పులను మావోయిజం అన్నారు. మావోయిజం అంటే ఏమిటి? అది సూచించే కార్య క్రమాలు , అవగాహన, పరిష్కారాలు , లక్ష్యాలు ఏమిటి? ముందు తెలుసు కోవాలి. వాటిని ఇతరత్రా పరిష్కారం , ఆ లక్ష్యాలు సాధించ వచ్చా? అని పరిశీలించాలి. ఫ్రెంచి విప్లవాల అనుభవాల నుండి మార్క్స ఎంగెల్సులు 1848లో కమ్యూనిస్టు ప్రణాళిక రాసారు.

ఆ సమయంలో పూలే విద్య అందించాలని స్కూల్లు పెట్టాడు. 1857లో ఇండియాలో మొదటి స్వాతంత్ర పోరాటం జరిగింది. ఈస్టిండియా కంపెనీ నుండి పరిపాలన బ్రిటిష్ ప్రభుత్వ పాలన లోకి వచ్చింది. అనేక చిన్న రాజ్యాలను కలుపుకుంటూ అఖండ భారత్ ను లేదా భారత ఉప ఖండాన్ని ఏకం చేసారు. వలస పాలన ఐనప్పట్టికీ ఏదో ఒక రాజ్యాంగ బద్ద పరిపాలన మొదలైంది. తిరుగుబాట్లు అణిచివేస్తూ దరఖాస్తులు విజ్ఞాపనల ద్వారా అడగండి వీలైనవి చేసిపెడుతాం అన్నారు. అలా బాల్య వివాహాలు, సతీ సహగమనం నిషేధించారు. రైల్లు వేసారు. రోడ్లు వేసారు. తేయాకు , పొగాకు వంటి పంటలను ప్రోత్సహించారు. వ్యవసాయ భూములపై పన్నుల వసూలు కోసం జాగీరుదారు, జమీందారు, సంస్థానాలు , కోర్టులు , ఆధునిక మెకాలే విద్యా విధానం ప్రవేశ పెట్టారు. ఇండియాలో బ్రిటిష్ రాజ్యం తర్వాత అతి పెద్ద రాజ్యం ఔరంగజేబు ఇచ్చి న గవర్నర్ పదవి నుండి పన్ను కట్టం అని స్వతంత్రం ప్రకటించుకొని నైజాం రాజ్య పాలన మొదలు పెట్టారు. అందువల్ల మొఘల్ బాదుషా నాయకత్వంలో జరిగిన తిరుగు బాటును నైజాం వ్యతిరేకించారు. ఈస్టిండియా కంపనీకి, ప్రభుత్వానికి ఆంధ్ర, రాయల సీమ ప్రాంతాలను అప్పగించారు. బ్రిటిష్ పాలనలో అవి అభి చెందాయి. రోడ్లు రైల్లు ప్రాజెక్టులు నిర్మించారు. వారు బ్రాడ్ గేజ్ లైన్లు వేస్తే నిజాం తన రాజ్య పరిధిలో మీటర్ గేజ్ లైన్లు వేసారు. బ్రిటిష్ ప్రభుత్వం వలెనే 1883లో పరిపాలన సంస్కరణ లు చేపట్టారు. రాజులచే, బ్రిటిష్ కంపెనీచే ప్రభుత్వం టోల్ గేట్ కాంట్రాక్టర్లలా నియమిం చబడిన వారు ఏకు మేకై జమీందారీ జాగీర్దారీ భూస్వాములుగా స్థిర పడినారు. గ్రామాలు శతాబ్దాలుగా గ్రామీణ స్వయం పోషక ఆర్థిక వ్యవస్థగా స్వయం సంపూర్ణంగా కుల వ్యవస్థ నిర్మితిలో కొన సాగుతూ వచ్చింది. 1810 నుండి విదేశీ పరిశ్రమల ఉత్పత్తుల దిగుమతులు పెరిగి దేశీయ ఉత్పత్తులపై డోనాల్డ్ ట్రంపు వలె వందశాతం పైగా పన్నులు వేసి కుటీర/ గ్రామీణ/ దేశీయ పరిశ్రమలను దెబ్బదీసారు. సముద్ర వ్యాపారం వల్ల ఓడ రేవులు గల ప్రాంతాలలో సముద్రీర ప్రాంతాలలో విద్యాభివృద్ధి మొదలైంది.

### ప్రపంచానికి ఫ్రాన్సు విప్లవం వెలుగులు

ఫ్రాన్సు విప్లవం నుండి స్వేచ్ఛ సమానత్వం సైభ్రాతృత్వం, సోషలిజం అనే నినాదాలు ప్రపంచానికి విస్తరించాయి. ప్రౌధాన్ వంటి సోషలిస్టులు మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో బహుళ పార్టీల వ్యవస్థలో సోషలిజం సాధించాలని అన్నారు. ఆ ప్రతిపాదనను వ్యతిరేకించి మార్క్సు ఎంగెల్సులు ఏక పార్టీ వ్యవస్థ తో కమ్యూనిజం వైపు కార్మికుల నాయకత్వంలో సాగాలన్నారు. ఫ్రెంచి సోషలిస్టు విప్లవం 62 రోజులు పరిపాలన సాగించింది. 62 రోజులకు సైనికులు తిరుగుబాటు చేసి విప్లవకారులను చంపేసారు.దాంతో మార్క్సు ఎంగెల్సులు కార్మిక వర్గం తన సొంత సైన్యం ఏర్పాటు చేసుకోవాలి అని గుణ పాఠాలు రాసారు.

### ఫ్రెంచి సోషలిజం వేరు- మార్క్సు సోషలజం వేరు

ఫ్రెంచి సోషలిజం వేరు. మార్క్సు సోషలిజం వేరు. కనక రెండు శిబిరాలుగా విడిపోయారు. మార్క్సిస్టులు కమ్యూనిస్టులుగా పిలువ బడ్డారు. కమ్యూనిస్టు సిద్ధాంతంతో స్థానిక / దేశీయ / సమకాలీన పరిస్థితులకనువుగా మరికొన్ని వాదాలను కార్క్రమాలను రూపొందించి విప్లవంతో అధికారంలోకి వచ్చిన లెనిన్ తో లెనినిజం అన్నారు. అట్లే చైనా పరిస్థితులలో దీర్ఘ కాలిక సాయుధ గెరిల్లా పోరాటం, లాంగ్ మార్చ్, విముక్త ప్రాంతం నుంచి దేశమంతా విస్తరించడంసాగించిన మావో వలె మనం కూడా ఇండియాలో యుద్ధం చేసి అధికారంలోకి రావాలి అని సాగిన వారిని మావో యిస్టులు అని పిలుస్తున్నారు. చైనాకు ఇండియాకు మధ్య పోలికలతో పాటు వ్యత్యాసాలున్నాయి. ఏదో ఒక రకమైన రాజ్యాంగం 1919 , సైమన్ కమిషన్, స్థానిక దేశీయుల పరి పాలన ఇండియాలో కొనసాగుతూ వచ్చింది. 1935 నాటికే భారత రాజ్యాంగం రూపు దిద్దుకున్నది.. రెండవ ప్రపంచ యుద్ధానంతర పరిణామాల్లో హిట్లర్ ఓడి పోక, సుభాష్ చంద్రబోస్ బతికి వుండి తాను నిర్మించిన ఆజాద్ హింద్ ఫౌజ్ తో ఏం జరిగి వుండేదో? ఇద్దరి మరణం చరిత్ర గతిని మార్చింది. 1946లో బ్రిటిష్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం భారత రాజ్యాంగ పరిషత్ ను ఏర్పరింది. 1947 ఆగస్టులో మీరే ఏలుకొండి అని వెళ్లి పోయారు. 1950 జనవరి26 నుండి కొత్త రాజ్యాంగం అమలులోకి తేవడం జరిగింది. చైనాలో ఇలా 1857 నుండి లేదా 1883 నుండి ఇండియాలో సాగినట్టు సాంఘిక సంస్కరణలు, రాజకీయ సంస్కరణలు, పరిపాలన వ్యవస్థ లలో దేశీయుల ప్రాతిధ్యం, బ్రహ్మణులకు, ముస్లింలకు, అణగారిన వర్గాలకు ప్రాతిద్య రిజర్వేషన్లు ఇండియాలో వలె చైనాలో క్రమ పరివర్తన సాగలేదు. మనకు 1921 నుండి ఆయా ప్రావిన్సు రెసిడెన్సీలలో ముఖ్య మంత్రులు, మంత్రి వర్గాలు ఏర్పడి కొన సాగాయి.

### అన్నీ మారినా మారని కింది వ్యవస్థ

బ్రిటిష్ వారు వెళ్లి పోవడంతో కేంద్ర ప్రభుత్వం నుండి వెళ్లి పోయారు. 565సంస్థానాలను కలిపి ఫజల్ అలీ కమిషన్ సిఫారసులతో 14 రాష్ట్రాలు రూపు దిద్నకున్నాయి. శతాబ్దాలుగా అనేక రకాల పరిపాలకులు సంస్థానాలు నైసర్గిక ప్రత్యేకతలు, వర్ణ కుల వివక్ష వ్యత్యాసాల వల్ల 1950 నుండి దేశ వ్యాప్తంగా అనేక ఆందోణలు, ఉద్యమాలు కొనసాగుతూ వచ్చాయి. అన్ని ఉద్యమాలకు మూల కారణాలు.

- కేంద్రం, రాష్టం, జిల్లా స్థాయిలో పరిపాలన వ్యవస్థలు మారాయి. రాజులు కూడా ఎన్నికల ద్వారానే అధికారంలోకి రావలసి వచ్చింది.
- జిల్లా స్థాయి మేరకు పరిపాలన మారినా గ్రామ స్థాయిలో 1840 నుండి అంతకు ముందు నుండి కొనసాగుతూ వచ్చిన టోల్ గేట్ కాంట్రాక్టర్ల వంటి జమిందారులు జాగీరు దారులు, భూస్వాముల వద్ద ఉండి పోయిన భూముల ను, పట్వారి పోలీసు పటేల్ మాలి పటేల్ వ్యవస్థను రద్దు చేయ లేదు.
- ప్రణాకలను జిల్లా యూనిట్‌గా, గ్రామం యూనిట్‌గాఅమలు జరిపితేకేంద్రం, రాష్టంలో వలె మార్పులు వేగవంత మయ్యేవి. ఇదొక్కటే జరగక పోవడం వల్ల మొత్తం దేశ రాజకీయాలు పరిపాలన అంతా అదే అనుకోవడం చారుమజుందార్, నక్సలైట్లు, కొండపల్లి సీతారామయ్య, గణపతి. తదితరులు చేసిన అవగాహన లోని పొరపాట్లు.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## అంగరంగ వైభవంగా వెల్చాల్ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

- భారీగా తరలివచ్చిన వివిధ గ్రామాల భక్తులు



**మోమిన్‌పేట, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** అంగరంగ వైభవంగా భక్తీ శ్రద్ధలతో వెల్చాల్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం గ్రామ పెద్ద ల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల తో నిర్వహించారు. శనివారం మోమిన్ పెట్ మండలంలోని వేల్చాల్ గ్రామ శివారులోని పులిలంక అడవి ప్రాంతంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జాతర మహోత్సవం నిర్వహించారు. పులిలంక గుట్టపైన లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం తరువాత వేలాదిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ దామోదర్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, మున్నూరి కిరణ్ కుమార్, రఘువీరారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సంజీవరెడ్డి, సమ్మయ్య, మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు స్థానిక నాయకులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి



**ఫరూఖ్‌నగర్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యార్థి దశ నుండే క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలనీ ఫరూక్ నగర్ మండల విద్యాధికారి టి.మనోహర్ అన్నారు శనివారం నాడు ఫరూక్ నగర్ మండలం చేల్క చిల్కమర్రి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని అన్నారు. క్రమశిక్షణతో ఎదిగి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి గంట్లవెల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి ఉపాధ్యాయులు బిజిలి సత్యం,పారిజాత యూటిఎఫ్ సీనియర్ నాయకులు యాదయ్య, స్వయం పరిపాలన దినోత్సవ కార్యక్రమంలో తాత్కాలిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చరణ్, విగ్నేష్, ఉపాధ్యాయులుగా సుచిత్ర, రిషి, అర్చన, శ్రీజారెడ్డి, అక్షిత, హర్ష విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యార్థులకు బోధన చేశారు.

## రాజీవ్ రహదారి విస్తరణకు రైతుల స్వచ్ఛంద భూసమర్పణ




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ నుండి శామీర్‌పేట్ వరకు చేపడుతున్న రాజీవ్ రహదారి విస్తరణ పనులలో భాగంగా భూమి సమర్పణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన లోతుకుంట రైతులు, స్థల యజమానులతో జిల్లా స్థాయి చర్చల కమిటీ (డిఎల్ఎన్‌సి) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి నిర్వహించారు. శనివారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పోతాయిపల్లి అవార్డు ఇప్పటికే పాస్ అయిందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సహకరిస్తూ రైతులు స్వచ్ఛందంగా భూమి ఇవ్వడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములకు తగిన పరిహారం అందించాలని, సుమారు రూ.1,50,000 వరకు రేటు నిర్ణయించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గత మూడు సంవత్సరాలుగా లోతుకుంట ప్రాంతంలో భూమి క్రయవిక్రయాలు జరగలేదని, అల్వాల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డులను పరిశీలించి సంబంధిత ప్రాంతానికి తగిన ధరలను పరిగణనలోకి తీసుకొని ఉత్తమ రేటు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున రైతులకు సాధ్యమైనంత మంచి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ నిర్ణయంపై రైతులు, స్థల యజమానులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అంగీకారం తెలిపారు. దీంతో లోతుకుంట డిఎల్ఎన్‌సి సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎల్ఏ (ఇండ్స్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. మాలతి, హెచ్ఎండిఎ అధికారులు, అల్వాల్ తహసీల్దారు రాములు, రెవెన్యూ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేటి బాలలే..రేపటి శాస్త్రవేత్తలు




**శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని శంకర్పల్లి మాస్టర్ మైండ్స్ పాఠశాల చైర్మన్ రాజు సంగని పేర్కొన్నారు. శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే మరియు, వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రాబోయే రోజుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటే విధంగా పాఠశాల స్థాయి నుంచే బోధన అభ్యాస ప్రక్రియలు చేపడుతున్నట్లు తెలిపారు.విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కళాత్మక రంగాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రతిభ కనబరచడానికి వీలుగా బోధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్ వెంకటరమణ, ఏ నాగరాజ్, ఎం శ్రీధర్ రావు, ప్రిన్సిపల్ ఎన్ ఉషారాణి మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చొరవతోనే విద్యుత్ సమస్య పరిష్కారం

- ఎమ్మెల్యే ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన క్వారీ అసోసియేషన్ సభ్యులు



**తాండూరు, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నాపరాయి పరిశ్రమకు కేవిఎఆర్ హెచ్ పవర్ ఫ్యాక్టర్కు సంబంధించిన అసాధారణ విద్యుత్ బిల్లుల అంశంలో ముఖ్యమైన పరిష్కారం లభించిందని క్వారీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టోన్ మర్చంట్ మరియు మండల క్వారీ అసోసియేషన్ ఐక్య ప్రయత్నాలు, నిరంతర ప్రాతినిత్యం మరియు ఎప్పటికప్పుడు పాలోఅప్ చేయడం ఫలితంగా, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చేసిన సమయోచిత జోక్యం వల్ల సంబంధిత విద్యుత్ శాఖ సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు.నాపరతి పరిశ్రమ యూనిట్లకు జారీ చేసిన అసాధారణ మరియు అధిక విద్యుత్ బిల్లులను పునఃసమీక్షించి సవరించేందుకు శాఖ అంగీకరించిందని తెలిపారు. ఇప్పటికే వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రాబోయే బిల్లుల్లో సర్దుబాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు ఈ నిర్ణయం పరిశ్రమకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు చిన్న మరియు మధ్యతరహా యజమానులకు ఉపశమనం కలిగిస్తుందన్నారు .ఈ సమస్య పరిష్కారంలో స్టోనభవన్ నిరంతర కృషిని అభినందిస్తూ, పరిశ్రమ ప్రయోజనాల కోసం ముందుకు వచ్చిన మనోహర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఇకపై అన్ని ఫ్యాక్టరీ మరియు క్వారీ యజమానులు విద్యుత్ శాఖ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి. నిర్దేశిత పవర్ ఫ్యాక్టర్ (పిఎఫ్) స్థాయిని కొనసాగించేందుకు తక్షణ సాంకేతిక చర్యలు తీసుకోవాలి. ఆటోమెటిక్ పవర్ ఫ్యాక్టరీ కంట్రోలర్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా పిఎఫ్ స్థాయిని నియంత్రించాలి.అన్ని యూనిట్లు 31/03/2026 లోపు నిర్దేశిత ప్రమాణాలను అమలు చేయాలి. పరిశ్రమ అభివృద్ధి మరియు స్థిరత్వం కోసం సభ్యులందరూ ఐక్యంగా, బాధ్యతతో ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో క్వారీ అసోసియేషన్ అద్యక్ష, కార్యదర్శులు ,సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు బిక్షాటన అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔట్సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమించబడి సంవత్సరాలు గా సంస్థలకు సేవలు అందిస్తున్న, ఐదు నుండి 15 సంవత్సరాల సర్వీసు ఉన్న వారిని సైతం సర్వీస్ నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ శాఖలు సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 450000 వేల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఏజెన్సీలను రెన్యువల్స్ ఇవ్వకుండా ఔట్సోర్సింగ్, ఏజెన్సీ వ్యవస్థ ను రద్దు చేసి, నేరుగా కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తే ఉద్యోగాలు భద్రత కలుగుతుందని, ఏజెన్సీలకు కమిషన్ రూపంలో చెల్లించాల్సిన భారీ మొత్తంలో ప్రభుత్వానికి కాదా చేయవచ్చన్నారు. ఉద్యోగులకు ఈపీఎఫ్ ఈఎస్ఐ వంటి ప్రయోజనాలు సక్రమంగా లభించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సర్వీస్ లో మరణించిన వారికి కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ అయిన వారికి 10 లక్షల రూపాయలు ఆత్మ సహాయం అందించాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు అన్ని రకాల సెలవులు కలిపి 15 మాత్రమే ఉన్నాయని వాటిని 30 కి పెంచాలని, శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, కార్పొరేషన్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మత్స్యకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**శామీర్‌పేట, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం, శామీర్‌పేట మండల తహసీల్దార్ టి.సుచరితను కలిసి మండలంలోని మత్స్యకారుల సమస్యలపై వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి మాట్లాడుతూ.. సరైన సమయంలో చేప పిల్లల పంపిణీ తగిన మోతాదులో ప్రభుత్వం అందించక పోవడం వలన మత్స్యకారులు ఉపాధి కోల్పో తున్నారని అన్నారు. గుర్క జాతి చేపలను అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో చేరుస్తా మని ప్రతిపాదనలు చేసింది కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం వల్ల మత్స్యకారులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే ఉన్నత అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా శక్తి కోశాధికారి రమేష్ అంబటి, రాము ముదిరాజ్, మత్స్యకారుల సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా డైరెక్టర్ కొరివి కృష్ణ ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, ప్రశాంత్, మహేష్, బాలకృష్ణ, రజిని, రాజేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థులు సృజనాత్మకతో ముందడుగు వేయాలి




**కోట్‌పల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహణ శనివారం పీఎం శ్రీ పథకం భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న నిర్వహించే జాతీయ సైన్స్ దినోత్సవం, భారత ప్రముఖ శాస్త్రవేత్త సివి రామన్ ప్రభావం ఆవిష్కరణకు గుర్తింపుగా నిర్వహించబడుతుంది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి చంద్రప్ప మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం సమాజ అభివృద్ధికి అత్యంత కీలకమని పేర్కొన్నారు.విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, సృజనాత్మక ఆలోచనలతో కొత్త ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఏఏపిసి పాఠశాల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పలు శాస్త్రీయ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. విజ్ఞాన క్విజ్‌లు, సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్‌లు, శాస్త్రీయ ప్రదర్శనలు, ముగ్గుల పోటీలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ శాస్త్రీయ ఆలోచన విధానాన్ని ప్రతిబింబించే వినూత్న మోడళ్లను రూపొందించారు.శాస్త్ర విజ్ఞానం మన దైనందిన జీవితంలో ఎంతో ముఖ్యమని వివరించారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచిస్తూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్ మరియు జీవశాస్త్ర ఉపాధ్యాయులు లక్ష్మణ్, యాస్మిన్ బేగంలను, యాదవ రెడ్డి, నరసింహారెడ్డి, తిరుమలయ్య, మల్లేష్ కుమార్, డాక్టర్ ఫాతిమా బేగం, శ్యామయ్య, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు మరియు విజేత స్కూల్ పాఠశాల విద్యార్థులు. శ్రీ సాయి విద్యానికేతన్. పాఠశాల విద్యార్థులు. కేజీబీవీ పాఠశాల శ్రీలత ఇన్చార్జి.ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోట్ పల్లి మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడంలో, సృజనాత్మకతను ప్రోత్సహించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచింది.

## మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ



**ఊర్కొండ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మండలంలోని జగబోయిని పల్లి గ్రామంలో శనివారం మహిళా సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ సోనీ నరసింహ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు తమ సమావేశాలను నిర్వహించుటకు , తమ కార్యకలాపాలను సొంత భవనంలో నిర్వహించుకోవడం వల్ల ఆర్థిక, సామాజిక సాధికారత మరింత మెరుగుపడుతుందనీ,గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది, ఈ భవనం వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని ఆశాభావం వ్యక్తం చేశారు.అలాగే నియోజకవర్గ శాసనసభ్యులు అనిరుధ్ రెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని, ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ ప్రగతే విశ్వ ప్రగతికి మూలం

- కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవం
- కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు
- మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రశాంత్



**తాండూరు, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** శాస్త్రీయ ప్రగతే విశ్వ ప్రగతికి మూలమని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణంలో ని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ లో గొప్ప శాస్త్రవేత్త సివి రామన్ జయంతిని పురస్కరించుకుని విజ్ఞాన శాస్త్రానికి ఆయన చేసిన విశేష కృషికి గౌరవం మరియు కృతజ్ఞతగా సర్ సివి. రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వేడుక ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్, మరియు డైరెక్టర్ సతీష్ హాజరై అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు శాస్త్రీయ రంగంలో రాణించమన్నారు. విద్యార్థులు సివి రామన్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు, టిచర్ లు విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

## ఉప్పల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరుతో భారీ మోసం

- సుమారు రూ.1.8 కోట్ల వసూళ్లు, బాధితుల ఆవేదన



**ఉప్పల్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ఉప్పల్ పోలీస్ పరిధిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. రామంతపూర్ చర్చి కాలనీకి చెందిన మరియమ్మ అనే మహిళ ప్రభుత్వ పథకాల ద్వారా డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని, అలాగే ప్రభుత్వ స్థలాలు మరియు ఉద్యోగాలు కూడా కల్పిస్తానని నమ్మబలికి సుమారు 80 మందికి పైగా వ్యక్తుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల వివరాల ప్రకారం, ఒక్కొక్కరి నుంచి లక్షల రూపాయల చొప్పున డబ్బులు సేకరించి మొత్తం రూ.1.8 కోట్ల వరకు వసూలు చేసినట్లు చెబుతున్నారు. కొందరి నుంచి నగదు రూపంలో, మరికొందరి నుంచి ఫోన్ పే, ఆన్‌లైన్ ట్రాన్స్ఫర్‌ల ద్వారా డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. మొదట్లో త్వరలోనే ఇళ్లు మంజూరు అవుతాయని చెప్పి నమ్మబలికిందని, అవసరమైన పత్రాలు సమర్పించాలని చెప్పి పలుమార్లు డబ్బులు తీసుకుందని బాధితులు వెల్లడించారు.గడువు గడిచినా ఇళ్లు ఇవ్వకపోవడంతో పాటు, డబ్బులు కూడా తిరిగి చెల్లించకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. ఆ తరువాత ఫోన్లు కూడా ఎత్తకపోవడం, ఇంటికి వెళ్లినా అందుబాటులో లేకపోవడంతో తాము మోసపోయామని గ్రహించినట్లు బాధితులు వాపోయారు. తమ జీవిత పొదుపులు, అప్పులు చేసి ఇచ్చిన డబ్బులు తిరిగి రాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో బాధితులు సమూహంగా ఉప్పల్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని, మోసానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. డబ్బుల లావాదేవీల వివరాలు, బాధితుల నుంచి సేకరించిన ఆధారాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.ప్రభుత్వ పథకాల పేరుతో మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అధికారిక ధృవీకరణ లేకుండా ఎవరికి డబ్బులు ఇవ్వకూడదని, సందేహాస్పద పరిస్థితులు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు.

# పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో సహజం

**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** జిల్లా పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవలకు ప్రతీకగా నిలిచిన పెబ్బేరు ఏఎస్సై, బి. బాలస్వామి ,సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖలో 36 సంవత్సరాలపాటు కానిస్టేబుల్‌గా సేవలు ప్రారంభించి ఏఎస్సై హోదా వరకు ఎదిగి విశిష్టంగా విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందుతున్న పెబ్బేరు ఏఎస్సై, బి. బాలస్వామి ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి పదవీ విరమణ పొందిన బాలస్వామి వారి సతీమణిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి,జ్ఞాపకం అందజేసి వారి విశిష్ట సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విధి నిర్వహణలో చూపిన అంకితభావం,ప్రజల పట్ల కర్తవ్య నిబద్ధత ప్రతి ఆదర్శమని, పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మలుపు అని, ఇందులో సంతోషం బాధ



రెండూ సహజమని ఉద్యోగ విరమణతో ఒక కొత్త జీవితం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన రంగంలో కొత్త వ్యాపకం ఏర్పరచుకుని చురుకుగా ఉండాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఖాళీగా ఉండకుండా కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందజేసే జీపీఎఫ్, ఇన్సూరెన్స్, భద్రత సాంక్షన్ బిల్లులు వంటి బెనిఫిట్స్‌ను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు.పోలీసు ఉద్యోగం అనేది త్యాగాలు, క్రమశిక్షణ, ప్రజాసేవల సమ్మేళనం అని, బాధితులకు అండగా నిలిచే అవకాశం ఈ ఉద్యోగం ద్వారా లభిస్తుందని అన్నారు. కష్టపడి పనిచేసినవారికి తప్పక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావలసిన జీపీఎఫ్, ఇన్సూరెన్స్, ఇతర ప్రయోజనాలకు సంబంధించిన పత్రాలను అందజేసి, మిగిలిన బకాయిలు కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరావు, పోలీసు కార్యాలయ ఏఓ సునందన, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పదవీ విరమణ పొందిన బాలస్వామి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సురక్షితమైన డ్రైవింగ్‌తోనే రోడ్డు ప్రమాదాలకు చెక్



**నారాయణపేట, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** సురక్షితమైన డ్రైవింగ్ తోనే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు.రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఉద్దేశంతో అరయివ్,అలైవ్ 2వ విడత కార్యక్రమంలో భాగంగా నారా యణపేట జిల్లా కేంద్రంలోని శాతవాహన డిగ్రీ కళాశాల విద్యార్థులకు సురక్షితమైన డ్రైవింగ్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డ్రైవర్లు యువకులు ఎవరైనా సరే వాహాలను నడిపేటప్పు డు సురక్షితమైన డ్రైవింగ్ తోనే రోడ్డు ప్రమాదాలు నివా రించవచ్చు అని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉంటూ సైన్ బోర్డ్స్ జాగ్రత్తగా గమనిస్తూ వాహనాలు నడ పాలని తెలిపారు.యువత రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణ మని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించడం ద్వారా ప్రమాదాల్లో ప్రాణ నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని,ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాద కరమని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబం సమాజ భద్రత కోసం ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని కోరారు.

## వృద్ధుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**నర్సాపూర్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వృద్ధుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని న్యాయమూర్తి హేమలత అన్నారు. నర్సాపూర్ ఆధ్వర్యంలో విజన్ వృద్ధాప్య ఆశ్రమాన్ని శనివారం సందర్శించారు, ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత, మాట్లాడుతూ వారి సమస్యలను అడగడంతో వృద్ధులు బదిలీస్తూ అమ్మ మాకు నిత్యవసర మందులు లేక ఇబ్బందులు పడుతున్నామని చేతిలో డబ్బులు లేవని,పెన్షన్స్ ఆధార్ కార్డు, కూడా మాకు లేవని ప్రభుత్వ పథకాలు మాకు అందట్లేదని లీగల్ సర్వీస్ ద్వారా న్యాయం చేయమని కోరడంతో, విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు కూడా ఆరు నెలలుగా వైద్యపరమైనటువంటి మందులు వృద్ధులకు రోజువారీగా వాడుకొనుటకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రభుత్వం ఆసుపత్రి ద్వారా సంబంధిత వైద్య పరీక్షలు మాత్రలు ఇప్పించమని న్యాయమూర్తి నీ కోరడంతో తక్షణమే న్యాయమూర్తి ఎం.హేమలత స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖల ఆర్ డి మెడికల్ ఆఫీసర్ ఆధార్ నిర్వాహకులతో సమీక్ష జరిపి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగింది,అనంతరం వృద్ధుల పట్ల అందరూ ప్రేమభావంతో చూడాలి అన్నారు, ఈ కార్యక్రమంలో విజన్ ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు పట్లోళ్ల అబర్ణ, పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, కౌన్సిలింగ్ సూపర్వైజర్ ఎన్.జి.సుజాత రెడ్డి, లీగల్ సర్వీస్ సిబ్బంది తలారి అరుణ, వై. శ్రీనివాస్, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజల్లో శాస్త్రీయ చైతన్యాన్ని కలిగించాలి

**నంగునూరు, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యార్థులు ప్రజలు శాస్త్రీయ చైతన్యం కలిగించాలని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ అంశాల్లో విద్యార్థులు ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. సేంద్రియ వ్యవసాయం, భూకంప అలారం, పంటల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర 36 ప్రదర్శించి వివిధ అంశాల్లో విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. పాఠశాలలో నమూనా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు డాక్టర్లు(కార్డియాలజిస్ట్, గైనకాలజిస్ట్, డెర్మటాలజీస్ట)గా వ్యవహరించి వివిధ (రక్త పరీక్షలు) నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సిద్దిపేట వైద్యురాలు రాచకొండ సాయిశ్రీ సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఆడపిల్లల్లో వచ్చే జబ్బులు పరిశుభ్రత ప్రధాన్యత పై మార్గదర్శనం చేశారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్న బి.ప్రశాంత్ నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యత అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశాన్ని



శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పాటుపడాలని కోరారు సైన్స్ మానవ జీవితాన్ని సుఖమయం చేస్తుందని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తొమ్మిదవ తరగతి విద్యార్థిని గోడెపు కారుణ్య సీ వీ రామన్ వేశ ధారణలో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు గణపతి, కనకయ్య. మన్మోహన్ రెడ్డి, త్రివిక్రమ్ శర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**కృష్ణ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని కృష్ణ మండలం తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఐనా పూర్ పరిధిలో సుకూర్ లింగంపల్లిలో, పోలీస్, రెవెన్యూ అధికారులు సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు. పౌర



హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యశీగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు సినియర్ అసిస్టెంట్ మధుమోహన రెడ్డి, చంద్రశేఖర్ పోలీసులు, గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

**ఊర్కొండ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యార్థులు విజ్ఞాన శాస్త్రాన్ని శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి గొప్ప పరిశోధకులుగా ఎదగాలని మండల విద్యాధికారి అబ్దుల్ రహీం అన్నారు. మండలంలోని స్థానిక శ్రీ వేంకట బాల్ రామయ్య పాఠశాలలో సి. వి రామన్ జయంతి సందర్భంగా సైన్స్ పెయిర్ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దాదాపు 100 అమరికలతో అద్భుతంగా ఆకట్టుకున్నారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ సామల తిరుపతయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాధికారి అబ్దుల్ రెహ్మాన్ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని



సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఊర్కొండ సర్పంచ్ మ్యాకల మంజుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు కలిగి ఉండాలని సూచించారు. బాల శాస్త్రవేత్తలుగా గొప్పగా ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ బాల్ రాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఊర్కొండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, రెయిన్ బో పాఠశాల ప్రిన్సిపాల్ నస్రీన్ , పాఠశాల ప్రిన్సిపాల్ జార్జ్ జోసెఫ్ ,వైస్ ప్రిన్సిపాల్ రామ్ పెరుమాండ్ల మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మీ సేవా సర్టిఫికెట్ పరిశీలన తప్పనిసరి చేయాలి

- అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** గ్రామ స్థాయిలో మీసేవ సర్టిఫి కెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగాన్ని తప్పని సరిగా అమలు చేసి దరఖా స్తులను వేగంగా పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ఎస్.శ్రీను అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జీపీవోలకు మీసేవ సర్టిఫికెట్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా అడి షనల్ కలెక్టర్ రెవిన్యూ శ్రీను మాట్లాడుతూ, మీసేవ కేంద్రా ల్లో స్వీకరించే దరఖాస్తులను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబై ల్ యాప్‌ను అధికారులు సమర్థవంతంగా వినియోగిం చాలన్నారు.



సమర్పించిన దరఖాస్తులు డిప్యూటీ తహసీల్దార్ల స్థాయిలో పరిశీలనకు వెళ్లి, అక్కడ దరఖాస్తుల వివ రాలు,పత్రాలను వెరిఫికేషన్ చేసి తుది ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయం తీసుకుం టారని తెలిపారు. ముఖ్యంగా ఆదాయ,నివాస, కుల ధృవ పత్రాలు వంటి సేవల దర ఖాస్తులు త్వరితగతిన పరిష్కారం పొందేలా ఈ విధానం దోహదపడుతుందని తెలిపా రు.పూర్తిగా డిజిటల్ విధా నంలో పరిశీలన నిర్వహిం చడం వల్ల సేవలు త్వరిత గతిన పూర్తవుతూ, పారద ర్శకత పెరిగి ప్రజలకు సమ యపాలనతో కూడిన మెరుగై న సేవలు అందుతాయని వివరించారు.ఈ శిక్షణలో భాగంగా యాప్ డౌన్‌లోడ్ విధానం,లాగిన్ ప్రక్రియ, ఫీల్డ్ వెరిఫికేషన్ నమోదు,ఫోటో అప్‌లోడ్,రిపోర్ట్ సమర్పణ తదితర అంశాలపై ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ కొంగలి విజయ్ కుమార్ పిపిటి ద్వారా అవ గాహన కల్పించారు. అధికా రుల సందేహాలకు వివరణా త్మక సమాధానాలు అందించి,యాప్ వినియోగాన్ని తప్పని సరిగా అమలు చేయాలని,సూచించారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఈ మీ సేవ సూపరిం డెంట్ దయాకర్ రెడ్డి,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,గ్రామ పరిపాలన అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ ఆర్డీవో



**మెదక్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెదక్ లో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్‌తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆర్డిఓ స్పష్టం చేశారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి శ్రీహరి



**మక్తల్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలో 50 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న 150 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పరిశీలించారు. శనివారం ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి ఈ సందర్భంగా అధికారులకు కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. దాదాపుగా చివరి దశకు చేరుకున్న పనులను మరింత వేగం పెంచి త్వరగా పనులను పూర్తి చేయాలని అన్నారు. వచ్చే డిసెంబర్ నాటికి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా పనుల్లో వేగం పెంచాలని మంత్రి సూచించారు. పూర్తిగా వెనుకబడిన ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం లక్షంగా ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూనే పనుల్లో మరింత వేగం పెంచాలని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్షమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, జి. లక్ష్మారెడ్డి, బి. గణేష్ కుమార్, గోవర్ధన్, యగ్నేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంజేట్టిలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



**న్యాల్‌కల్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మండలంలోని గుంజేటి గ్రామంలో త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టారు. గత కొంతకాలంగా గ్రామంలోని10, 4వ వార్డుల్లో త్రాగునీటి ఎద్దడి నెలకొనడంతో మాజీ జడ్పిటీసీ చంద్రప్ప ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ దృష్టికి తీసుకువెళ్లడంతో.. సానుకూలంగా స్పందించిన ఎంపీ రూ:3.50 లక్షలను మంజూరు చేశారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను మంజూరైన నిధులతో 2025 సంవత్సరంలోనే గ్రామంలోని 10, 4వ వార్డుల్లో బోరు బావులను వేయించారు. తాజాగా శనివారం రెండు బోరు బావులకు మోటార్ ను బిగించి త్రాగునీటి సరఫరా పునరుద్ధరించి ప్రారంభించారు. త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లన్న, శ్రీనివాస్, ఇందమ్మ, గురయ్య స్వామి, సాంబశివుడు, అడివప్ప, మారుతి, సదానంద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమించిన ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల మైదానాన్ని కళాశాలకు అప్పగించాలి

**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ శ్రీపురం రోడ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్ అండ్ కామర్స్) కళాశాలకు చెందిన మైదాన స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ఆక్రమించడం వల్ల కళాశాల విద్యార్థులు క్రీడా కార్యకలాపాలకు తీవ్రంగా నష్టపోతున్నారు. కళాశాల స్థలంగా ఉన్న సర్వే నంబర్లు 65/1, 65/5, 65/6, 65/7 కలిపి ఐదు ఎకరాలు 11 గుంటల స్థలం కాగా, అందులో నాలుగు



ఎకరాల వరకు ఇప్పటికే ఆక్రమించబడ్డాయని ఏబీవీపీ నేతలు తెలిపారు. ఆక్రమించిన మైదాన స్థలాన్ని తిరిగి కళాశాల అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారు. మైదానం లేకపోవడం వల్ల విద్యార్థులకు క్రీడల పరంగా, శారీరక అభివృద్ధిలో ఆటంకాలు వస్తున్నాయి. పలు వినతులు ఇచ్చినా అధికారులు స్పందించకపోవడం బాధాకరం. ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన ధర్నాలు రాస్తారోక్ చేసిన, ప్రెస్ మీట్ పెట్టిన ఈ విషయంపై స్పందించని అధికారులు తక్షణమే మైదానాన్ని తిరిగి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అప్పగించకపోతే, కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ ముట్టడి తప్పదని హెచ్చరిస్తున్నాం, అని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి మల్లేష్ యాదవ్, శివ, రమేష్, జీవన్ ఏబీవీపీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్యులపై దాడులు అమానుషం


- భయాందోళనలు నడుమ వైద్య సేవలు అందించడం అసాధ్యం
- ఆవు గావ్ చలన్, నేషనల్ ఐఎంఏ చైర్మన్ డాక్టర్ కాళీ ప్రసాద్
- నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులపై దాడులు చేయడం అమానుషమైన చర్య అని ఆవు గావు చల్లని నేషనల్ ఐఎంఏ చైర్మన్ డాక్టర్ కాళీ ప్రసాద్ అన్నారు. శనివారం వరంగల్ నగరంలోని ఐఎంఏ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాళి ప్రసాద్ మాట్లాడుతూ బండ్లగూడలో పిల్లల వైద్యుని దాడి చేసి గాయపరచడమే కాకుండా హాస్పిటల్లోని విలువైనటువంటి పరికరాలను ధ్వంసం చేసి భయాందోళనలను సృష్టించారని, అలాంటి మెంతులపై ప్రభుత్వం వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 38 సంవత్సరాల అనుభవం కలిగిన పిల్లల వైద్యుడు డాక్టర్ అర్జున్ పై భౌతిక దాడికి దిగడం అన్యాయమన్నారు. అంతేకాకుండా డాక్టర్ అభిషేక్ మహంకాళిని గంటల తరబడి పోలీస్టేషన్లో బంధించడం అక్రమం అన్నారు. ఈ సంఘటన వైద్యుల వృత్తిపై తీవ్ర అనిశ్చితిని ఏర్పరుస్తుందని ఇలాంటి దృశ్చర్యలకు ఎవరు పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని. అదేవిధంగా వైద్యుల రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం వైద్యులు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా పి. ప్రవీణ్, ప్రెసిడెంట్ ఎలక్ట్, శిరీష్ కుమార్, సెక్రటరీ, ఐఎంఏ వరంగల్ వి. నరేష్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ బందెలా మోహన్ రావు, ఎం. సుదీప్, కొలిపాక వెంకట స్వామి, రాజారెడ్డి, షఫీ, కొత్తగట్టు శ్రీనివాస్, కరుణాకర్, మల్లేశం, అనిల్, నవీన్, ముక్క దిలీప్ కుమార్, రాజా గోపాల్ ,కాకతీయ మెడికల్ కాలేజీ పీజీ వైద్యులు, హౌస్ సర్జన్స్ పాల్గొన్నారు.

# వరంగల్‌లో మోడల్ రాకెట్ ప్రయోగం





**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని భద్రకాళి బండ్ వద్ద శనివారం సాయంత్రం రుద్రమ రాకెట్ (మోడల్ రాకెట్) ప్రయోగించారు. ఈనెల 18 నుంచి 28 వరకు సైన్స్ డే ఉత్సవాల సందర్భంగా . ఏ టి డి ఆర్ ఎల్, రోబో కలాం, కూడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జ్ఞానవంతమైనటువంటి ప్రయోగాన్ని నిర్వహించారు. అయితే సరిగ్గా సాయంత్రం 6 గంటల తర్వాత రుద్రమ మొదటి రాకెట్ను లాంచ్ చేశారు. అది నింగిలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఆ తర్వాత మరో అరగంట తర్వాత మరొక రాకెట్‌నీ ప్రయోగించారు అది కూడా విఫలమైంది. అంతకుముందు శుక్రవారం మధ్యాహ్నం ట్రయల్ రన్ లో భాగంగా నిర్వహించిన రాకెట్ మాత్రం సక్సెస్ఫుల్గా నింగిలోకి దూసుకెళ్లింది. రుద్రమ రాకెట్ ప్రయోగం జరుగుతుందన్న విషయం తెలుసుకున్న వివిధ పాఠశాలలు కళాశాలల విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున మధురకాలి బండకు చేరుకున్నారు. రెండు రాకెట్లు విఫలం కావడంతో వారు నిరాశగా వెనుదిరిగారు. వరంగల్లో ప్రయోగాత్మకంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందరికీ తెలిసేలా భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు వరంగల్‌లో ఇలాంటి ప్రయోగం ఎంతో ఉపయోగపడుతుందని పలువురు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇదే నిర్వాహకులు వారం రోజులుగా నాలుగు టెలిస్కోపుల ద్వారా చంద్రుడిని, జూపిటర్, ఆ పక్కన ఉన్నటువంటి ఉపగ్రహాలను లైవ్‌లో చూపించారు. వరంగల్ నగరంలోని వివిధ పాఠశాలలకు కళాశాలలకు చెందిన విద్యార్థులు సాయంత్రం నుండి రాత్రి పది గంటల వరకు ఈ ప్రదర్శనలను గమనించారు. విద్యార్థులకు ఖగోళ శాస్త్రం పరిశోధనల మీద అవగాహన కలిగించే విధంగా ఇక్కడ ఉన్నటువంటి రోబో కలాం బృందం క్షుణ్ణంగా వివరించారు. చంద్రుని పైకి భూమి మీద నుంచి ప్రయోగించిన వివిధ రాకెట్ల పనితీరు, రోవర్ల పనితీరును ప్రదర్శన ద్వారా చూపించారు. అయితే శనివారం రాకెట్ లాంచింగ్ లో కొంత విఫలం జరిగిన అది భవిష్యత్తులో మరింత ఉత్సాహాన్ని కలిగించడమే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాలలో ఔత్సాహికులకు ఎంతో ఉపయోగపడుతుందని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని పరిశీలించిన
# జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 28(జనం సాక్షి):** జిల్లా వ్యాప్తంగా ఈనెల 25 తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని కలెక్టర్ శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ, బయ్యారం మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరును స్వయంగా, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, త్రాగునీరు అందించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో 18 పరీక్ష కేంద్రాల ద్వారా మొదటి సంవత్సరం 4158, రెండవ సంవత్సరం 4129, మొత్తం 8287 విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, శుక్రవారం 3822 మంది పరీక్షలకు హాజరు కాగా 65 మంది గైర్హాజరయ్యారు, ఇప్పటికే పరీక్షల నిర్వహణపై ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, సమావేశాలు నిర్వహించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసామని, ప్రతీ కేంద్రానికి చీఫ్ సూపరెంట్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష జరిగే సమయాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్.మదర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సద్గురు సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో పలు కీలక శాఖల్లో గిరిజన జాతి అధికారులు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. జాతికి సేవ చేయడం ప్రతి ఒక్కరికి దక్కే అదృష్టమని అన్నారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సేవాలాల్ మహరాజ్ బంజారా భవనం మంజూరు చేసినట్లు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆ రోజుల్లోనే బంజారా జాతికి విద్యా, విజ్ఞాన పరంగా దిశానిర్దేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అధికారి నాగ సాగర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్, కౌన్సిలర్లు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చావులోనూ విడిపోని అన్నదమ్ముల అనుబంధం..

### ఒకే వారంలో ఇద్దరు మృతి...



**కొత్తగూడ ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో గుండెల్ని పిండేసే విషాదమది. విధి ఆడిన వింత నాటకానికి ఒకే కుటుంబంలో రెండు దీపాలు ఆరిపోయాయి. ములుగు జిల్లా మేడారం వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తమ్ముడు గుజ్జ కమలాకర్ (ఎంచగూడ) మృతి చెందాడు.కుటుంబానికి కడుపుకోత మిగిల్చి అనంత లోకాలకు వెళ్ళిపోయాడు.ఆ రోజు నుండి అన్న గుజ్జ సుధాకర్ (ఓటాయి) ప్రాణం విలవిల్లాడిపోయింది. “నా తమ్ముడు ఇక రాడు” అన్న నిజాన్ని ఆయన మనసు అంగీకరించలేకపోయింది.వారం రోజులుగా కన్నీరు మున్నీరై.. ఆ మనోవేదనను భరించలేక.. తమ్ముడిని వెతుక్కుంటూనే అన్న కూడా కన్నుమూశాడు.పుట్టినప్పుడు తోడుగా వచ్చిన ఆ అన్నదమ్ములు.వెళ్లేటప్పుడు కూడా ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు.వారంలోనే ఇద్దరు కుటుంబ పెద్ద దిక్కులను కోల్పోయిన ఆ కుటుంబాల్లో ఆర్తనాదాలు కొత్తగూడ మండలంలో ఈ విషాదంతో మూగబోయింది

# డ్రైవర్లకు కంటి చూపే అత్యంత కీలకం

- జిల్లా ఎస్పీ డా. శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో/కేసముద్రం, ఫిబ్రవరి 28(జనం సాక్షి):** వాహనాలను నడిపే ప్రతి డ్రైవర్లకు స్పష్టమైన కంటిచూపు అత్యంత అవసరమని, కంటిచూపు లోపాలు రోడ్డు ప్రమాదాలకు ఒక ప్రధాన కారణమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని హరిహర గార్డెన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా అగర్వాల్ హాస్పిటల్ సౌజన్యంతో లారీ, ఆటో, డీసీఎం, గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. శబరీష్ కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రైవర్లు తమ కంటి చూపును తరచుగా పరీక్షించించుకోవడం ద్వారా కంటి సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగం, నిర్లక్ష్యపు, ర్యాష్ డ్రైవింగ్‌ను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. అలాగే వాహనాలలో అధిక లోడ్‌తో ప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా లారీ డ్రైవర్లు మరియు ఎక్కువ దూరం వాహనాలు నడిపే డ్రైవర్లు నిద్రమత్తు వచ్చినప్పుడు వెంటనే వాహనాన్ని సురక్షిత ప్రదేశంలో ఆపి కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత మాత్రమే ప్రయాణాన్ని కొనసాగించాలని సూచించారు. అలసటతో లేదా నిద్రమత్తులో వాహనం నడపడం తీవ్రమైన ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ జర్నలిస్టులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ అడ్మిన్ గండ్రతి మోహన్, కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు క్రాంతి కిరణ్, రమేష్ బాబు, కరుణాకర్, నరేష్ మరియు పోలీస్ సిబ్బంది, డా. అగర్వాల్స్ వైద్య సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

# క్రషర్ బ్లాస్టింగ్‌లతో బెంబేలు

- భయం గుప్పిట్లో ప్రగతి సింగారం
- అనుమతులు ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు బ్లాస్టింగ్ లు



**శాయంపేట, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో సాయిరాం క్రషర్ నిబంధనలు తుంగలో తొక్కి వారికి ఇష్టం వచ్చిన సమయంలో బ్లాస్టింగ్లు చేస్తూ ప్రజలను, రైతులను భయాందోళనలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో చుట్టుపక్కల ప్రజలకు తెలియజేసే విధంగా సైరన్ గాని మనుషులతో చెప్పడం గాని లేకుండా బ్లాస్టింగ్ చేయడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బ్రతుకుతున్నామని బాధను వ్యక్తపరుస్తున్నారు. క్రషర్ యాజమాన్యం నిబంధనలు తుంగలో తొక్కిన అధికారులు పట్టించుకోవడం లేదని ,అధికారుల తీరుపై అసహనాన్ని వ్యక్తం చేస్తూ, సాయిరాం క్రషర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. పంట పొలాల్లో రైతులు ఉన్న పట్టించుకోకుండా మమ్మల్ని ఎవరు ఏం చేస్తారని బ్లాస్టింగులు చేస్తే రైతులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని గజగజ వణుకుతున్నామని అన్నారు. బ్లాస్టింగ్లతో ఇండ్లు లో ఉన్న ముసలివారు భూకంపం వస్తుందా అన్నట్టు ఇల్లులు కదులుతున్నాయని అవి కూలి మా మీద పడితే మాకు చావు తప్పదని కన్నీరు మున్నీరు అవతున్నారు . బ్లాస్టింగ్లతో వచ్చే దుమ్ము పడి పంట పొలాలు చుట్టూ రెండు కిలోమీటర్లు నాశనం అవుతున్నాయని అన్నారు. రైతులు క్రషర్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే మాకు పర్మిషన్ ఉంది మా ఇష్టం వచ్చినప్పుడు బ్లాస్టింగ్ లు చేస్తాం మీరు ఏం చేసుకుంటా రో చేసుకోండి అంటూ సమాధానం. పర్మిషన్ ఉన్న ఆ బ్లాస్టింగ్ లను ఎప్పుడు చేయాలి దానికి ఎలాంటి అనుమతులు తీసుకోవాలి బ్లాస్టింగ్ చేసేటప్పుడు చుట్టుప్రక్కల ఎవరైనా ఉన్నారా లేదా అనే విషయాలను పరిశీలించి చేయాల్సిన అవసరం ఉంటుంది. కానీ యాజమాన్యం అవి ఏమి చేయకుండా బ్లాస్టింగ్ లు చేపట్టింది. ప్రజలకు వాహనదారులకు చుట్టుప్రక్కల రైతులకు బ్లాస్టింగ్ వల్ల వచ్చే పెద్ద పెద్ద రాళ్లు మీద పడితే పరిస్థితి ఏంటి అని అంటున్నారు. క్రషర్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# గంజాయి మత్తును నుండి యువతను కాపాడుకుందాం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**హనుమకొండ ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** దేశ భవిష్యత్తుయిన యువత గంజాయి మత్తు బానిసలు కాకుండా గంజాయి విక్రయించే మూలాలపై దృష్టి పెట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల నేర సమీక్షా సమావేశాన్ని శనివారం హనుమకొండ కాకతీయ మెడికల్ కళాశాలో ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ముందుగా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులు, వారెంట్లు, అధికారులు, సిబ్బంది పనితీరుపై వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ నేరాల నియంత్రణకై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేస్తూ కమిషనరేట్ పరిధిలో పేకాటరాయుళ్ళపై కఠినంగా వ్యవహరించాలని, ప్రధానంగా శివారు ప్రాంతాల్లో స్థానిక పోలీసులు నిరంతరం నిఘా పెట్టాలని, చోరీలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని, అధికంగా చోరీలు జరిగే ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా యం.జి.యం, రైల్వే స్టేషన్ల ప్రాంతాల్లో సైతం సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు, కృషి చేయాలని, స్టేషన్ అధికారులు తమ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ఎప్పటికప్పుడు జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేయాలని, గంజాయి వినియోగదారున్ని పట్టుకోవడంతో మన బాధ్యత అయిపోతుందని అనుకొంకుండా గంజాయిని విక్రయించే వారిని గుర్తించి అరెస్టు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, అక్రమ ఇసుక రవాణాపై స్టేషన్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని, ఎవరైన ఆలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని, అలాగే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు దృష్టి పెట్టాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్,రాజమహేంద్ర నాయక్, కవిత, శుభంనాగ్‌తో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, అర్.ఐలు ఎస్.ఐలు పాల్గొన్నారు.

## రాయితీపై డ్రోన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ

**మంచిర్యాల ,ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** రాయితీ పై డ్రోన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాత్రికరణ ఆర్.కె.వి.వై. - ఎస్.ఎం.ఎ.ఎం. 2025- 26 సంవత్సరానికి గాను జిల్లాకు 10 వ్యవసాయ డ్రోన్లను కేటాయించడం జరిగిందని, ఇందులో 3 డ్రోన్లు మంచిర్యాల డివిజన్, 3 డ్రోన్లు చెన్నూర్ డివిజన్, 2 డ్రోన్లు బెల్లంపల్లి డివిజన్, 2 భీమిని డివిజన్ లకు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ డ్రోన్లను 40 శాతం / 4 లక్షల రూపాయల రాయితీపై అందించడం జరుగుతుందని, జిల్లాలోని ఎఫ్.పి.ఓ.లు/ స్వయం సహాయక సంఘాలు/ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గ్రూప్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉద్యానవన, ఆయిల్ పామ్ యంత్ర పరికరాలకు వ్యక్తిగతంగా రైతులు దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత ఎడిఎలు, వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రూప్ క్యాటగిరి క్రింద డ్రోన్లు కొరకు దరఖాస్తు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ తప్పనిసరి అని తెలిపారు.

# బస్టాండ్‌లో మరుగుదొడ్ల సౌకర్యం



బస్టాండ్‌లో కనీస వసతులు కరువు



- స్పందించిన గ్రామ పంచాయతీ
- జనం సాక్షి కథనానికి స్పందన

**కౌటాల ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** జనం సాక్షి పత్రికలో ప్రచురితమైన బస్టాండ్ లో కనీస వసతులు కరువు అనే కథనానికి స్పందన లభించింది. కౌటాల మండల కేంద్రంలో గల ప్రయాణ ప్రాంగణం ప్రయాణికులకు వసతుల కల్పించక పోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్ వెనుకాల చెత్తా చెదారం తో నిండి, మరుగుదొడ్లు ఉపయోగంలో లేకపోవడం, మూత్ర విసర్జన పక్కనే చేయడంతో దుర్వాసన వల్ల ప్రయాణికులు నరకం చూశారు. గ్రామ పంచాయతీ స్పందించి బస్టాండ్ వెనకాల చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయించారు, మరుగుదొడ్లు అందుబాటులో తీసుకొచ్చారు. ప్రయాణికులు పడుతున్న ఇబ్బంది దృష్ట బస్టాండ్ లో సదుపాయాలు కల్పించిన గ్రామ పంచాయతీ సర్పంచ్ నక్క శంకర్,పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ ను ప్రయాణికులు అభినందించారు.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 28, (జనంసాక్షి) :** విద్యార్థుల ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యా బోధన తీరు, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ప్రభుత్వం మెనూ ప్రవేశపెట్టి అమలు చేస్తుందని, విద్యారంగ అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యలలో భాగంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షల సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలని తెలిపారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులు తయారుచేసిన మట్టి ఆకృతులను పరిశీలించారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. ఇంటి నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
01 మార్చి 2026

# చిల్లంచర్ల వరలక్ష్మి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



**మునగాల, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ చిల్లంచర్ల రఘునాథం సతీమణి చిల్లంచర్ల వరలక్ష్మీ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు ఆమె ఎల్లప్పుడూ భర్త అడుగుజాడల్లో నడుస్తూ స్ఫూర్తిదాయక పాత్ర పోషిస్తూ వెన్నుదన్నుగా నిలిచారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు, శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన చిల్లంచర్ల వరలక్ష్మి అంతిమయాత్ర శనివారం మండల కేంద్రంలోని ఆమె నివాసం నుండి ప్రారంభం కాగా మొదటగా వరలక్ష్మి పార్థివ దేహం పై పశ్య పద్మ పార్టీ జెండాను కప్పి నివాళులర్పించగా అనంతరంవివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పాల్గొని మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధాలు కొనసాగుతున్న రోజుల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులకు కార్యకర్తలకు ఆమె తన ఇంటిని భోజనశాలగా మార్చి అందరికీ ఆకలి తీర్చిందని, పార్టీ అవసరాల నిమిత్తం వచ్చిపోయే నాయకులకు కార్యకర్తలకు దారి ఖర్చులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తూ నమ్మిన సిద్ధాంతం కోసం భర్త నడిచిన ఎర్రబాటలో నడుస్తూ పేద బడుగు బలహీన అట్టడుగు వర్గాలను తమతో సమానంగా చూస్తూ వారందరి క్షేమం కోసం రేయింబగుళ్లు నిద్రాహారాలు మాని ఉద్యమకాంక్షతో కమ్యూనిస్టు పార్టీకి సేవ చేసిందన్నారు, ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎల్లావుల రాములు, ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మేకల శ్రీనివాస్, కంబాల శ్రీను, నంద్యాల రామిరెడ్డి, దేవారం మల్లీశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు బద్దం భద్రారెడ్డి, పైడిమరి వెంకటనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులుగ్రంథాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రామారావు, గరినే కోటేశ్వరరావు, కొప్పుల జైపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సుంకరి అజయ్ కుమార్, సత్తిబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, సిపిఐ సీనియర్ నాయకులు మామిడి చిన్న రాములు, సిహెచ్ సీతారాం, వరలక్ష్మి కుటుంబ సభ్యులు ఠాగూర్ బాబు, కందిబండసత్యనారాయణ, గిరిబాబు, మరియు ఆర్యవైశ్య ప్రముఖులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు. వరలక్ష్మి అంతిమయాత్ర మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగగా పార్టీ నాయకులు కార్యకర్తలు ఎర్రజెండాలు చేత పట్టుకొని ప్రదర్శనలో పాల్గొని ఆమెకు ఘనమైన నివాళు లర్పించారు.

# పదవి స్వీకరణ..పదవి విరమణ ఒకే చోట



**వలిగొండ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో వేములకొండ పిహెచ్సి సబ్ సెంటర్ అరూరు గ్రామంలోని ఏఎన్ఎం గా కేశవదాస్ శోభారాణి బాధ్యతలు స్వీకరించిన నుండి విరమణ వరకు 28 సంవత్సరాలు అరూరు గ్రామంలోనే సేవలందించారు. విరమణ కార్యక్రమాన్ని గ్రామంలోని ఫంక్షన్ హాల్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డి ఎం హెచ్ ఓ డాక్టర్ మనోహర్ పాల్గొని మాట్లాడుతూ పదవి బాధ్యతలు స్వీకరించిన అరూరు గ్రామంలోనే పదవి విరమణ చేయడం ఈ ఘనత ఆమెకి దక్కుతుందని ఆయన అన్నారు. ఆమె వైద్య సేవలను కొనసాగించాలని ఆయన కోరారు. వైద్య వృత్తిలో ఆమె చేసిన సేవలు 28 సంవత్సరాలకు దాదాపు 16 అవార్డు రావడం ఆమెకి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ సుమన్ కళ్యాణ్, ప్రసాద్, సంతోష్ రెడ్డి, రవి, జ్యోతి, ఉమామహేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు అభిమానులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రానైట్ క్వారీల అనుమతులపై ఉద్రిక్తత



**కోదాడ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మొగలాయి కోట గ్రామంలో కొత్త గ్రానైట్ క్వారీలకు అనుమతులపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ తవ్వకాల కోసం రెండు క్వారీలకు సంబంధించి శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఎంఎస్/కేఎన్ఆర్కే గ్రానైట్ ఇండస్ట్రీస్‌కు 3.09 హెక్టార్లు, ఎంఎస్/శ్రీ వెంకట సాయి గ్రానైట్‌కు 4.25 హెక్టార్లలో తవ్వకాల అనుమతుల ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.అయితే గతంలో ఉన్న క్వారీల బ్లాస్టింగ్ వల్ల పంటలు, ఇళ్లకు నష్టం జరిగిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఇళ్ల గోడల్లో పగుళ్లు ఏర్పడినట్లు, బోరు బావులు దెబ్బతిన్నట్లు తెలిపారు. భారీ పేలుళ్ల కారణంగా పిల్లలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు.కంపెనీల అనుమతుల కోసం చెట్లను నరికివేయడం పర్యావరణానికి ముప్పు కలిగిస్తోందని ఎన్జీవోలు ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ తూతూ మంత్రంగా నిర్వహించారని, గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దని వారు డిమాండ్ చేస్తున్నారు.

# గండ్రవాణిగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



**మాడుగులపల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మాడుగులపల్లి మండల పరిధిలోని గండ్రవాణిగూడెం గ్రామంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు ఇందిరమ్మ ఇళ్లను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. గండ్రవాణి గూడెం గ్రామానికి చెందిన లబ్ధిదారులు కొండ కింది కవిత వెంకటరెడ్డి, బొబ్బలి సైదమ్మ సైదులు, రేఖ కవిత వెంకన్న ల నూతన గృహాలలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు గృహప్రవేశం చేయించి ఆయా కుటుంబ సభ్యులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ద్వారానే పేదల సొంత ఇంటి కల సాకారమవుతోందని అన్నారు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేదలకు ఆత్మగౌరవంతో కూడిన నివాసాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొబ్బలి కావ్య శ్రీనివాస్, ఎంపీడీవో వంశీధర్, పంచాయతీ సెక్రెటరీ సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగలక్ష్మి నాగరాజు, స్రవంతి మహేందర్, చింతకుంట్ల వెంకటరెడ్డి, సుధాకర్ రెడ్డి, మంగమ్మ, బొబ్బలి నరేష్, వెంకన్న గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పోషకాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన పోషకాహారం అందించాలని అధికారులను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నివాస సదుపాయాలు, భోజన వసతి, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లు, విద్యా వాతావరణాన్ని పరిశీలించారు. వసతి గృహంలో అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. గదుల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకుని, సౌకర్యవంతమైన వాతావరణంలో చదువుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, ఆర్ఐ వెంకట్ రెడ్డి, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలన దిశగా అమరవాయి



**మల్దకల్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** గద్వాల డిఎంహెచ్వో డాక్టర్,సంధ్య కిరణ్ మై ఆదేశాల మేరకు డాక్టర్.జి.రాజు ప్రోగ్రాం ఆఫీసర్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంమల్దకల్ మండల పరిధిలోఅమరవాయిసబ్ సెంటర్ పరిధిలోని నీలిపల్లి,సద్దాలోనిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో శనివారం ఎక్స్రే క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి సహాయ సహకారం తో హై రిస్క్ పాపులేషన్ ను అనుమానితులకు ప్రత్యేక ఎక్స్రే పరికరము ద్వారా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధుల అనుమానితులను,అండర్ వెయిట్ వారు,పొగ త్రాగువారు మద్యపానం సేవించువారు,ఓల్డ్ టీబీ పేషెంట్స్,హై రిస్క్ ఏరియాలో ఉన్నవారికి,రక్తపోటు డయాబెటిక్ ఉన్నవారికి గుర్తించి వారికి 72 మందికిఎక్సరే పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలోడాక్టర్ స్వరూప రాణి,డాక్టర్ సౌజన్య రెడ్డి,సూపర్వైజర్,శ్రీధర్, ఏఎన్ఎంలు కవిత,గౌసియా, ఆశా కార్యకర్తలు,ట ి బి అలర్ట్ ఇండియా వెంకటేష్, ఉదయ్,టెక్నీషియన్ల పాల్గొన్నారు.

# మార్చి 1 నుంచి విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల సమ్మె



**భువనగిరి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న మీటర్ రీడింగ్ కార్మికులు మార్చి 1వ తేదీ నుంచి సమ్మెకు దిగనున్నట్లు హెచ్-101 సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు పక్కి శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎస్పీడీసీఎల్ పరిధిలో సుమారు 1600 మంది మీటర్ రీడర్లు పనిచేస్తూ విద్యుత్ బిల్లుల సేకరణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అయితే వారికి నెలకు కేవలం రూ.4,000 నుంచి రూ.5,000 వరకే వేతనం అందుతుండటం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. 25 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వ గుర్తింపు, భద్రత లభించకపోవడం బాధాకరం. ఇంత తక్కువ వేతనంతో కుటుంబాన్ని పోషించడం అసాధ్యమవుతోంది" అని ఆయన పేర్కొన్నారు. ఇతర విద్యుత్ సంస్థలైన ఎన్పీడీసీఎల్ లో 30 రోజుల పూర్తి పనిదినాలు కల్పిస్తున్నారని, అదే విధంగా ఎస్పీడీసీఎల్‌లో కూడా 30 రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎండీ, లేబర్ కమిషనర్, భువనగిరి టౌన్ ఏఈలకు సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే మార్చి 1 నుంచి నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికులంతా సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన కేంద్ర బృందం

- పర్యటన వివరాలను జిల్లా కలెక్టర్ కు వివరించిన కేంద్ర బృంద సభ్యులు




సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలన నిమిత్తం కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నుండి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు జిల్లాలో పర్యటించారు. ఫిబ్రవరి 26న తుంగతుర్తి మండలం తుంగతుర్తి, గొట్టిపర్తి గ్రామపంచాయతీల ఉపాధి హామీ పనులను, రికార్డులను పరిశీలించారు.27న నూతనకల్ మండలం దర్శించర్ల, సోమ్లా తండా గ్రామ పంచాయతీలను సందర్శించి ఉపాధి హామీ పనులను రికార్డులను పరిశీలించారు.28న కలెక్టరేట్ లో సందర్శన వివరాలను కేంద్ర కమిటీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేంద్ర బృందం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిల్ కుష్ మీనా, సంజయ్ పాండే, జాగృతి రాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంటర్మీడియట్ బోర్డు



నేరేడుచర్ల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : స్పందన జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు అధికారి హేమచందర్, డిఐఈఓ భాను నాయక్ ,డీఈసీ మెంబర్ మోహన్ రావు తనిఖీలు చేశారు.అలాగే ఇంటర్మీడియట్ బోర్డు రాష్ట్ర అధికారి హేమచందర్,పోలీస్ స్టేషన్లో ప్రశ్నపత్రాలను పరిశీలించారు. స్పందన కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులు 143 గాను 142 విద్యార్థులు హాజరయ్యారు.01 విద్యార్థి.. గైర్హాజరయ్యారు అని, చీఫ్ సూపరిండెంట్ వీరన్న, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ రమేష్, అడిషనల్ చీఫ్ సూపరిండెంట్ ప్రవీణ్ రెడ్డి, తెలిపారు.

# డ్రైనేజీల్లో ప్లాస్టిక్ ప్రవాహం



**జడ్చర్ల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని వెంకటరమణ థియేటర్ రోడ్డులో కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ వ్యవస్థ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఎగువ నుండి వస్తున్న బాటిళ్లు, కవర్ల ప్రవాహం చూస్తుంటే పర్యావరణానికి మనం చేస్తున్న హాని స్పష్టమవుతోంది. మనం మన సౌకర్యం కోసం వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువులను (బాటిళ్లు, కవర్లు) సరైన పద్ధతిలో చెత్త బుట్టల్లో వేయకుండా, నేరుగా కాలువల్లో పడేయడం ద్వారా మనకు మనమే దీర్ఘకాలిక ఆరోగ్య మరియు పర్యావరణ సమస్యలను సృష్టించుకుంటున్నామని దీని అర్థం.

# మాడుగులపల్లి కేజీవీబీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్



**మాడుగులపల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మండల ప్రత్యేక అధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జి. వెంకటేశ్వర్లు శనివారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీవీబీ) ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి, వారికి అందుతున్న విద్యా బోధన, భోజన నాణ్యత ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. వంశీధర్, మండల కార్యాలయ సిబ్బంది శ్రీకాంత్, సురేష్ కేజీవీబీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# ఫిబ్రవరి నెలలో 74 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

- సమిష్టి కృషితో లక్ష్యాన్ని చేరుకోవాలి
- ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్



**మణుగూరు, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ఉద్యోగులు కార్మికులు సమిష్టి కృషితో పనిచేస్తే వార్షిక లక్ష్యాన్ని చేరుకోవచ్చని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర పేర్కొన్నారు. శనివారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు... ఈ ఏడాది ఆగస్టు సెప్టెంబర్ అక్టోబర్ వరకు వర్షాలు పడటం వల్ల బొగ్గు ఉత్పత్తిలో భారీగా అంతరాయం జరిగి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోటంలో కొంచెం ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ఫిబ్రవరి నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10 లక్షల 16 వేల 500 టన్నులకు గాను 7 లక్షల 50 వేల 91 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు. ఫిబ్రవరి నెలలో సాదించిన బొగ్గు ఉత్పత్తి 74 శాతం. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 28 పిబ్రవరి, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 104 లక్షల 22 వేల టన్నుల లక్ష్యానికి గాను 95 లక్షల 36 వేల 855 టన్నులు సాధించడం. జరిగింది అనగా 92 శాతం సాధించడం జరిగింది. ఫిబ్రవరి నెలలో 9 లక్షల 39 వేల 438 టన్నుల బొగ్గును రవాణా చేయటం జరిగింది. అలాగే 01 ఏప్రిల్, 2025 నుండి 28 ఫిబ్రవరి, 2026 వరకు ప్రోగ్రెస్సివ్ గా 97 లక్షల 52 వేల 220 టన్నులు రవాణా చేశారు.పిబ్రవరి నెలలో ఓవర్ టర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 12 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్ష్యానికి గాను 105 శాతం తో 12 లక్షల 63 వేల క్యూబిక్ మీటర్లు తీసారు.పదవి విరమణ/మెడికల్ ఉద్యోగులకు చెల్లింపులు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం బి. శ్రీనివాస చారి , ఏరియా రక్షణ అధికారి వెంకట రామరావు, ప్రాజెక్టు అధికారి పి.కె. ఓసి శ్రీ ఎం. రమేశ్ , ప్రాజెక్టు అధికారి మణుగూరు ఓసి ఈ. శ్రీనివాస్, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్, డిజిఎం (సివిల్) ఫ్రీ జి.శివ ప్రసాద్ , డివై. సిఎంఓ జ్యోతిర్మయి, డిజిఎం (ఏరియా వర్క్ షాప్) టి. శ్రీకాంత్ , క్వాలిటీ హెచడి నాగ రమేష్ , ఫైనాన్స్ మేనేజర్ పి. రమేష్, సీనియర్ ఎస్టేట్స్ అధికారిని కల్లేపల్లి స్వప్నా, సీనియర్ (ఐటి) ప్రోగ్రామర్ సాయిల సురేశ్, డివైఎస్ఈ(సివిల్) డివిఎస్ఎన్ ప్రవీణ్ , తదితరులు పాల్గొన్నారు.




# పబ్లిక్ ఇష్యూకు భారత్ బయోటెక్!

- రూ.4500 కోట్ల ఐపీఓకు అవకాశం
- చర్చలు ప్రాథమిక దశలోనే: బ్లూమ్‌బర్గ్

**న్యూఢిల్లీ:**హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే వ్యాక్సిన్ తయారీ కంపెనీ భారత్ బయోటెక్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు వచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4500 కోట్లు) మేర నిధులను సమీకరించాలన్నది సంస్థ యోచనగా, ఈ అంశాలతో దగ్గరి సంబంధమున్న వ్యక్తులు చెప్పారని ఆంగ్ల వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇదే జరిగితే ఇటీవల దేశీయ బయోటెక్నాలజీ రంగంలో వచ్చిన అతిపెద్ద ఐపీఓల్లో ఇది ఒకటి అవుతుంది. ఐపీఓపై అంతర్గత చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఆ కథనం వెల్లడించింది. కంపెనీ ఈ విషయంపై అధికారిక ప్రకటన చేయలేదు. కొవిడ్-19 పరిణామాల్లో సొంతంగా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి,




ప్రపంచానికి అందించిన ఈ సంస్థ, భారీ పరిమాణంలో ఐపీఓకు వస్తే అది ఒక మైలురాయి కానుంది. 1996లో స్థాపించిన ఈ కంపెనీ హెపటైటిస్ బి, టైఫాయిడ్, రోటావైరస్, ఇన్‌ఫ్లుయెంజా వంటి వివిధ వ్యాధుల నిరోధానికి భారీ స్థాయిలో వ్యాక్సిన్లు, బయోథెరప్యూటిక్స్‌ను అందిస్తోంది. కొన్నేళ్లుగా తన తయారీ, పరిశోధన సామర్థ్యాలను విస్తరిస్తూ వస్తోంది. వందకు పైగా దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయడం ద్వారా అంతర్జాతీయ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్స్‌లో కీలక సంస్థగా అవతరించింది. ఐపీఓ ద్వారా సేకరించే నిధులను పరిశోధన-అభివృద్ధి(ఆర్ అండ్ డీ)ని విస్తరించడానికి, తయారీ మౌలిక వసతులను పెంచుకోవడానికి, తదుపరి తరం వ్యాక్సిన్లు, బయోలాజిక్స్ అభివృద్ధిని వేగవంతం చేయడానికి భారత్ బయోటెక్ ఉపయోగించుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. క్లినికల్ ట్రయల్స్, నియంత్రణ అనుమతులు, అంతర్జాతీయ పంపిణీ నెట్‌వర్క్‌ల నిమిత్తం ఫార్మా కంపెనీలకు భారీ స్థాయిలో నిధుల అవసరం ఉంటోంది.ఒక వేళ ప్రతిపాదిత 500 మి. డాలర్ల ఇష్యూ జరిగి, విజయవంతమైతే వినూత్నతపై ఆధారపడే ఆరోగ్య సంరక్షణ కంపెనీలపై మదుపర్ల విశ్వాసం కొనసాగడంతో పాటు, ఇతర పరిశోధన సంస్థలకూ ఈ ఐపీఓ దారిచూపినట్లవుతుంది.

**ధర, సమయం కీలకం..**

రికార్డు స్థాయి నిధుల సమీకరణ అనంతరం, ప్రస్తుతం దేశీయ ఐపీఓ మార్కెట్ స్తబ్దుగా ఉంది. ఈ సమయంలో భారత్ బయోటెక్ ఇష్యూ వార్తలు రావడం విశేషం. ఆరోగ్యసంరక్షణ, ఫార్మాపై మదుపర్ల ఆసక్తి ఎపుడూ బలంగానే ఉంటుంది. అయితే ఈక్విటీ మార్కెట్లో ఊగిసలాటలు, ఎఫ్ఐఐల అప్రమత్త ధోరణి నేపథ్యంలో, ఇష్యూ ధర, సమయంపై కంపెనీలు ఆచితూచి అడుగేస్తున్నాయి.

# రూ.5 లక్షల కోట్లు ఆవిరి

**ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.7,536 కోట్లు**
**డీఐఐ కొనుగోళ్లు: రూ.12,293 కోట్లు**



**న్యూఢిల్లీ:**దేశీయ స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు పోటెత్తాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా స్టాక్‌మార్కెట్లను ఏఐ, ద్రవ్యోల్బణ భయాలు నష్టపరచిన నేపథ్యంలో, అంతర్జాతీయ సంకేతాలు బలహీనంగా మారడం ఇందుకు నేపథ్యం. విదేశీ మదుపర్ల అమ్మకాలూ తోడయ్యాయి. ఫలితంగా మన సూచీలు అధికంగా నష్టపోయాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 17 పైసలు తగ్గి 91.08 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.26% లాభంతో 71.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ శుక్రవారం రూ.4.98 లక్షల కోట్లు తగ్గి రూ.463.50 లక్షల కోట్ల (5.10 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 28 పాయింట్ల (క్రితం ముగింపు 82,248.61) నష్టంతో 82,220.48 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు వెల్లువెత్తడంతో రోజంతా నష్టాల్లోనే ట్రేడైన సూచీ, ఒకదశలో 81,159.15 పాయింట్లకు చేరింది. చివరకు 961.42 పాయింట్ల నష్టంతో 81,287.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 317.90 పాయింట్లు క్షీణించి 25,178.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,141.30- 25,476.40 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 25 కుదేలయ్యాయి. సన్‌ఫార్మా 2.61%, భారతీ ఎయిర్‌టెల్ 2.53%, ఎం అండ్ ఎం 2.42%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.38%, ఇండిగో 2.32%, మారుతీ 2.26%, కోటక్ బ్యాంక్ 2.18%, అల్ట్రాటెక్ 1.96%, అదానీ పోర్ట్స్ 1.92%, హెచ్‌యూఎల్ 1.90%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.85%, బజాజ్ ఫైనాన్స్ 1.60% నష్టపోయాయి. హెచ్‌సీఎల్ టెక్, ట్రెంట్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ 1.22% వరకు లాభపడ్డాయి.

గాడియం ఐవీఎఫ్ షేరుకు లాభాలు: గాడియం ఐవీఎఫ్ అండ్ ఉమెన్ హెల్త్ షేరు ఇష్యూ ధర రూ.79తో పోలిస్తే, బీఎస్ఈలో 5% లాభంతో రూ.83 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో రూ.87.15 వద్ద గరిష్ఠాన్ని తాకి, 1.87% లాభంతో రూ.80.48 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.585.79 కోట్లుగా నమోదైంది.విశాల్ మెగా మార్ట్‌లో 13.96% వాటాను రూ.7,635 కోట్లకు ప్రమోటరు అయిన సమాయత్ సర్వీసెస్ విక్రయించింది. ఈ లావాదేవీ అనంతరం విశాల్ మెగా మార్ట్‌లో సమాయత్ సర్వీసెస్ వాటా 54.09% శాతం నుంచి 40.13 శాతానికి తగ్గింది.

**తగ్గిన ఫారెక్స్ నిల్వలు**

మన విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలు ఫిబ్రవరి 20తో ముగిసిన వారానికి 2.119 బి.డాలర్లు (దాదాపు రూ.19,000 కోట్లు) తగ్గి 723.608 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.65.10 లక్షల కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 8.663 బి.డాలర్లు అధికమై జీవనకాల గరిష్ఠమైన 725.727 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 1.039 బి.డాలర్లు తగ్గి 572.564 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 977 మి.డాలర్లు క్షీణించి 127.489 బి.డాలర్లుగా ఉన్నాయి.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,54,650 (22 క్యారెట్లు) | ₹ 1,68,710 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,20,000

# ఫండ్ విలువలపై ఇన్ఫోసిస్ షేరు సెగ

**ఈనెలలో 20% పతనం**

**గత 13 ఏళ్లలో ఇదే పేలవ ప్రదర్శన**

**ఏఐ ఆందోళనలు నేపథ్యం**

**న్యూఢిల్లీ:**దేశీయ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఒకటైన ఇన్ఫోసిస్ షేరు, దశాబ్దకాలంలోనే అత్యంత పేలవ ప్రదర్శనను ఈ నెలలో కనబర్చింది. ఫిబ్రవరిలో ఈ షేరు విలువ 20.75% క్షీణించింది. 2013 ఏప్రిల్‌లో షేరు విలువ 22.75% పతనమయ్యాక.. ఒక నెలలో ఇన్ఫీ షేరు మళ్లీ ఇంతగా నష్టపోవడం ఇప్పుడే. 52 వారాల గరిష్ఠమైన రూ.1,775 (2025 ఫిబ్రవరి 27)తో పోల్చితే, ప్రస్తుతం షేరు ధర 26.3% క్షీణించింది. ఈ ఏడాది జనవరి 30న బీఎస్ఈలో ఇన్ఫీ షేరు రూ.1640.45 వద్ద ఉండగా.. ఫిబ్రవరి 27న రూ.1299.95 వద్ద ముగిసింది. ఈ నెలలో లార్జ్ క్యాప్ కంపెనీల విభాగంలో అత్యధిక నష్టాన్ని చవిచూసిన కంపెనీల షేర్లలో ఇదీ ఒకటి. కృత్రిమ మేధ ఆందోళనల కారణంగా ఇన్ఫోసిస్‌తో పాటు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ వంటి దేశీయ దిగ్గజ ఐటీ కంపెనీల షేర్లు ఈనెలలో భారీగానే నష్టపోయాయి. ఫిబ్రవరిలో ఇన్ఫీ షేరు భారీగా నష్టపోవడంతో, ఈ నెలలో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,33,824 కోట్ల మేర తగ్గి, రూ.5,27,087 కోట్లకు పరిమితమైంది. దేశీయ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ప్రాధాన్యమిచ్చే షేర్లలో ఇన్ఫోసిస్ కూడా ఒకటి. అందుకే ఈ కంపెనీ షేర్లలో ఇవి పెట్టుబడులు కూడా అధికంగా పెడుతూ వచ్చాయి. ఇప్పుడు ఇన్ఫీ షేరు నష్టాలబాట పట్టడంతో ఆ సెగ దేశీయ మ్యూచువల్ ఫండ్‌లకూ తాకింది. డిసెంబరు చివరికి 45 మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కలిపి, ఇన్ఫోసిస్‌లో మొత్తంగా 22.12% వాటా ఉంది. 2024 డిసెంబరు ఆఖరుతో పోలిస్తే ఇది 2.07% ఎక్కువ. 52 వారాల గరిష్ఠమైన రూ.1,775 నుంచి షేరు 26.3 శాతం పడటంతో దేశీయ మ్యూచువల్ ఫండ్‌ల వాటాల విలువ రూ.1,59,223 కోట్ల నుంచి రూ.1,17,331 కోట్లకు దిగివచ్చింది. అంటే రూ.41,892 కోట్ల నష్టం (నోషనల్ లాస్) వాటిల్లింది.

**ఇదే కారణం..**

టెక్ రంగ షేర్లకు అత్యంత అధ్వాన నెలల్లో ఒకటిగా ఈ ఫిబ్రవరి నిలిచిపోతుంది. ఆంత్రోపిక్ నుంచి మరింత అడ్వాన్స్‌డ్ ఏఐ (కృత్రిమమేధ) టూల్స్ వస్తుండటంతో.. 300 బిలియన్ డాలర్ల భారత ఐటీ సేవల పరిశ్రమపై ప్రభావం పడొచ్చన్న ఆందోళనలు ఇందుకు కారణం. ఏఐ వల్ల అప్లికేషన్ సేవల ఆదాయాలను కంపెనీలు కోల్పోవడం ప్రారంభమైతే.. దేశీయ ఐటీ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవచ్చని బ్రోకరేజీ సంస్థల హెచ్చరించడం కూడా మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసింది. ఐటీ కంపెనీల మొత్తం ఆదాయాల్లో అప్లికేషన్ సేవల ఆదాయాలు 40-70% వరకు ఉండటమే ఇందుకు కారణం. ఫిబ్రవరిలో నిఫ్టీ ఐటీ సూచీ కూడా 19.13% కుదేలైంది. తద్వారా 2023 నవంబరు నాటి కనిష్ఠ స్థాయికి దిగివచ్చింది.

**ఎఫ్‌పీఐలూ వెనకడుగు..**

భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) ఇప్పుడిప్పుడే సానుకూలంగా మారుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ.. ఐటీ షేర్లలో మాత్రం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఫిబ్రవరి తొలి అర్ధభాగంలో ఐటీ కంపెనీల షేర్ల నుంచి రూ.11,000 కోట్ల పెట్టుబడులను ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఐటీ రంగ షేర్లలో ఎఫ్‌పీఐల మొత్తం పెట్టుబడుల విలువ 2026 ఫిబ్రవరి 15 నాటికి రూ.4,48,938 కోట్లకు పరిమితమైంది. ఎన్ఎస్‌డీఎల్ గణాంకాల ప్రకారం.. గత నాలుగేళ్లలోనే ఇది కనిష్ఠ స్థాయి. ఈ ఏడాది జనవరి చివరికి దేశీయ టెక్ కంపెనీల షేర్లలో ఎఫ్‌పీఐల పెట్టుబడుల విలువ రూ.5,33,953 కోట్లుగా ఉంది.

# ఆంత్రోపిక్‌తో వ్యాపారం చేయం

- మాట వినలేదని వెళ్లగొట్టిన ట్రంప్..
- ఓపెన్‌ఏఐతో అగ్రిమెంట్
- బెదిరింపులు పట్టించుకోం: ఆంత్రోపిక్



**వాషింగ్టన్:**అమెరికా రక్షణశాఖ డిమాండ్లకు నో చెప్పిన ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌తో వ్యాపారం చేయబోమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ టెక్నాలజీని వాడడం వెంటనే ఆపేయాలని అన్ని ప్రభుత్వ ఏజెన్సీలను ఆదేశించారు. అదే సమయంలో ఆంత్రోపిక్ ప్రత్యర్థి సంస్థ ఓపెన్‌ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ వెల్లడించారు ఆంత్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను సైన్యం అపరిమితంగా వాడుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. అందుకు శుక్రవారం వరకు గడువు విధించింది. అయితే అది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. ఆ సంస్థతో మరోసారి వ్యాపారం చేయమని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే ఓపెన్ ఏఐ ఎంటర్ అయింది. "అమె రికా రక్షణశాఖతో నిన్న ఒప్పందం కుదుర్చుకున్నాం. ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడంపై మా మధ్య చర్చ జరిగింది. ఇరువర్గాలు అంగీకారానికి వచ్చిన పరిమితుల్లోనే ఏఐ మోడల్స్ పనిచేస్తాయని నిర్ధరించేం దుకు సాంకేతికపరమైన విధానాలను ప్రవేశపెట్ట నున్నాం" అని ఆల్టమన్ వెల్లడించారు. బెదిరింపులు ఎన్ని వచ్చినా తమ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండదని ఆంత్రోపిక్ ఓ ప్రకటనలో వెల్లడించింది. నిఘా, మిలిటరీ వ్యవహారాల్లో అపరిమిత ఏఐ వినియోగానికి సంబంధించిన నైతిక నిబంధనలను ఉల్లంఘించలేమని స్పష్టం చేసింది.

# 'జీడీపీ' గణాంకాలు మారాయ్

- 2025-26కు వృద్ధి అంచనా 7.6%
- అక్టోబరు-డిసెంబరులో వృద్ధి 7.8 శాతానికి
- కొత్త సిరీస్ అమలు నేపథ్యం

**న్యూఢిల్లీ:**మనదేశం అమల్లోకి తెచ్చిన కొత్త జీడీపీ సిరీస్ కారణంగా వృద్ధిరేటు అంచనాలు, వృద్ధి గణాంకాల్లో మార్పులొచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను అంతక్రితం అంచనా అయిన 7.4% నుంచి 7.6 శాతానికి సవరించారు. లెక్కింపు పద్ధతులను ప్రభుత్వం సవరించడం ఇందుకు నేపథ్యం. ప్రాతిపదిక ఏడాదిని 2011-12 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్చారు. దీంతోపాటు జీఎస్‌టీ, ఇ-వాహన్ పోర్టల్ నుంచి అదనపు గణాంకాలను జత చేయడం ద్వారా, ఆర్థిక కార్యకలాపాలను మెరుగ్గా ప్రతిబింబించేలా కొత్త సిరీస్ తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.శుక్రవారం గణాంక, పథకాల అమలు శాఖ (మోస్పి) 'న్యూ సిరీస్ ఆఫ్ యాన్యువల్ అండ్ క్వార్టర్లీ నేషనల్ అకౌంట్స్ ఎస్టిమేట్స్'ను విడుదల చేసింది. అంతక్రితం ఉన్న పాత సిరీస్‌ను ఇది భర్తీ చేసింది. జీడీపీ సిరీస్‌కు ఇది తొమ్మిదో ప్రాతిపదిక సవరణ. దీని ప్రకారం..2025-26 మూడో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతానికి చేరింది. 2024-25 ఇదే సమయంలో ఇది 7.4%. తయారీ, సేవల రంగాలు రాణించడం ఇందుకు కలిసొచ్చింది.రెండో త్రైమాసిక (జులై-సెప్టెంబరు) వృద్ధి రేటు పాత సిరీస్‌లోని 8.2% నుంచి 8.4 శాతానికి చేరింది. తొలి త్రైమాసికంలో మాత్రం 7.8% నుంచి 6.7 శాతానికి తగ్గింది.ఈ మార్పుల కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ (స్థిర ధరల వద్ద) రూ.322.58 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. 2024-25లో తొలి సవరించిన అంచనా(ఎఫ్ఆర్ఈ) రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. దీంతో 2025-26లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.6% అవుతుందని అంచనా. 2024-25లో ఇది 7.1%. 2025-26 నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 8.6 శాతానికి చేరొచ్చు.జీడీపీ కొత్త సిరీస్ నేపథ్యంలో, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2026-27) వృద్ధిరేటు అంచనాలను 20 బేసిస్ పాయింట్లు పెంచి 7-7.4% చేసినట్లు ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు. పార్లమెంటుకు జనవరిలో సమర్పించిన ఆర్థిక సర్వే ప్రకారం ఇది 6.8-7.2%. నామినల్ జీడీపీ వృద్ధి రేటు 11 శాతానికి చేరువవుతుందని, ఆర్థిక వ్యవస్థ అపుడు సౌకర్యవంతంగా 4 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.360 లక్షల కోట్లు) స్థాయిని అధిగమించగలదని అంచనా వేశారు.జనవరి చివరకు కేంద్ర ద్రవ్యలోటు రూ.9.8 లక్షల కోట్లుగా నమోదైంది. 2025-26 వార్షిక బడ్జెట్ లక్ష్యంలో 63 శాతానికి ఇది సమానం. 2024-25 ఇదే సమయానికి బడ్జెట్ లక్ష్యంలో 74.5 శాతంగా నమోదైంది. 2025-26లో ద్రవ్యలోటును జీడీపీలో 4.4 శాతం (రూ.15.58 లక్షల కోట్లు)గా కేంద్రం అంచనా వేసింది.




## పోచంపాడ్ బాలికల గురుకులంలో దారుణం



- బాత్రూం వెళ్లిన బాలికపై లైంగిక వేధింపులు
- గత కొంతకాలంగా అసభ్యంగా వ్యవహరిస్తున్న ఎలక్ట్రిషియన్
- టీచర్లకు తెలియజేసిన చర్యలు తీసుకోని వైనం

**జనంసాక్షి వెలుగులోకి తేవడంతో నిందితుడి అరెస్టు**

ఆర్మూర్ (జనంసాక్షి) :

**నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ బాలికల గురుకుల పాఠశాలలో దారుణ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ పాఠశాలలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేసే ఓ వ్యక్తి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే గాక, హాస్టల్‌లో వారు బాత్‌రూం వెళ్లె సమ యంలో లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు వెలుగులో కొచ్చింది. ఈ విషయం తన తల్లిదండ్రులకు ఆలస్యంగా తెలియజేసిన ఓ బాధితురాలు.. ప్రతినిత్యం నరకయాతన అనుభవించింది. ఎట్టకేలకు "జనంసాక్షి" విశ్వసనీయంగా తెలుసుకుని జరుగుతున్న పరిణామాలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.**




వివరాల్లోకెళ్తే.. గత పదిరోజుల క్రితం పదో తరగతి బాలిక స్నానానికి వెళ్లిన సమయంలో ఎలక్ట్రిషియన్ ఆమెను వెంబడించాడు. లైట్లు ఆన్ ఆఫ్ చెక్ చేయాలనే పేరుతో బాలికను పిలిచాడు. ఆమెపై రెండు చేతులు వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన బాధితురాలు కొన్ని రోజుల తర్వాత ఇంటికి వెళ్లిన సమయంలో తల్లిదండ్రులకు విషయం చెప్పింది. దీంతో వారు టీచర్‌కు తెలియజేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని, ఎవరికీ చెప్పొద్దని సదరు టీచర్ చెప్పినట్టు తల్లిదండ్రులు తెలిపారు. అయినప్పటికీ ఆ హాస్టల్‌లో ఉండలేనంటూ బాధితురాలు ఏడ్చినా.. పదో తరగతి పరీక్షలున్నాయని కన్నవాళ్లు సర్దిచెప్పారు. ఆ తర్వాత నిందితుడు బాలికను భయభ్రాంతులకు గురిచేయసాగాడు. దీంతో ఆ అమ్మాయి 'తాను భవనంపైనుంచి దూకి చనిపోతా'నంటూ తల్లిదండ్రులకు లేఖ రాయడంతో హుటాహుటిన వారు హాస్టల్‌కు చేరుకున్నారు. టీచర్లను సంప్రదించినప్పటికీ విషయం బయటకు చెప్పకండి.. సమస్యను పరిష్కరిస్తాం, అతన్ని మందలిస్తాం అంటూ దాటవేశారు. బాధితురాలి తండ్రి స్థానిక సర్పంచ్, స్థానికులకు విషయం తెలియజేశాడు. ఈ నేపథ్యంలో శనివారం "జనంసాక్షి" ఈ విషయాన్ని వైరల్ చేయడంతో అసలు విషయం బయటపడింది. దీంతో పోలీసులు హాస్టల్ కు చేరుకుని అసలు విషయాలపై ఆరా తీశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హాస్టల్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేసే నిందితుడి చర్యలకు విద్యార్థినులు గత కొంతకాలంగా ఆందోళనకు గురవుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో పిల్లలకు హాస్టల్‌లో ఉండేందుకు ససేమిరా అంటున్నట్టు తెలిసింది. ఈ ఘటనపై టీచర్లు కూడా వెంటనే స్పందించడం లేదని తల్లిదండ్రులు వాపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పోచంపాడు గురుకుల పాఠశాలపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అమెరికా పరిణామాలను గమనిస్తున్నాం

**కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్**

**న్యూఢిల్లీ:**టారిఫ్‌లపై అమెరికా సుప్రీం కోర్టు తీర్పు అనంతరం, అగ్రరాజ్య పరిణామాలను గమనిస్తున్నట్లు వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. తీర్పు తర్వాత వాణిజ్య ఒప్పందం చర్చల విషయంలో భారత ధోరణి మారుతుందా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ 'అమెరికాతో కలిసి తుదిరూపునిచ్చిన సంయుక్త ప్రకటనను మీరు చూసే ఉంటారు. ఏవైనా పరిస్థితుల్లో మార్పులు ఉంటే, ఒప్పందం కూడా అందుకు తగ్గట్లే మారుతుందని అందులో ఉంది. ఇరు వర్గాలూ ఒప్పంద సమతౌల్యం కోసమే చూస్తాయ'ని అన్నారు. సంయుక్త ప్రకటన రెండు దేశాలకూ ప్రయోజనాన్నే అందించగలదని వివరించారు. 150 రోజుల వ్యవధికి ప్రపంచ దేశాల ఉత్పత్తులపై 10% టారిఫ్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈనెల 24న ప్రకటించి, తదుపరి ఆమొత్తాన్ని 15 శాతానికి పెంచుతున్నట్లు తెలిపారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా భారత వస్తువులపై సుంకాన్ని 50% నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా అంతక్రితం ప్రకటించింది. డెయిరీ, సోయామీల్, పౌల్ట్రీ, జీఎమ్ ఆహారం, బియ్యం, గోధుమలు, మొక్కజొన్న వంటి అంశాల్లో మన రైతులకు పూర్తి రక్షణ ఉందని గోయల్ పేర్కొన్నారు.

## పాక్‌పై ట్రంప్ ప్రశంసలు..

### తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్

పాకిస్థాన్‌కు డొనాల్డ్ ట్రంప్ పూర్తిగా మద్దతు పలకడం భారత విదేశాంగ విధానానికి ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించిన ఆయన.. ఇప్పటికే అమెరికాతో మన ఆర్థిక దౌత్యం పూర్తిగా విఫలమైందన్నారు. వాణిజ్య ఒప్పందం తర్వాత కూడా భారత్ నుంచి దిగుమతి చేసుకొనే సోలార్ మాడ్యూల్స్‌పై ట్రంప్ భారీ సుంకాలు విధించిన విషయాన్ని గుర్తుచేశారు. మన వ్యూహాత్మక దౌత్యానికి అధ్యక్షుడు ట్రంప్ పదేపదే అడ్డంకులు సృష్టిస్తున్నారని అన్నారు.

# బొగ్గు దిగుమతులు 30% తగ్గించుకోండి

**విద్యుత్ ప్లాంట్లకు కేంద్రం సూచన**

**దిల్లీ:** బొగ్గు దిగుమతులను కనీసం 30% తగ్గించుకోవాలని విద్యుత్‌ప్లాంట్లకు కేంద్రం సూచించింది. దేశీయ బొగ్గు కలిపి వాడడాన్ని (బ్లెండింగ్) పెంచడం ద్వారా, ఈ ఏడాది కనీసం 15 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతిని నిలువరించవచ్చని భావిస్తోంది. ఈ ప్రణాళికతో దగ్గరి సంబంధాలున్న ప్రభుత్వ, పరిశ్రమ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద థర్మల్ బొగ్గు దిగుమతిదారుగా మనదేశం ఉంది. 2025లో ఇండొనేషియా, దక్షిణాఫ్రికా, రష్యా వంటి దేశాల నుంచి వచ్చిన 50 మిలియన్ టన్నుల బొగ్గును మనదేశంలోని విద్యుత్ ప్లాంట్లు వినియోగించాయి. ఈ ఏడాది 15 మి. టన్నుల మేర బొగ్గు దిగుమతుల్లో కోత వేయాలని కేంద్రం భావిస్తోందని తెలుస్తోంది. దేశంలో నాలుగింట మూడొంతుల విద్యుదుత్పత్తికి బొగ్గుపైనే జరుగుతోంది. దేశీయంగా నాణ్యమైన బొగ్గు లభిస్తున్నందున, ఇబ్బందులేమీ ఉండవని విద్యుత్తు ప్లాంట్లకు ప్రభుత్వం వివరిస్తున్నట్లు సమాచారం.వేసవి కోసం బొగ్గు సరఫరా పెంపు..కోల్ ఇండియా: వేసవిలో విద్యుత్ వాడకం పెరుగుతుంది కాబట్టి, అదనపు విద్యుత్తు ఉత్పత్తి చేసేలా ప్లాంట్లకు బొగ్గు సరఫరా పెంచే పనిలో ఉన్నట్లు కోల్ ఇండియా తెలిపింది. ఈనెల 25 నాటికి కంపెనీ వద్ద 115 మిలియన్ టన్నుల బొగ్గు ఉంది.



## రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌లో బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్, సెల్యూలార్ థెరపీ యూనిట్ ప్రారంభం

- క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక కార్-టి సెల్ థెరపీ సౌకర్యం
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అంతర్జాతీయ సేవలు
- రక్త క్యాన్సర్ రోగులకు కొత్త ఆశాకిరణం

**మహేశ్వరం, ఫిబ్రవరి 28 ( జనంసాక్షి ) :** క్యాన్సర్ చికిత్స రంగంలో అత్యాధునిక సాంకేతికతలను అందుబాటులోకి తెచ్చిన రెనోవా హాస్పిటల్స్, తన రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్ అండ్ సెల్యులార్ థెరపీ' యూనిట్‌ను శనివారం ఘనంగా ప్రారంభించింది. ముఖ్య అతిథిగా కిమ్స్ హాస్పిటల్స్ సీఈఓ డా. అభినయ్, రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఫౌండర్, సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి, క్లినికల్ లీడ్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, సెల్యూలార్ థెరపీ స్పెషలిస్ట్ డా. జి. వాసుబాబు, మెడికల్ & హెమటో ఆంకాలజిస్ట్ డా. రాజేష్ బొల్లం కలిసి ఈ యూనిట్‌ను ప్రారంభించారు. క్లినికల్ లీడ్ డా. జి. వాసు బాబు మాట్లాడుతూ... తనతో పాటు నిపుణులైన వైద్య బృందం అత్యుత్తమ సేవలు అందించ దానికి సిద్ధంగా ఉందని తెలిపారు. దేశంలో ప్రతి 7 సెకన్లకు ఒకరు బ్లడ్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సమయానికి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉండటం కీలకమని పేర్కొన్నారు. ఈ యూనిట్‌లో ఆటోలోగస్, అలోజెనిక్ బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌లు (ఫుల్ మ్యాచ్, హాఫ్ మ్యాచ్, మ్యాచ్డ్ అన్‌రిలేటెడ్ డోనర్) సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్-టి సెల్ థెరపీ వంటి అత్యాధునిక చికిత్సా విధానాలను అందిస్తున్నామని తెలిపారు. కార్-టి థెరపీలో రోగనిరోధక కణాలైన టి-సెల్స్‌ను జన్యుపరంగా మార్పులు చేసి, క్యాన్సర్ కణాలను గుర్తించి నశింప జేసే విధానం అమలవుతుందని, ఆరోగ్యకరమైన కణాలకు నష్టం లేకుండా క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుందని డా. వాసుబాబు వివరించారు. ముఖ్యంగా ల్యుకేమియా, లింఫోమా వంటి రక్తం, బోన్ మ్యారో సంబంధిత క్యాన్సర్ల చికిత్సలో ఈ థెరపీ మంచి ఫలితాలిస్తోందని పేర్కొన్నారు.
రెనోవా గ్రూప్ ఫౌండర్, సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ... రెనోవా సెంచరీ హాస్పిటల్స్‌లో అత్యున్నత ప్రమాణాలతో ఈ యూనిట్ ప్రారంభించడం గర్వకారణమన్నారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్‌తో పరిమితం కాకుండా కార్-టి సెల్ థెరపీ వంటి విప్లవాత్మక సెల్యులార్ చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. రక్త సంబంధిత తీవ్ర వ్యాధులతో బాధపడే రోగులకు అంతర్జాతీయ ప్రమాణాల వైద్య సేవలను సరసమైన ధరల్లో అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డా. అశ్విన్ పండిట్, డా. బి. మహేంద్ర వర్మ, డా. విక్రమ్ (కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్టులు), డా. నిషిత్ వడ్డెబోయిన (కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్), డా. రామ వాఘ్మారే (కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్), రవీంద్రనాథ్ గరగ (సీఓఓ), డా. వారిస్ (సెంటర్ హెడ్), డా. షరీఫ్ (వైస్ ప్రెసిడెంట్, మెడికల్ సర్వీసెస్) తదితరులతో పాటు వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బోధన్ ఆర్టీసీ డిపోలో అధికారుల వేధింపులు

- గేటు ఎక్కి నిరసన తెలిపిన కార్మికుడు
- డ్యూటీలో విషయంలో ఇష్టారాజ్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు


**బోధన్, ఫిబ్రవరి 28 ( జనంసాక్షి ) :**
బోధన్ ఆర్టీసీ డిపోలో అధికారుల వేధింపులు తాళలేక శనివారం మాలిపటేల్ సురేష్ అనే కార్మికుడు గేటు ఎక్కి నిరసన తెలిపారు. కార్మికులకు సెలవులు మంజూరు చేయకపోవడంతో పాటు ప్రతిరోజు డ్యూటీలు వేయడంతో విధులు చేయలేకపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తులు. ఈ విషయాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వివరించినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని కార్మికులు స్పష్టం చేశారు. బాధితుడు మాలిపటేల్ సురేష్ కథనం ప్రకారం తాను గత మూడు సంవత్సరాల నుండి బోధన్ డిపోలో విధులు నిర్వహిస్తున్నారని ఈ మేరకు చార్ట్ అధికారులు చెప్పినట్లు ప్రతి డ్యూటీ చేయడం జరుగుతుందన్నారు. అయితే తనకు చేయి సరిగ్గా పనిచేయదని, అధికారులు నిత్యం డే డ్యూటీ వేయడంతో విధులు సరిగ్గా నిర్వహించలేక పోతున్నానని ఈ విషయాన్ని అధికారులకు ఎన్నోసార్లు చెప్పడం సైతం జరిగిందన్నారు. అయినప్పటికీ చార్ట్ అధికారి ఎమ్మెస్ రావు నిత్యం డే అవుట్ డ్యూటీలు వేస్తూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించా రు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు తన పరిస్థితిని వివరించినప్ప టికీ లాభం లేకుండా పోయిందన్నారు. రోజు హైదరాబాదుకు డే అవుట్ డ్యూటీలు చేయడంతో ఆరోగ్యం పాడు కావడంతో పాటు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. దాంతో అధికారుల వేధింపులకు విసిగిపోయి శనివారం డిపో గేటు ఎక్కడం జరిగిందని ఆయన వివరించారు. బోధన్ డిపోలో అధికారుల వేధింపులతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సంఘటనతో అర్థమవుతుందని కార్మికులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. బోధన్ డిపో అధికారులను, కార్మికులను గాడిలో పెట్టాల్సిన ఉన్నత అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతోనే పరిస్థితి ఇలా దారుణంగా తయారైందని కార్మికులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లా అధికారులు స్పందించి బోధన్ డిపోలో జరుగుతున్న వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.

### ఉరి వేసుకుంటానని కంట్రోలర్‌ను బెదిరించాడు

ఈ విషయమై బోధన్ డిపో మేనేజర్ విశ్వనాథ్ ను జనంసాక్షి వివరణ కోరగా, మాలిపటేల్ సురేష్ కు మంచి డ్యూటీ లే వేయడం జరిగిందన్నారు. అయితే అతను డేఅవుట్ డ్యూటీలు చేయలేదని శనివారం తనకు వరంగల్ డ్యూటీ వేస్తేనే వెళ్తానని లేకుంటే ఉరి వేసుకుంటానని కంట్రోలర్ ను బెదిరించడం జరిగిందన్నారు. బోధన్ డిపోలో కార్మికులకు అందరికీ న్యాయంగా డ్యూటీలు వేయడం జరుగుతుందని ఎలాంటి భేదాలు చూపించడం లేదని డిపో మేనేజర్ విశ్వనాథ్ స్పష్టం చేశారు.



## రేచపల్లి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడు?

**జగిత్యాల క్రైమ్, జనంసాక్షి :**
జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండల పరిధిలోని రేచపల్లి గ్రామం నుండి బట్ట పల్లి, పోతారం వెళ్లే మార్గంలో ఉన్న తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో కాకపోవడంతో రాళ్లు కంకర, యాష్ రోడ్డుపై తేలి వాహన దారులకు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వాలు మారిన, అధికారులు మారిన పనితీరు మారకపోవడంతో గ్రామస్తులు, వాహన దారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు అట్టి కాంట్రాక్టర్ పై శాఖపరమైన చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణ పనులను చేపట్టే విధంగా కృషి చేయాలని గత కొద్ది సంవత్సరాల రోడ్డు నిర్మాణ పనుల కల నెరవేరే విధంగా చూడాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని రేచపల్లి గ్రామస్తులు, సారంగాపూర్ మండల ప్రజలు కోరారు.

## మార్చి నెలలో ప్రతి ఆదివారం 'ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం' కార్యక్రమం

**శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ**

హైదరాబాద్/ రాజేంద్రనగర్, (జనంసాక్షి) :
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శంషాబాద్ జోన్‌లో మార్చి నెలలో ప్రతి ఆదివారం "ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం కార్యక్రమాన్ని జోనల్ కార్యాలయం ప్రకటన మేరకు నిర్వహించనున్నట్లు శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ పేర్కొన్నారు. ఆస్తి పన్ను సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు సంబంధిత డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల్లో నిర్వహించ బడుతుంది. ఈ కార్యక్రమంలో ఫిర్యాదుల పరిష్కారం, రివిజన్ పిటిషన్లు, ఆస్తి పన్ను అంచనాల సవరణలు, బిల్ కలెక్టర్ల ద్వారా లేదా ఆర్టిజిఎస్ ద్వారా చెల్లించిన మొత్తాల నమోదు, ఆన్‌లైన్ బకాయిల సవరణలు, కోర్టు కేసుల పరిష్కారం, ఐజిఆర్ఎస్ మస్యలు, స్వీయ అంచనా అంశాలు తదితర విషయాలను పరిశీలించి పరిష్కరించనున్నారు. శంషాబాద్ జోన్ పరిధిలోని అన్ని ఆస్తి యజమానులు, పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జోనల్ కార్యాలయం ఆదేశాల మేరకు ఆమె కోరారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌పై అవాకులు చేవాకులు పేలితే ఖబర్దార్

- చల్లా హరిశంకర్‌కు నైతిక అర్హత లేదు
- రెండు చోట్ల ఓడిపోయిన బుద్ధి రాలేదు
- బండి సంజయ్ అభివృద్ధి గుర్తించాలి

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 ( జనంసాక్షి ) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురించి మాట్లాడే నైతిక అర్హత, స్థాయి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చల్లా హరిశంకర్‌కు లేదని, ఆయన స్థాయిని మించి విమర్శలు చేసి అవాకులు చేవాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు, కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఘాటుగా హెచ్చరించారు. శనివారం కరీంనగర్‌లోని మైత్రి హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
మహిళలు రాజకీయంగా ఎదగడానికి బండి సంజయ్ మంచి అవకాశం ఇచ్చారని, వారందరినీ కార్పొరేటర్లుగా గెలిపించడానికి సంజయ్ ఎంతో శ్రమించారని, నేడు 19 మంది మహిళా కార్పొరేటర్లను చేసిన ఘనత బండి సంజయ్ దేనని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ పనితనం, ఆయన చేస్తున్న అభివృద్ధి గురించి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు అర్థమైతే లేదని, మెదడు ఉన్నోళ్లకు చెప్తే అర్థమవుతుంది కానీ మెదడు లేని వాళ్లకు ఎంత చెప్పినా అర్థం కాదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.
కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం సంజయ్ చేసిన పనులపై ఒక పుస్తకం రిలీజ్ చేశారని, ఆ పుస్తకం చదివితే బండి సంజయ్ ఏం చేశారు, కేంద్రం కరీంనగర్ కోసం ఏం చేసిందో తెలుస్తుందని తెలిపారు. ముందుగా బండి సంజయ్ కుమార్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తున్న బీఆర్ఎస్ అధ్యక్షులు చల్లా హరిశంకర్ ఆ బుక్‌ను పూర్తిగా చదివి, బండి సంజయ్ ఇన్నేళ్లలో ఏమేమి పనులు చేయించారో తెలుసుకోవాలని, అవసరమైతే ఆయనకు బుక్ పంపిస్తామన్నారు.
అసలు చల్లా హరిశంకర్‌ను జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల ఘోరంగా ఓడగొట్టిన ఇంకా బుద్ధి రాలేదని, బీఆర్ఎస్ నాయకులను



ప్రజలు చీ కొడుతున్న బుద్ధి రావడం లేదని, ఇంకా గాలి మాటలు మాట్లాడుతూ ప్రజల్లో మరింత చులకన అవుతున్నారని విమర్శించారు.
కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం సంజయ్ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ గుర్తించారని, క్యాబినెట్‌లో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కు అవకాశం ఇచ్చారని, దేశ నాయకులకు బండి సంజయ్ గురించి అర్థమైంది కానీ కరీంనగర్‌లో ఉన్న నాయకులకు అర్థం కాకపోవడం దౌర్భాగ్యమన్నారు.
కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ నిధులతో కరీంనగర్ అభివృద్ధి చెందిందా? అప్పటి బీఆర్ఎస్ కరీంనగర్ అభివృద్ధి కోసం నిధులు ఇచ్చిందా అనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలకు దమ్ముంటే స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంకల్పంతో ఉన్నారని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో కరీంనగర్ నగరపాలక సంస్థకు మరింత అభివృద్ధి చేసే దిశలో ఉన్న కేంద్ర మంత్రి సంజయ్‌పై ఇకపై బీఆర్ఎస్ నేతలు అనవసర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఘాటుగా హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ఎన్నం ప్రకాష్, తాటి ప్రభావతి, గాజె శివరామ్, మేకల వెంకటేశ్, భూపతి రవీందర్, బండ రమణ రెడ్డి, దేవసాని సరస్వతి, కర్రె అనిల్, కోలిపాక శ్రీనివాస్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్ పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 28 (జనం సాక్షి):**



వికారాబాద్ జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారి, శనివారం సాయంత్రం ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి, ఎసి ఎల్ బి సుధీర్, ట్రైని కలెక్టర్ హార్స్ చౌదరి,నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛా లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు.అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించబడింది.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి , మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా మరియు సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారద ర్శకత, విద్యా, వైద్యం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు .జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. శాఖల వారీగా, మండలం వారీగా రివ్యూ చేస్తానని, మీరు చేపట్టే పనులు అభివృద్ధి ఫోటోలు మరియు పూర్తి వివరాల తో నోట్ సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మంగీ లాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర, కాడ అభివృద్ధి అధికారి వెంకట్ రెడ్డి, డిఆర్‌డిఎ శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గత 18 రోజులుగా కొనసాగుతున్న
## న్యాయవాదుల విధులు బహిష్కరణ

**గోదావరిఖని, జనంసాక్షి:** గత కొంతకాలంగా కొనసాగుతున్న న్యాయవాదుల విధుల బహిష్కరణ ఉధృతం కానుంది. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పోరాటాన్ని ఉధృతం చేయాలని తీర్మానించడం జరిగింది. ఆత్మగౌరవం విషయంలో తగ్గేదే లేదు అని ఇటువంటి కళంకితులకు సరైన బుద్ధి చెప్పే వరకు వదిలిపెట్టేదే లేదు అని ,అహంకారపూరిత ధోరణితో అధికార అండ బలంతో కనీస గౌరవ మర్యాదలు తెలియని సిఐ ఇంద్రసేనారెడ్డిని సస్పెండ్ చేసి ,ట్రాన్స్ఫర్ చేసే వరకు పోరాటాలను ఆపేదే లేదు అని న్యాయవాదులందరూ ఏకతాటిగా తీర్మానించడం జరిగింది .న్యాయవాదులను న్యాయవాద వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడినటు వంటి వ్యక్తులు ఎవరైనా ,ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదు అని న్యాయపరంగా చట్టపరంగా ,నైతికంగా ఎక్కడికైనా వెళ్తామని ఇటువంటి వారిని వదిలిపెట్టేదే లేదు ముక్తకంఠంతో తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు తౌటం సతీష్ ,సిరిగ సంజయ్ కుమార్ ఎం .డి.ఉమర్ పెర్క మనోహర్ ,ఎరుకల ప్రదీప్ కుమార్, గాదె శ్రీలత ,పులిపాక రాజ్ కుమార్ ,సబాతబస్సుమ్ పంగ శంకర్ ,గోపాల్ రెడ్డి శోభ ,సిహెచ్ శైలజ, పెట్టమ్ శ్రీనివాస్ ఆరె మధు ,పూర్మ శ్రీనివాస్ ,శాంతన్ కుమార్ ముస్కే రవి, శ్రీనివాస్ గుర్రాల రాజేందర్ సీనియర్ జూనియర్ న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భవిష్యత్ భారత నిర్మాణంలో సైన్స్ కీలకం



**జగిత్యాల బ్యూరో ఫిబ్రవరి 28(జనంసాక్షి) :** 1928లో సర్ సి.వి. రామన్ ఆవిష్కరించిన రామన్ ఎఫెక్టును స్మరించుకుంటూ దేశ వ్యాప్తంగా శనివారం జరుపుకున్న జాతీయ సైన్స్ దినోత్సవం 2026ను "విమెన్ ఇన్ సైన్స్ - కేటలైసింగ్ వికసిత్ భారత్" అంశంతో జరుపుకున్నారు. సైన్స్‌లో మహిళల వేగవంత మైన పాత్రను హైలైట్ చేస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో వారి ప్రాముఖ్యతను గుర్తుచేసే ఉద్దేశంతో జిల్లాలో వివిధ పాఠశాలల్లో సైన్స్ ఫేర్, ప్రాజెక్టుల ప్రదర్శనలు ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోతేలో సైన్స్ ఫేర్‌ను ప్రారంభించి విద్యార్థులు చేసిన ప్రయోగాలను స్వయంగా చూసి మెచ్చుకున్నారు. విద్యార్థులను అభినందించిన ఆయన సైన్స్ పట్ల ఈ ఆసక్తి ఇలాగే కొనసాగి భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆశీర్వదించారు. పి.ఎం. శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకట్రావుపేటలో విద్యార్థులు చేసిన ఎటిఎల్ ప్రాజెక్టుల ప్రదర్శనను మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ సందర్శించారు.మండల విద్యాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎటిఎల్ ల్యాబ్‌ల వంటి అత్యాధునిక ప్రయోగశాలలు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయని, ఇది శుభ పరిణామమని అన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో వ్యాసరచన, సైన్స్ క్విజ్, చిత్రలేఖనం, సైన్స్ పుస్తక ప్రదర్శన, సైన్స్ పరికరాల ప్రదర్శన, సైన్స్ ప్రయోగాలు, ప్రాజెక్టుల ప్రదర్శన, శాస్త్రవేత్తలపై ఉపన్యాసాలు, విజ్ఞాన మేళ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సృజనాత్మకతను అధికారులు మెచ్చుకున్నారు.

## ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ దంపతులు

- భక్తులకు సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశాలు
- ఆధ్యాత్మిక శాంతి, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్ష
- బ్రహ్మోత్సవాల్లో సురక్షిత త్రాగునీరు, పారిశుద్ధ్యం తగిన ఏర్పాట్లు



**జగిత్యాల బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్వామివారి కళ్యాణ మహోత్సవానికి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రజలందరికీ ఆధ్యాత్మిక శాంతి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దివ్య ఆశీస్సులు జిల్లా ప్రజలందరికి కలగాలని ఆకాంక్షించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, శానిటేషన్, పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకొని సురక్షిత త్రాగునీటి సౌకర్యం సమృద్ధిగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందరు అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులందరికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, దేవస్థాన ఈవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో ఉన్న గర్భిణికి సురక్షిత పునర్జన్మ

- తీవ్ర గుండె జబ్బుతో ఉన్న మహిళకు విజయవంతమైన ప్రసవం
- 1.1 కిలోల చిన్నారిని కాపాడిన యశోదా వైద్య బృందం ఘనత
- మలక్‌పేట్ యశోదా హాస్పిటల్స్‌లో అద్భుత వైద్య విజయం

**కరీంనగర్ బ్యూరో,( జనంసాక్షి ) :** తీవ్రమైన గుండె జబ్బుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 21 ఏళ్ల గర్భిణికి మలక్‌పేట్ యశోదా హాస్పిటల్స్ వైద్యులు విజయవంతంగా ప్రసవం జరిపి, తల్లి-బిడ్డ ఇద్దరినీ సురక్షితంగా కాపాడారు. గతంలో గుండె రంధ్రం సర్జరీ జరిగిన చరిత్ర, ప్రస్తుతం ఊపిరితిత్తుల రక్తపోటు (పల్మనరీ హైపర్‌టెన్షన్) తీవ్రంగా ఉండటంతో గర్భధారణ అత్యంత క్లిష్టమైంది. ఈ అరుదైన విజయాన్ని శనివారం కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యశోదా వైద్య బృందం వివరించింది.

### ఆమె ప్రాణం కాపాడటం కత్తి మీద సాము లాంటిది

**డా. లేపాక్షి దాసరి (గైనకాలజిస్ట్)**

రోగి మా వద్దకు వచ్చినప్పుడు పరిస్థితి చాలా విషమంగా ఉంది. చిన్నప్పుడే గుండె రంధ్రం సర్జరీ జరిగింది. ఇప్పుడు ఊపిరితిత్తుల రక్తపోటు తీవ్రంగా ఉండటంతో గర్భం దాల్చడమే ప్రాణాల మీదకు తెచ్చింది. 29 వారాలకే గర్భాశయ సమస్యలు తలెత్తడంతో తల్లి ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. కార్డియాలజీ, అనస్థీషియా టీమ్‌లతో సమన్వయంతో సెకను వృథా చేయకుండా అత్యవసర సిజేరియన్ చేశాం. మా టీమ్ వర్క్ వల్ల తల్లి సురక్షితంగా బయటపడింది.

### గుండె ఆగిపోయే ప్రమాదాన్ని అధిగమించాం

**- డా. పవన్ పొద్దార్ (కార్డియాలజిస్ట్)**

ఆమె గుండె కుడి భాగం వైఫల్యం చెందే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. సర్జరీ సమయంలో గుండె లయ తప్పకుండా ఉండటం పెద్ద సవాలు. 'ఇన్వేసివ్ సెంట్రల్ లైన్' ద్వారా నిరంతర పర్యవేక్షణ చేశాం. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణాలకు ముప్పు ఉండేది. ఖచ్చితమైన ప్రణాళికతో



తల్లి హీమోడైనమిక్స్‌ను స్థిరంగా ఉంచగలిగాం. సర్జరీ తర్వాత గుండె పనితీరు సాధారణ స్థితికి వచ్చింది.

### 1.1 కిలోల శిశువు.. గుండెలో సమస్య.. అయినా పోరాడాం

**- డా. సత్యప్రియ సాహూ (నియోనాటాలజిస్ట్)**

పుట్టినప్పుడు చిన్నారి బరువు కేవలం 1.1 కిలోలు. శ్వాసకోశ ఇబ్బందులతో పాటు గుండెలో రక్తనాళం మూసుకోకపోవడం వల్ల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వెంటనే 'ఇన్సూర' టెక్నిక్ ద్వారా చికిత్స ప్రారంభించి, తర్వాత 'డివైస్ క్లోజర్' ద్వారా గుండె లోపాన్ని సరిచేశాం. నెల రోజుల పాటు లెవల్-3 ఐసియూలో అత్యుత్తమ సంరక్షణ అందించడంతో పాప ఇప్పుడు 1.6 కిలోలకు చేరుకుంది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఇంటికి వెళ్తున్నారు.
యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎంతటి క్లిష్టమైన హై-రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులనైనా విజయవంతంగా పూర్తి చేసే అత్యాధునిక మౌలిక సదుపాయాలు మలక్‌పేట్ యశోదా హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు కృషి

- నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- మంథనిలో ఇన్నోవేషన్ ఎక్స్‌పో 2026 ప్రారంభం
- డ్రీమ్, స్టార్ట్, రైస్ నినాదంతో యువతకు ఉత్సాహం

**మంథని, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నూతన ఆవిష్కరణలకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. శనివారం మంథని పట్టణంలో టీ-వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇన్నోవేషన్ ఎక్స్‌పో 2026' కార్యక్రమా న్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి ప్రారంభించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. "డ్రీమ్, రైస్, స్టార్ట్" నినాదంతో మంథనిలో ఇన్నోవేషన్ ఎక్స్‌పో 2026ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. టీ-వర్క్స్ యూనిట్ బృందం కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటిస్తూ విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెంపొందించే దిశగా కృషి చేస్తోందని కొనియాడారు. నూతన ఆవిష్కరణలు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ, టైర్-2, టైర్-3 ప్రాంతాలకు విస్తరిస్తున్నాయని, ఐటీ, ఏఐ ఆధారిత రంగాలు ఈ ప్రాంతాల్లో విస్తరణతో 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి వివరించారు.
మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం సూచించిన విధంగా పిల్లలు మంచి కలలు కని, వాటిని సాధించేందుకు కార్యాచరణ ప్రారంభించాలని మంత్రి సూచించారు. పిల్లల ఆలోచనలను పదును పెట్టేందుకు డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. మంథనిలోని యువకులు తయారు చేసిన వ్యవసాయ పవర్ ఫీడర్, ఆధునిక హెల్మెట్ వంటి ఆవిష్కరణలు సంతోషకరమని, ఇలాంటి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు టీ-వర్క్స్ ఆధ్వర్యంలో డ్రీమ్, స్టార్ట్, రైస్ సంస్థ పనిచేస్తోందని మంత్రి తెలిపారు.
జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. ఏడు నెలల క్రితం మంథనిలో



టీ-వర్క్స్ యూనిట్‌ను ప్రారంభించామని, ఇక్కడ పిల్లలు అనేక నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. జిల్లాలో ముందస్తుగా 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన, కృత్రిమ మేధస్సు పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించామని పేర్కొన్నారు. మంథనిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ వాడకంతో మెరుగైన ఫలితాలు సాధించడంతో రాబోయే విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏఐ బోధన జరిగేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.
జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఎంఓయూ చేసుకునేందుకు ముందుకు వచ్చిన ఔత్సాహిక వేత్తలకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల రోజువారీ సమస్యల పరిష్కారానికి ఆవిష్కరణలు ఉపయోగపడాలని ఆయన సూచించారు.
ఈ కార్యక్రమంలో టీ-వర్క్స్ సీఈఓ జోగేందర్, మున్సిపల్ చైర్మన్ ఓద్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సయేందర్ రెడ్డి, ఆర్‌డీఓ సురేష్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
1 మార్చి 2026

## పేదలకు ఇళ్ల స్థలాలో.. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కే.రామస్వామి డిమాండ్**

చేవెళ్ల,ఫిబ్రవరి 28 (జనంసాక్షి) పేదలకు ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొయినాబాద్ మండల్ సిపిఐ కార్యదర్శి కే.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిపిఐ పార్టీ మొయినాబాద్ మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ...భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లాలో అనేక చోట్ల భూ పోరాటాలు నిర్వహిస్తూ పేదలకు గుడిసెలు వేసి పోరాడుతున్న ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన మండిపడ్డారు. ధనవంతులు గురు స్వాములు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కేసులు పెట్టని ప్రభుత్వం పేదలు జానెడు జాగ కోసం ఇంటి స్థలం కోసం గుడిసెలు వేసుకుంటే కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆయన విమర్శిం చారు. ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలన్నారు. లెనిపక్షంలో కమ్యూని స్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండి జలీల్. ఎండి.జాంగిర్, ఎం.మోహన్ రెడ్డి, బోనాల ప్రభాకర్, రాములు, బి.మల్లేష్ ఏటిసి మల్లేష్ కే రాములు అండాలు బాలమని టి.నరసింహులు. టి.యాదగిరి పాల్గొన్నారు.

## విజ్ఞానంలో అజ్ఞానాన్ని చొప్పిస్తున్న పాలకులు

- నేషనల్ సైన్స్ డే సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వైజ్ఞానిక సెమినార్
- విద్యార్థుల ప్రదర్శనలు అద్భుతం.. సౌకర్యాలు మెరుగుపరచాలి : ప్రొఫెసర్ రామచంద్రయ్య విమర్శ
- భవిష్యత్తు పౌరులకు శాస్త్రీయ దృక్పథం అవసరం




**ముషీరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి):** ప్రపంచమంతా విజ్ఞానం వైపు పరుగెడుతుండగా, మన పాలకులు మాత్రం విజ్ఞానంలోనూ అజ్ఞానాన్ని పెంచే ప్రచారం చేస్తున్నారని ప్రొఫెసర్ రామచంద్రయ్య తీవ్ర విమర్శించారు. సివి రామన్ జయంతి సందర్భంగా నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "శాస్త్ర సాంకేతికత – భారతదేశ భవిష్యత్తు" అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్తు సమాజ అభివృద్ధికి వైజ్ఞానిక విద్య అభివృద్ధి అనివార్యమని ప్రొఫెసర్ రామచంద్రయ్య అన్నారు. పాలకులు సిలబస్‌లోని వైజ్ఞానిక అంశాలను తొలగించి మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విజ్ఞానాన్ని పెంపొందించే సిలబస్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా చిన్నపిల్లలు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఎనలేని విజ్ఞానాన్ని అందించిందని ప్రొఫెసర్ రామచంద్రయ్య కొనియాడారు. హైదరాబాద్‌లో చదువుకుంటున్న విద్యార్థులు వ్యవసాయంలో అత్యాధునిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎలా ఉపయోగించాలో ప్రదర్శించడం, ట్రాఫిక్ సమస్యలు, మైక్రోప్లాస్టిక్ దుష్ప్రభావాలు, ఏఐ, రోబోటిక్స్ వంటి అంశాలపై చక్కగా వివరించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. సివి రామన్, అబ్దుల్ కలాం, విశ్వేశ్వరయ్య వంటి శాస్త్రవేత్తల చరిత్రలు, జీవితాలు తెలుసుకోవాలని, వారి అడుగుజాడల్లో నడిస్తేనే దేశ భవిష్యత్తు బాగుంటుందని సూచించారు.

ప్రభుత్వాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కంటే ముందు ఈ బాధ్యత వహించాల్సి ఉందని, కానీ విస్మరిస్తున్నాయని ఆయన విమర్శించారు.

తెలంగాణ బాలోత్సవం కమిటీ కార్యదర్శి ఎన్. సోమయ్య మాట్లాడుతూ నేటి పాఠశాల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి వైజ్ఞానిక శక్తిని పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. సంవత్సరం పాటు పోటీ పరీక్షలు, నృత్యోత్సవాలు, సాంస్కృతిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్త, సామాజికవేత్త, ఆర్థికవేత్త, నీతిమంతుడైన రాజకీయ నాయకుడిగా ఎదగాలని, ప్రపంచానికి దిశానిర్దేశం చేసే పౌరులుగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, కోయ వెంకటేశ్వర్, సామాజిక కార్యకర్త ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ పెరుగుతున్న శాస్త్ర సాంకేతికత నేపథ్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు అత్యంత అవసరమన్నారు. తెలంగాణ బాలోత్సవం కమిటీకి అభినందనలు తెలిపారు. పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ సైన్స్ పెరుగుతుంది కానీ దాన్ని అందిపుచ్చుకునే సౌకర్యాలు ఇంకా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 150 ప్రాజెక్టులు, 350 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు పాల్గొన్నారు. తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు సుజావతి, బుచ్చిరెడ్డి, మహేష్ దుర్గే తదితరులు, విద్యార్థులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.




## మార్చి 2న వికారాబాద్ రాహుల్ గాంధీ రాక

**వికారాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మార్చి 2వ తేదీన వికారాబాద్ జిల్లా అనంతగిరిలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతరులు పర్యటించనున్న నేపథ్యంలో, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీసు అధికారులతో కలిసి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ సుదీర్ఘంగా చర్చించారు.వివిఐపిల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యున్నత స్థాయి భద్రతను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో భాగంగా ఎస్పీ గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పి పి టి ద్వారా బందోబస్తుకు సంబంధించిన పూర్తి ప్రణాళికను వివరించారు. ముఖ్యంగా హెలిప్యాడ్ వద్ద భద్రత, కాన్వాయ్ ప్రయాణించే రూట్ మ్యాప్, సభా ప్రాంగణం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పర్యటన సాగే మార్గాల్లో ముందస్తుగా తనిఖీలు చేపట్టాలని, ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో పనిచేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పర్యటన ప్రశాంతంగా ముగిసేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఇట్టి సంధార్బంగా పోలీస్ అధికారులకు తెలియజేయడం జరిగింది.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, పరిగి డిఎస్పి శ్రీనివాస్, వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఇంచార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు, డిసిఆర్‌బి డిఎస్పి జానయ్య, ఏఆర్ డిఎస్పి వీరేష్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న దివ్య
- నాన్న లేకపోవడం వల్లే కష్టాలు.. ఎవరి ప్రమేయం లేదు
- పెళ్లి ఒత్తిడి, పోలీస్ ఉద్యోగం ఇష్టం లేదు
- వికారాబాద్ సిఐ రఘు కుమార్ కేసు నమోదు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి):** రాష్ట్రంలో పోలీసు శాఖలో మళ్లీ ఒక మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకోవడం సంచలనం సృష్టించింది. వికారాబాద్ జిల్లాలోని గంగారం సాయిబాబా కాలనీలో శనివారం ధరూర్ సీఐ ఆఫీసులో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ దివ్య (28) చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ ఉన్నప్పటికీ ధరూర్ సీఐ ఆఫీసులో రైటర్‌గా పని చేస్తున్న దివ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థలంలో ఒక సూసైడ్ నోట్ దొరికిందని వెల్లడించారు. "నాన్న లేకపోవడం వల్లనే మా కుటుంబం ఇన్ని కష్టాలు పడుతోంది. నా ఆత్మహత్యలో ఎవరి ప్రమేయం లేదు" అని ఆ లేఖలో దివ్య రాసినట్లు సిఐ రఘు కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఆదివారం దివ్యకు పెండ్లి చూపులు ఉన్నాయి. ఆ పెళ్లి తనకు ఇష్టం లేదని ఆమె తల్లితో చెప్పింది. పోలీసు శాఖలోని మరో కానిస్టేబుల్‌ను పెళ్లి చేసుకోవాలని కుటుంబం ఒత్తిడి చేస్తుండగా, దివ్య ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. శుక్రవారం రాత్రి పెళ్లి విషయంపై కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర చర్చ జరిగినట్లు తెలిసింది. తర్వాత గదిలోకి వెళ్లి నిద్రపోయిన దివ్య శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకుంది. పోలీస్ ఉద్యోగం తనకు ఇష్టం లేదని, డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చేటప్పుడు చీకటి పడుతుందని దివ్య ఇటీవల తన కుటుంబ సభ్యులతో ఆవేదన వ్యక్తం చేసినట్లు కుటుంబం తెలిపింది. వికారాబాద్ సిఐ రఘు కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

## వంద శాతం లక్ష్యంగా ఆస్తిపన్ను వసూలు చేయాలి

- పాత బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేయాలి
- మున్సిపల్ కమిషనర్ పి మధుసూదన్ రెడ్డి

తాండూరు ఫిబ్రవరి 28(జనంసాక్షి)

వంద శాతం లక్ష్యంగా ఆస్తిపన్ను వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి మధుసూదన్ రెడ్డి ఆదేశించారు. శనివారం తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాత బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని చెప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఇంటింటికి వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఆస్తుపన్ను చెల్లించి ఇంటి యజమానులు మున్సిపాలిటీ అభివృద్ధికిసహకరించాలని ఆయన కోరారు. ఆస్తిపన్ను వసూలలో నిర్లక్ష్యం వహించే సిబ్బంది చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, జి.రాములు, బిల్‌కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## పరిహారం ఇవ్వరు.. కోర్టు ఆదేశాలు అమలు చేయరు

### దిక్కు తోచని స్థితిలో మిడ్ మానేరు జలాశయ నిర్వాసితులు

- పాలకులు పట్టించుకోకపోవడంతో నిరాశ
- కోర్టుల మెట్లెక్కిన వృద్ధులు, మహిళల ఆవేదన

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మధ్య మానేరు జలాశయ నిర్మాణంలో సర్వం త్యాగం చేసిన నిర్వాసితు లను ఆదుకోవాల్సిన అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పాలకులు పట్టించుకోవడం లేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగి వేసారిన నిర్వాసితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు కోర్టు ఆదేశాలను అమలు చేయడం లేదు. మిడ్ మానేరు జలాశయాన్ని 2006 లో ప్రారంభించారు. 2006 నుంచి నిర్వాసితుల వ్యవసాయ భూములు సేకరించారు. ఎకరానికి రూ 2.10 లక్షల పరిహారం అందించారు. 2008 ఆర్అండ్ఆర్ గెజిట్ ప్రచురించారు. నిర్వాసితుల భూముల,ఇళ్ల సేకరణ,ఆర్ అండ్ ఆర్ పరిహారం చెల్లింపుల కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు సర్వేలు నిర్వహించారు. అనంతరం అవార్డు, గెజిట్ ప్రచురించారు.

**పరిహార ఇవ్వరు..కోర్టు ఆదేశాలు అమలు చేయరు..**

అనేక మంది నిర్వాసితుల్లో నేటికి పరిహారం అందలేదు.కొంత మంది భూములు,మరి కొంత మంది ఇండ్ల కొరకు,ఇంకొంత మంది ఆర్అండ్ఆర్ పరిహారం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు.

వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన ఓ నిర్వాసితురాలు ఆర్అండ్ఆర్ పరిహారం కోసం కోర్టును ఆశ్రయించగా, నిర్వాసితురాలికి పరిహారం అందించాలని కోర్టు ఆదేశించిన అధికారులు అమలు చేయలేదు. చీర్లవంచకు చెందిన ఓ వృద్ధ దంపతులు తమ ఇంటి పరిహారం కోసం కోర్టు మెట్లు ఎక్కగా వారికి ఇంటి పరిహారం చెల్లించాలని చెప్పినప్పటికీ కోర్టు ఆదేశాలు అమలు చేయలేదు. దీంతో జిల్లా అధికారి కోర్టుకు హాజరయ్యారు. కొదురుపాకకు చెందిన ఓ వృద్ధురాలు భూమి పరిహారం కోసం కోర్టుకు వెళ్ళింది. వాదనలు విన్న న్యాయమూర్తి భూ పరిహారం చెల్లించాలని తీర్పు వెల్లడించారు. అధికారులు కోర్టు ఆదేశాలు అమలు చేయక పోవడంతో ఆమె కోర్టు ధిక్కరణ పిటిషన్ వేసింది. దీంతో అప్పటి అధికారులను కోర్టు వ్యక్తిగతంగా హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.

**పట్టించుకోని పాలకులు..**

ఏ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నా నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని చెపుతూ వస్తున్నారు.తీర అధికారంలోకి వచ్చాక వారి సమస్యలు పరిష్కారం కావడం లేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు.ఇప్పటికైన అధికారులు, ప్రజాపతినిధులు తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మిడ్ మానేరు నిర్వాసితులు కోరుతున్నారు.

## రాబోయే రోజుల్లో మోడీ నాయకత్వంలో భారత్ అగ్రగామి దేశంగా నిలుస్తుంది

- వికసిత్ భారత్ 2047పై విద్యార్థుల ప్రసంగాలు
- యువతే దేశ ప్రగతికి కీలకం : మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి):** ఆర్థికంగా, సామాజికంగా, సాంకేతికంగా ప్రపంచం లోనే భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టడమే ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యమని, యువత భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. రాబోయే రోజుల్లో మోడీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తుంద ని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'వికసిత్ భారత్ 2047' కార్యక్రమం నేపథ్యంలో శనివారం కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "వికసిత్ భారత్" అంశంపై రాష్ట్ర, జాతీయ స్థాయి ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కళాశా ల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి దాదాపు 200 మందికి పైగా విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొని దేశ ఆర్థిక, సామాజిక, సాంకేతిక అభివృద్ధి అంశాలపై ప్రసంగాలు చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టాలనే సంకల్పంతో ప్రధాని మోడీ 'వికసిత్ భారత్ 2047' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని మేయర్ గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా యువత చేసిన ప్రసంగాలు, కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, సూచనల ఆధారంగా పలువురు విద్యార్థులను ఎంపిక చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ దేశ ప్రగతి కోసం ప్రసంగించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, అధ్యాపక బృందం ఆయనను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విద్యార్థులు చేసిన ప్రసంగాలు అభినందనీయమని, దేశ ప్రగతిలో యువత ప్రధాన పాత్ర పోషించాలని మేయర్ సూచించారు. ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం గొప్ప ప్రగతిని సాధిస్తుందని, రాబోయే రోజుల్లో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, జిల్లా యూత్ ఆఫీసర్ వెంకట్ రాంబాబు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువు కట్టపై పిచ్చి మొక్కలు తొలగించండి



**షాబాద్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వాహనదారుల్ని ఇబ్బందికి గురి చేస్తున్న పిచ్చి మొక్కలను తొలగించి చెరువు కట్టపై ప్రయాణించే వారికి రహదారి సులభతరం చేయాలని షాబాద్ యువత శనివారం మండల పంచాయతీ అధికారి నాసరయ్య, షాబాద్ సర్పంచ్ అశోక్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... చెరువు కట్ట అవతల గ్రామాల ప్రజలు ప్రతినిత్యం కట్టపై ప్రయాణం చేస్తుంటారు, అతిగా పెరిగిన పిచ్చి మొక్కల వల్ల దారి కనబడక ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు ఎన్నో అని. అలాగే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించే చెరువు పిచ్చి మొక్కలతో కురుకపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిందన్నారు. మండల పరిధిలోనే ప్రఖ్యాత గల చెరువు ను వెంటనే సుందరీకరించి మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. అలాగే గ్రామంలో వీధి కుక్కల బెడద తో చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారని వీధి కుక్కల నుండి వృద్ధులను, చిన్నారులను కాపాడాలని గ్రామంలో కుక్కల బెడదకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింలు, కిరణ్ కుమార్, రజనీకాంత్, సచేందర్, రాజేష్, రమేష్, గౌతమ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు ప్రాణాలు కాపాడడానికే... తీసేందుకు కాదు

- నల్ల రిబ్బన్లతో ఐఎంఏ, తానా వైద్యుల ఆందోళన
- రాజేంద్రనగర్‌లో సీనియర్ పీడియాట్రిషియన్‌పై దాడి ఖండన
- కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు వినతిపత్రం



**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి):** వైద్య వృత్తిపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్‌లో ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్), తానా (తెలంగాణ ఆంధ్ర మెడికల్ అసోసియేషన్) వైద్యులు శనివారం నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీనియర్ పీడియాట్రిషియన్‌పై జరిగిన దాడిని హేయమైన చర్యగా అభివర్ణించారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బండ్లగూడ సన్ సిటీలోని క్రియాన్స్ (క్రేయాన్స్) హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఆరు నెలల శిశువు మృతి చెందిన నేపథ్యంలో ఆసుపత్రి వైద్యుడిపై వందలాది మంది దాడికి దిగడం తీవ్ర ఆందోళన కలిగించిందని వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడేందుకు వెళ్లిన సీనియర్ పీడియాట్రిషియన్‌పై దాడి, దుర్భాషలాడటం రాష్ట్రవ్యాప్తంగా వైద్య వర్గాల్లో ఆగ్రహాన్ని రేపింది.

తానా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కటారి మాట్లాడుతూ చిన్న హాస్పిటళ్లపై దాడులు ప్రజలకు మేలు చేయవన్నారు. "రోగుల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసే వైద్యులపై దాడులు సమాజానికి ప్రమాదకరం. ఇలాంటి సంఘటనలు కొనసాగితే చిన్న ఆసుపత్రులు మూతపడే ప్రమాదం ఉంది. చివరికి నష్టపోయేది సాధారణ ప్రజలే" అని స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోలేని పేద, మధ్యతరగతి వర్గాలకు చిన్న హాస్పిటళ్లు ఆధారమని గుర్తుచేశారు. లీగల్ సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలి గానీ దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. అవసరమైతే అధికారులకు ఫిర్యాదు చేసి చట్టబద్ధంగా న్యాయం కోరాలని సూచించారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.ఐఎంఏ కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ ఆకుల శైలజ మాట్లాడుతూ ఆరు నెలల శిశువు మృతి చెందిందనే కారణంతో ఒక వైద్యుడిపై వందలాది మంది దాడి చేయడం పూర్తిగా ఖండించదగిన చర్య అన్నారు. "వైద్యులు రోగుల ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తారు. ప్రాణాలు తీయాలనే ఉద్దేశం ఎప్పటికీ ఉండదు. అత్యవసర పరిస్థితుల్లో అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే ప్రతిసారీ వైద్యులను బాధ్యులుగా చూడటం సరైంది కాదు" అని పేర్కొన్నారు. కరోనా సమయంలో వైద్యులను దేవుళ్లుగా భావించిన ప్రజలు నేడు వారిపై తిరగబడటం బాధాకరమన్నారు. అన్యాయం జరిగిందని భావిస్తే చట్టపరమైన మార్గాల్లో పోరాడాలని, హింసకు పాల్పడటం సమాజానికి మేలు చేయదని సూచించారు.

జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎనమల నరేష్ మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి అమానుష సంఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమన్నారు. ప్రతి వైద్యుడు తన రోగిని కాపాడాలనే ధ్యేయంతోనే పనిచేస్తాడని, అదే తనకు గౌరవం, పేరు తీసుకువస్తుందని తెలిపారు. చిన్న ఆసుపత్రుల్లో తక్కువ ఖర్చుతో చికిత్స అందుతుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వ్యయం ఎక్కువగా ఉంటుందని ప్రజలు గుర్తించాలన్నారు. ఇలాంటి దాడులు కొనసాగితే చిన్న హాస్పిటళ్ల మనుగడకే ప్రశ్నార్థకం తలెత్తుతుందని హెచ్చరించారు.

అనంతరం వైద్యులు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా కార్యదర్శి డా. ఎన్. మహేష్ బాబు, కోశాధికారి డా. నీలిమ కాసం, డా. విజయేంద్ర రెడ్డి, డా. బి.ఎన్. రావు, డా. సురేష్ కుమార్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డా. రాజకుమార్, ఎపిఐజీఎసఐ కార్యదర్శి డా. శ్రావంతి, కోశాధికారి డా. స్వప్న కె, ఐఏపి జిల్లా అధ్యక్షుడు డా. రామ్ మోహన్, కార్యదర్శి డా. రఘునాథ్ తదితరులతో పాటు సీనియర్ వైద్యులు, యువ డాక్టర్లు, ఐఎంఏ సభ్యులు పాల్గొని సంఘీభావం తెలిపారు.





## ఇసుక మార్గం.. ఇష్టరాజ్యం

### అడ్డుకోవడానికి వెనుకంజ వేస్తున్న అధికారులు

**గన్నేరువరం, ఫిబ్రవరి 28 (జనంసాక్షి):** ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. గన్నేరువరం మండలంలోని చొక్కారావుపల్లె గ్రామంలోని బిక్కు వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. సొంత అవసరాలకు స్థానికంగా వున్న వాగులు నుంచి ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం కల్పించిన వెసులుబాటును కొంతమంది అక్రమార్కులు తమకు అనుకూలంగా మార్చుకుని దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా ఆర్జిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ల ఓనర్లు జెసిబి సహాయంతో చొక్కారావుపల్లె బిక్కు వాగు రోడ్ కింద ఉన్న పైపులకు వరద నీరు రాకుండా అడ్డంగా మట్టి పోసి వదిలేశారు. దీంతో చొక్కారావుపల్లె గ్రామస్తులతో కలిసి సర్పంచి ట్రాక్టర్లను అడ్డుకున్నారు.

ట్రాక్టర్ల యజమాన్యంతో మాట్లా డి మట్టిని తొలగించాలని చెప్పగా గ్రామస్తులతో ట్రాక్టర్ ఓనర్లు వాగ్వాదానికి దిగారు. సర్పంచి అరికాంతం గోపాల్ రెడ్డి గన్నేరువరం, ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్ ఎస్ఐలకు సమాచారం ఇవ్వగా ఇప్పటి వరకు స్పందించలేదని అన్నారు. సమస్యను పరిష్కరించాలని చొక్కారావుపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.

## మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్ అరెస్ట్



**మెదక్, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల మసయంలో కాంగ్రెస్ నాయకులతో పాటు ఎమ్మెల్యేపై దాడి చేసి, హత్యకు యత్నించారని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే 13 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి సంగారెడ్డి జైలులో ఉంచగా.. తాజాగా మల్లికార్జున గౌడ్‌ను అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మెదక్ పట్టణంలోని మల్లికార్జున గౌడ్ నివాసానికి శనివారం తెల్లవారుజామున భారీగా పోలీసులు మోహరించారు. ఇంట్లోకి వెళ్లి ఆయన్ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున మల్లికార్జున గౌడ్ నివాసానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు మండిపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో మల్లికార్జున రెడ్డిని అరెస్టు చేసి మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## కోకాపేటలో జలమండలికి 3.95 ఎకరాల భూమి

- గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు నిర్మాణాలు
- హరీష్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వ వివరణ



**హైదరాబాద్, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** కోకాపేట్ నియోపోలిస్‌లోని శారదా పీఠం భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు సంధించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హరీశ్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వం శనివారం క్లారిటీ ఇచ్చింది. నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూమి కేటాయింపు చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఉన్న 8.75 ఎకరాలు ఎంబీఆర్, ఈఎల్ఎస్ఆర్ ల నిర్మాణానికే సరిపోతాయని స్పష్టం చేసింది. ఓహెచ్‌టీ, సైట్ ఆఫీస్, మెయింటెనెన్స్ కోసం అదనపు భూమి అవసరమని జలమండలి ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని గుర్తు చేసింది. 592 మీటర్ల ఎత్తులో భూభాగం – గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అనుకూలమని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపింగ్ అవసరం లేకుండా నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని స్పష్టత ఇచ్చింది. బోజగుట్ట రిజర్వాయర్‌కు గోదావరి జలాల గ్రావిటీ సరఫరా చేస్తామని వివరించారు. తద్వారా ఓల్డ్ సిటీ, షేక్‌పేట్, రెడ్ హిల్స్, మెహిదీపట్నం ప్రాంతాలకు లాభం చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. అంతేకాకుండా కరెంట్ ఛార్జీలు భారీగా ఆదా అవుతాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇక గోదావరి ఫేజ్– ప్రాజెక్ట్ ద్వారా అదనంగా 300 ఎంజిడి నీటి తరలింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

- వికారాబాద్‌లో విషాద ఘటన



**వికారాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** వికారాబాద్‌లో విషాదం నెలకొంది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ బలిజ దివ్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయిబాబా కాలనీకి చెందిన బసవరాజ్ హోంగార్డుగా పనిచేసి ఆరేళ్ల క్రితం మరణించాడు. అతని మూడో కుమార్తె బలిజ దివ్య 2020వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలిజ దివ్య మృతదేహం వద్ద ఒక సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రియమైన అమ్మ, నా కుటుంబసభ్యులు నేను ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు నన్ను క్షమించండి. నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేక ఈ రాంగ్ స్టెప్ తీసుకుంటున్నా. అమ్మా.. నీకు నేను భారం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నా. నాన్న ఉంటే బాగుండే అమ్మ. నాన్న లేనందుకే నీకు ఇన్ని కష్టాలు. నన్ను క్షమించు అమ్మా' అని అందులో రాసి ఉంది. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బలిజ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దొంగనోట్లు చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

- 5,98 లక్షల విలువైన నకిలీ కరెన్సీ స్వాధీనం
- మూడు కార్లు సీజ్.
- మంచిర్యాల ఏసిపి ప్రకాష్





**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతరాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ 5 98 500 విలువగల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. మూడు కార్లను సీజ్ చేసి, నకిలీ కరెన్సీ చలామణి చేసిన 12 మంది నిందితులను అరెస్టు చేయగా ఇద్దరు నిందితులు పరారిలో ఉన్నారని మంచిర్యాల ఏసిపి ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం నాడు మంచిర్యాల జిల్లా లక్షట్ పేట పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన నకిలీ కరెన్సీ చలామణికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులలో ఇటిక్యాల గ్రామానికి చెందిన కానుగంటి క్రాంతి, గడిగొప్పుల రవీందర్ ,శ్రీరాంపూర్ కి చెందిన తాంద్ర ప్రకాష్, వెంకట్రావు పేట గ్రామానికి చెందిన కోన మధుకర్ ,గోదావరిఖని చెందిన సుంక సురేష్ , పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ కి చెందిన కామాని అనిల్, లక్షట్ పేట కు చెందిన బండారి సత్యనారాయణ ,అలాగే రాము నాయక్, జెండా వెంకటాపూర్ కి చెందిన కందిమల్ల తిరుపతి , పెద్దపల్లి జిల్లా పెరిక పల్లి కి చెందిన గొల్ల కుమారస్వామి, లక్షెట్టిపేటకు చెందిన నగునూరి రాము, సిద్దిపేట జిల్లా తిప్పయ్య పల్లి చెందిన దేవబోయిన సంపత్ కుమార్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. తెలుపు రంగు కారు (టీ19బీ+ 9158) పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ. 1,500 విలువైన పెట్రోల్ నింపించుకొని, రూ. 500 చొప్పున మూడు నోట్లు ఇచ్చి వెళ్లిపోవడంతో అవి నకిలీ కరెన్సీగా గుర్తించారు . ఫిర్యాదారుడు సంబారి సత్యనారాయణ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు, ఏసీపీ పర్యవేక్షణలో లక్షెట్టిపేట సీఐ డి. రమణమూర్తి,ఎస్ఐ జి. సురేష్,దండేపల్లి ఎస్ఐ తహసీనుద్దీన్ తదితర సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. దర్యాప్తులో ఏ–1 నుండి ఏ–6 వరకు నిందితులు కాకినాడకు వెళ్లి ఏ–13, ఏ–14 వద్ద నుండి సుమారు రూ. 6 లక్షల నకిలీ కరెన్సీ తీసుకుని లక్షెట్టిపేట ప్రాంతంలో చలామణి చేయడానికి ప్రయత్నించినట్లు వెల్లడైంది. వెంటనే చర్యలు తీసుకున్న పోలీసులు ఏ–1 నుండి ఏ–12 వరకు నిందితులను అదుపులోకి తీసుకుని,రూ. 5,98,500 నకిలీ నోట్లు మరియు మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ చెందిన ఇద్దరు నిందితులు ఏ 13 రాము, ఏ 14 రవిలు పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన లక్షెట్టిపేట సీఐ డి. రమణమూర్తి,ఎస్ఐ జి. సురేష్,ఎస్ఐ తహసీనుద్దీన్ , పోలీస్ సిబ్బందిని మంచిర్యాల ఏసీపీ మరియు డీసీపీ అభినందించారు.

# ఎర్రబంగారం రైతుల్లో ఆనందం

- గతంలో ఎప్పుడూ లేనంతగా పైపైకి మిర్చి ధరలు



**వరంగల్, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** మిర్చి రైతులకు మళ్లీ చాలాకాలం తరవాత మద్దతు ధరలను మించి ధరలు దక్కుతున్నాయి. ఆలస్యంగా అయినా ధరలు దక్కడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ చుట్టుపక్కల రైతులు మిర్చిని నాణ్యతతో పండిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో చపాట దేశీ మిర్చి ధరలు పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకున్నాయని రైతులు అన్నారు. ఈ–నామ్ విధానంలోని ఈ–వేలంలో వ్యాపారులు క్వింటాకు గరిష్టంగా రూ. 18,789, కనిష్టంగా రూ. 17,521, సగటున రూ. 18,489 ధరల చొప్పున ఖరీదులు చేశారు. మార్కెట్‌లో ఈ నెల మొదటివారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ. 16,300 నుంచి రూ. 16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ. 17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ. 18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. 2021–22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ. 30వేల నుంచి రూ. 40వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ. 12వేల నుంచి రూ. 16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్లో దేశీ మిర్చి క్వింటాకు రూ. 50 వేలు పలికింది. జియోట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్టంగా క్వింటాకు ఈ విధంగా ఉన్నాయి. తేజ – రూ. 18,700, వండర్‌హాట్ – రూ. 36వేలు, దీపిక రూ. 30 వేలు, యూఎస్ 341 – రూ. 22.100, ఎల్లో మిర్చి (తేజ) రూ. 23 వేలు, తాలు మిర్చి రూ. 12వేలు ధర పలికాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 45 మంది రైతులు 495 బస్తాల్లో తేజరకం మిర్చి విక్రయానికి తీసుకువచ్చారు.

## పశ్చిమాసియాకు విమానాలు నిలిపివేత

- ఏయిరిండియా, ఇండిగో సర్వీసుల రద్దు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా దాడులు జరుపుతుండటంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ప్రతిదాడులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌కు పలు దేశాలు తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ఇండిగో, ఎయిరిండియా ప్రకటించాయి. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు కీలకమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విమానయాన సంస్థల్లో ఎయిర్ ఫ్రాన్స్, ఎయిరిండియా, బ్రిటిష్ ఎయిర్ వేస్, ఐబీరియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, జపాన్ ఎయిర్‌లైన్స్, ఎల్ఓటీ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా, నార్వేజియన్ ఎయిర్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎయిర్ అల్జీరియా, స్కాండేవియన్ ఎయిర్‌లైన్స్, విజ్ ఎయిర్ ఉన్నాయి. ఇరాన్ లక్ష్యంగా క్షిపణులు, బాంబులతో ఇజ్రాయెల్ శనివారంనాడు దాడులకు దిగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. ముప్పును ముందస్తుగా నివారించేందుకు ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆ వెంటనే అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తగా సైనిక చర్యకు దిగిట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా తమ సైనిక చర్యను అమెరికా, 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా తమ సైనిక చర్యను ఇజ్రాయెల్ ప్రకటించుకున్నాయి. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమా సియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. తమదేశంలోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు బహ్రెయిన్ ధ్రువీకరించింది. అయితే ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది.

## కర్కశ కొడుకు దుర్మార్గపు చర్య

- తల్లిపై దారుణంగా దాడి
- బతికుండగానే మంటల్లోకి నెట్టి

**నిజామాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా లోని కోట గిరిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. వృద్ధురాలైన తన కన్నతల్లిని మద్యానికి బానిసైన ఓ కొడుకు సజీవ దహనం చేశాడు. కోటగిరికి చెందిన భూమవ్వ కొడుకు మద్యానికి బానిసై రోజూ డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం కూడా డబ్బుల కోసం భూమవ్వతో గొడవపడ్డాడు. ఆమె తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో దాడి చేసి చంపాడు. తల్లిపై ఇంట్లోని పాత దుస్తులు వేసి నిప్పంటించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## యాదగిరీశుడి సేవలో త్రిపుర గవర్నర్

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం కుటుంబసమేతంగా యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన.. వీవీఐపీ అతిథి గృహం నుంచి ప్రధానాలయంలోకి వెళ్లారు. ఆలయ ముఖ మండపం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోకి తీసుకెళ్లి స్వయంభు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి ప్రధానార్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా.. ఏవో భవానీ స్వామి వారిప్రసాదాన్ని అందజేశారు.

## మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు

- పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ. 3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ. 1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ. 3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ. 2,900ల మేర పెరిగి రూ. 1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ. 5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ. 3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ. 1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ. 1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ. 1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ. 1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ. 3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ. 2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.

# సమానత్వమే ప్రాణంగా సాహిత్యం రావాలి

- అన్ని రకాల ఆధిపత్యాలను ధిక్కరిస్తూ కళాలు గళాలు లేవాలి
- ప్రముఖ కవులు రచయితల ఉద్ఘాటన




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సమాజంలోని ఆటుపోట్లను ఎదుర్కొని సమస్యల సాగరాలని ఎదురీదేవాడే కవి అని, దేశాన్ని మతతత్వ వాదం నుంచి రక్షించాల్సిన బాధ్యత సాహితీ లోకానిదేనని పలువురు కవులు రచయితలు సామాజిక వాదులు తెలిపారు. కష్టం చేసే ప్రతి ఒక్కరికి ఫలితాలు దక్కాలని, ఆ దిశగా కొత్త తరం కలాలను పదునెక్కించాలని పిలుపునిచ్చారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ షహబాజ్ అహ్మద్ ఖాన్ రచించిన గుండె నెత్తుటి సిరా కవిత్వ సంకలనాన్ని ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మూల స్తంభం కవి అని తెలిపారు. సమాజంలో జరుగుతున్న సాధారణ సంఘటనలను అందరి సమస్యలుగా మలిచి ఆలోచింపజేసేది కవిత్వమని పేర్కొన్నారు. షహబాజ్ దేశంలోని సమస్యలతో పాటు అంతర్జాతీయంగా ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను కూడా దార్శనిక దృష్టితో రాశారని విశ్లేషించారు.

**కవిత్వం దాచక్కర్లేని నిజం : దేశపతి శ్రీనివాస్**

కవిత్వం దాచనక్కర్లేని నిజమని కవి వాగ్గేయకారుడు శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ అన్నారు. సంకెళ్లు లేని సమాజాన్ని నిర్మించడమే కవి రచయిత లక్ష్యం కావాలన్నారు. సమాజ ప్రతి మలుపులు జరుగుతున్న సంఘటనను సమస్యలకు భావోద్వేగాలను నేటితరం కవిత్వీకరించి దారి చూపాలని కోరారు. భావజాల రంగాలలో జరుగుతున్న సంఘర్షణల నుంచి సామాన్యునికి ఊపిరిగా నిలిచే కవిత్వాన్ని షహబాజ్ రచన చేసి సమాజానికి అందించాలని పేర్కొన్నారు. బాధకు పర్యాయపదం కవిత్వమని, సంవేదన శీలి షహబాజ్ అని అభివర్ణించారు.

**నేటితరం నిబద్ధతతో రాయాలి : జూలూరు గౌరీ శంకర్**

సమాజానికి అవసరమైన కవిత్వాన్ని నేటి తరం నిబద్ధత నిమగ్నతలతో రాయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ బహుజన కవి జూలూరు గౌరీ శంకర్ అన్నారు. నేటికీ సమాజంలో కుల దురహంకారం ఆధిపత్య వర్గాల పెత్తనాల రూపంలో కొనసాగటం విచారకరమన్నారు. కురివి, కోదాడ, ఖమ్మం లాంటి సంఘటనలు మానవత్వానికి మాయని మచ్చలు అన్నారు. తెలుగు సాహిత్యంలో సంధి కాలం కొనసాగుతుందని ఇక ఇక్కడ నుంచి బహుజన సాహిత్యం విరివిగా రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కాలానికి ఏ రకమైన సాహిత్యం కావాలో, నిస్తేజమైన స్థితి నుంచి సమాజాన్ని ముందుకు నడిపించడానికి కొత్త తరం కవులు స్పష్టమైన ఆలోచనతో ముందుకు రావాలన్నారు. సమాజంలో జరుగుతున్న అన్ని రకాల దురాగతాలని షహబాజ్ తన గుండె నెత్తుటి సిరాలో ఆవిష్కరించారని జూలూరు విశ్లేషించి చెప్పారు.

**సోయితో సాహిత్యం రాయాలి : పాశం యాదగిరి**

పర్యావరణ పరిరక్షణ సోయితో సాహిత్యం రావాలని సీనియర్ జర్నలిస్ట్, సామాజిక ఉద్యమకారుడు పాశం యాదగిరి తెలిపారు. సమాజంలో దిగజారుతున్న రాజకీయ విష సంస్కృతిని విప్పి చెబుతూ మంచి సమాజ నిర్మాణానికి సాహిత్యాన్ని పనిముట్లుగా అందించే బాధ్యత నేటి తరం తీసుకోవాల న్నారు. నవతరం సమాజ నిర్మాణంలో పాలుపంచుకోకపోతే ఆ సమాజానికి మనుగడ ఉండద న్నారు. షహబాజ్ పదునైన రాజకీయ దృక్పథంతో కవిత్వ రచన చేశారని పేర్కొన్నారు.

**రాజ్యాంగం రక్షణకు రచన చేయాలి : మాడభూషి శ్రీధర్**

రాజ్యాంగాన్ని రక్షించడం కోసం కవులు రచయితలు సామాజిక ఉద్యమకారులు తమ కలాలను గళాలను విప్పాలని కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రఖ్యాత రచయిత మాడభూషి శ్రీధర్ తెలిపారు. దేశంలో కూలిపోతున్న ప్రజాస్వామిక విలువలను కాపాడేందుకు కవులు కంకణదారులు కావాల న్నారు. షహబాజ్ నిబద్ధత నిమగ్నత ఉన్న శక్తివంతమైన యువకవి అని అభివర్ణించారు.

**నేటితరానికి ఆదర్శవంతం : గోవర్ధన్**

కవికుండాల్సిన సామాజిక బాధ్యతను గుండె నిండా నిప్పుకొని షహవాజ్ ధర్మాగ్రహంతో రాసిన కవిత్వం నేటి తరానికి ఆదర్శవంతమైందని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ తెలిపారు. జాతీయ అంతర్జాతీయ అంశాలపై నిరంతరం స్పందిస్తూ మానవీయ విలువలతో సాహిత్య సృష్టి చేయాలంటే అందుకు కవులకు నిబద్ధత నిమగ్నత ఉండాలన్నారు. మత సామరస్యాన్ని కోరిన కవులు మానవీయ విలువలతో కవిత్వాన్ని రాసి సమాజానికి అందించగలరని చెప్పారు. మత ఘర్షణలను రెచ్చగొడుతున్న ఈ సమయంలో సమానత్వాన్ని సమదృష్టి నీ కోరే రచయితలు రావాల్సిన అవసరం ఎంతుందో షహబాజ్ కవిత్వం తెలియజేస్తుందని వివరించారు.

**ఆదిపత్య వర్గాల నియంతృత్వ ధోరణి : తొలి వెలుగు రఘు**

ప్రశ్నించే గొంతులు మూగబోతే ఆదిపత్య వర్గాలు నియంతృత్వ ధోరణితో ప్రజలపై విరుచుకుపడతారని సీనియర్ జర్నలిస్ట్, తొలి వెలుగు ఛానల్ ఎడిటర్ రఘు తెలిపారు. ఖమ్మంలో పేదల గుడిసెలను కూల్చివేయడం, కుమ్మెరలో కుల ఆధిపత్యాలు పెచ్చులెల్లడం అరాచకత్వాలకు నిదర్శనాలని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి కవులు రచయితలు సాంస్కృతిక ఉద్యమాలు చేపట్టాలని కోరారు.

**మతతత్వం పెచ్చరిల్లుతోంది : శ్రీధర్ రావు దేశ్ పాండే**

దేశంలో జాతీయ మతతత్వం పెచ్చరిల్లుతుందని ప్రఖ్యాత రచయిత జలరంగ నిపుణులు శ్రీధర్ రావు దేశ్పాండే తెలిపారు. రాజ్యాంగాన్ని పంచిన వారే జాతీయ వాదులవుతారన్నారు. దేశదేశాల సార్వభౌమ త్వాన్ని దెబ్బతీస్తున్న సామ్రాజ్యవా దానికి వ్యతిరేకంగా నిలబడిన ప్పుడే విశ్వ మానవ కల్యాణం వర్ధిల్లుతుందని తెలియజే శారు. ఈ సభకు ప్రముఖ గాంధీయవాది, భూదాన పరిర క్షణ ఉద్యమ కారుడు రాజేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా పుస్తక రచయిత డాక్టర్ శేహబాజ్ అహ్మద్ ఖాన్ తదితరులు మాట్లాడారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370